జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

కృష్ణ | గురువారం 1 అక్టోబర్ 2026 | సంపుటి : 01 | సంచిక :258 | పేజీలు : 12 | వెల : 3/- | PRGI No. APTEL/26/A0119,

శ్రీ పరాభవ నామ సంవత్సరం ఆషాఢ మాసం గ్రీష్మ ఋతువు దక్షిణాయణం సూర్యోదయం: 5.42 । సూర్యాస్తమయం: 6.22 చంద్రోదయం: 4.57 । చంద్రాస్తమయం: 5.20 తిథి: బహుళ చతుర్దశి రా. 1.37 వరకు, తదుపరి అమావాస్య నక్షత్రం: పుష్యమి సా. 10.23 వరకు, తదుపరి ఆశ్లేష యోగం: సిద్ధి రా. 8.18 వరకు, తదుపరి వ్యతీపాత కరణం: భద్ర మ. 2.45 వరకు, తదుపరి శకుని రా. 1.37 వరకు, తదుపరి చతుష్పాద

Published from KRISHNA, GUNTOORU, VIJAYAWADA, VISHAKAPATANAM, TIRUPATHI http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జీలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.

అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు

9440231967

## రబీ పంటల కనీస మద్దతు ధరలు పెంపు



- కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయం
- మద్దతు ధర పెంచాక రూ.2,610కు చేరిన క్వింటా గోధుమలు
- ఢిల్లీలో ట్రాఫిక్ సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు
- ఢిల్లీ ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి ఏఐ సాయం తీసుకుంటామన్న అశ్వినీ వైష్ణవ్

## రష్యా సైన్యంలో చేరొద్దు.. అది చాలా ప్రమాదకరం!



- భారతీయులకు కేంద్రం తీవ్ర హెచ్చరిక
- డబ్బు ఆశతో ప్రమాదకర మార్గంలో వెళ్లొద్దని సూచన
- పౌరసత్వం వదులుకుని మరీ కొందరు సైన్యంలో చేరుతున్నారని ఆందోళన
- ఇప్పటివరకు 139 మందిని సురక్షితంగా వెనక్కి రప్పించినట్లు వెల్లడి
- మిగిలిన వారిని రప్పించేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయి




## ప్రపంచ శాంతిపైనా ఫోకస్!

- ట్రంప్- మోదీ ఫోన్ సంభాషణ
- వాణిజ్యం నుంచి రక్షణ వరకు కీలక అంశాలపై చర్చ
- ఫోన్‌లో మాట్లాడుకున్న భారత ప్రధాని నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్
- ద్వైపాక్షిక సహకారం, వాణిజ్య అంశాలపై సమీక్ష
- అంతర్జాతీయ పరిణామాలు, ప్రపంచ శాంతి భద్రతలపైనా చర్చలు!



# యువత మార్పు కోరుకుంటోంది

- యువతకు ఉద్యోగాలే తొలి లక్ష్యం
- క్వాంటమ్ నుంచి ఉద్యోగాల వరకు.. ఏపీ భవిష్యత్‌పై లోకేశ్ కీలక వ్యాఖ్యలు
- 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యమన్న మంత్రి లోకేశ్
- డీఎస్సీపై ఆరోపణలను కొట్టివేసిన లోకేశ్
- అమరావతిలో 156 బిట్ క్వాంటమ్ కంప్యూటర్ ఏర్పాటు ప్రస్తావన
- పెట్టుబడులకు 3ఎస్ విధానం అనుసరిస్తున్నామని వివరణ

**అమరావతి**

యువతకు ఉద్యోగాల కల్పనే తమ ప్రభుత్వ ప్రధాన ఎజెండా అని ఏపీ విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. కొచ్చిలో జరిగిన ఇండియా టుడే కాంక్లేవ్ సౌత్--2026లో సీనియర్ జర్నలిస్టు, ఇండియా టుడే కన్సల్టింగ్ ఎడిటర్ రాజ్‌దీప్ సర్దేశాయ్‌తో జరిగిన ఇంటర్వ్యూలో ఆయన పలు అంశాలపై మాట్లాడారు. యువత తమను అడుగుతున్నది ఒక్కటేనని.. మరిన్ని ఉద్యోగాలు కల్పించాలని కోరుకుంటున్నారని లోకేశ్ చెప్పారు. అందుకే ప్రభుత్వం 20 లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. విద్యా పాఠ్యాంశాలను పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా- మిగతా3లో

## పేదలందరూ ఆనందంగా ఉంటే అదే

# నిజమైన అభివృద్ధి




- పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వడం స్వర్ణాంధ్ర సాధనకు తొలి మెట్టు
- అలాంటి అభివృద్ధి సాధించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం
- ప్రతి పేదవారికీ గృహకల్పనతో శాశ్వత భద్రత కల్పించడాన్ని బాధ్యతగా తీసుకున్నాం
- డబుల్ ఇంజిన్ సర్కార్‌తో జెట్ స్పీడ్‌తో దూసుకెళ్తున్నాం
- "ఇంటిపట్టా అనేది పేద ప్రజల దశాబ్దాల కల

**అమరావతి**

సంక్షేమం, అభివృద్ధి, సంపద సృష్టి, నిరంతరం జరగాలని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. పెట్టుబడులు తెచ్చి యువతకు ఉపాధి కల్పిస్తున్నామని చెప్పారు. ప్రాజెక్టులు పూర్తి చేస్తున్నామని పంటలకు నీళ్లు ఇస్తున్నామని తెలిపారు. రాయలసీమ హార్టీకల్చర్ హబ్‌కు రూ.లక్ష కోట్లు ఖర్చు చేస్తున్నట్లు వివరించారు. విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య స్టేడియంలో ఏర్పాటు చేసిన 'పేదలకు పట్టాభిషేకం' కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొని మాట్లాడారు. అంతకుముందు చంద్రబాబు వేదికపై ఏర్పాటు చేసిన స్టేజ్‌పై నడిచి ప్రజలకు అభివాదం చేశారు. స్టేజ్‌పై సీఎం వెంట మంత్రులు సత్యకుమార్, మనోహర్ ఉన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్నామని చంద్రబాబు పేర్కొన్నారు. డబుల్ ఇంజిన్ సర్కార్‌తో - మిగతా3లో



## ఎన్నికల సంఘం పనితీరుకు నిరసనగా

# 2న 'జైల్ భరో'

- అభిజిత్ దిప్కే పిలుపు
- జైల్ భరో ఆందోళన్ నిరసన కార్యక్రమంలో అన్ని రాజకీయ పార్టీలు పాల్గొనాలని దీప్కే విజ్ఞప్తి
- అక్టోబర్ 4న శాక్రే సోదరుల భారీ మార్చ్

## సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనలో ఏపీని ఆదర్శంగా నిలపడమే

# ప్రభుత్వ లక్ష్యం

- పేదలకు గరిష్ఠ ప్రయోజనం.. పాలనపై సీఎం చంద్రబాబు కీలక ఆదేశాలు
- సంక్షేమ పథకాల కన్వర్జెన్స్‌తో పేదలకు గరిష్ఠ ప్రయోజనం చేకూర్చాలని సీఎం ఆదేశం
- ప్రజాప్రతినిధులు, ఉద్యోగులకు ఐఐఎం, ఐఐటీల్లో శిక్షణ ఇచ్చే అంశంపై పరిశీలన
- పీ4 కార్యక్రమం పర్యవేక్షణకు సోషల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ తరహా వ్యవస్థ ఏర్పాటు
- అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి ప్రజల నమ్మకాన్ని నిలబెట్టాలని సూచన



**అమరావతి**

రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలను సమన్వయం చేయడం ద్వారా పేదలకు గరిష్ఠ ప్రయోజనం చేకూరేలా చూడాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. పాలనలో నాణ్యత, పారదర్శకతను పెంపొందించేందుకు ప్రభుత్వ ఉద్యోగులతో పాటు ప్రజాప్రతినిధులకు కూడా ఐఐఎం, ఐఐటీల వంటి ప్రతిష్ఠాత్మక సంస్థల్లో శిక్షణ ఇప్పించే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. బుధవారం 'పేదల సేవలో - సంక్షేమ కార్యక్రమాల కన్వర్జెన్స్' అనే అంశంపై మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్లు, ఉన్నతాధికారులతో ఆయన - మిగతా3లో




## ఈసీపై 'ఇండియా' కూటమి సమరశంఖం

- దేశవ్యాప్త ఆందోళనలకు పిలుపు
- అక్టోబర్2 నుంచి 'సేవ్ డెమోక్రసీ' యాత్ర
- సీఈసీ రాజీనామా చేయాలని నేతల డిమాండ్
- ఉద్యమ కార్యాచరణను ఖరారు చేసిన ఇండీ కూటమి
- అక్టోబర్ 6న ఈసీ కార్యాలయం వరకు విపక్ష ఎంపీల ప్రదర్శన
- సర్ ప్రక్రియకు ముందున్న ఓటర్ల జాబితానే పరిగణనలోకి తీసుకోవాలని స్పష్టం చేసిన కూటమి

## ఏపీలో సర్ గడువు

# పొడిగింపు

- అధికారులకు కీలక ఆదేశాలు
- అక్టోబర్ 10 వరకు అభ్యంతరాలు, ఫిర్యాదుల పరిష్కారం
- అక్టోబర్ 16న తుది ఓటర్ల జాబితా ప్రచురణ
- అర్హులైన ఏ ఒక్క ఓటరు మిగిలిపోకూడదనే ఈ నిర్ణయం
- కొత్త తేదీలపై విస్తృత ప్రచారం చేయాలని అధికారులకు ఆదేశం



**అమరావతి**

ఆంధ్రప్రదేశ్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) కార్యక్రమ గడువును భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) మరోసారి పొడిగించింది. తాజా ఉత్తర్వుల ప్రకారం, తుది ఓటర్ల జాబితాను 2026 అక్టోబర్ 16న ప్రచురించనున్నారు. గతంలో ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఈ ప్రక్రియ అక్టోబర్ 9న పూర్తి కావాల్సి ఉండగా, తాజాగా మరో వారం పాటు గడువు పెంచడం గమనార్హం. కొత్త షెడ్యూల్ ప్రకారం, ఓటర్ల జాబితాపై అందిన అభ్యంతరాలు, ఫిర్యాదుల పరిష్కార గడువును అక్టోబర్ 10 వరకు పొడిగించారు. ఈ గడువులోగా వచ్చిన అన్ని దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలని అధికారులను ఈసీ ఆదేశించింది. - మిగతా3లో

# 24వ అంగన్వాడీ కేంద్రంలో ఘనంగా అంగన్వాడీ ఉత్సవాలు

**పాల్గొన్న సూపర్ వైజర్ దస్తగిరమ్మ**

**నంద్యాల ఆళ్లగడ్డ:సెప్టెంబర్=30 ప్రజాజ్యోతి** ఆళ్లగడ్డ పట్టణంలోని 24 వ అంగన్వాడీ కేంద్రంలో అంగన్వాడీ వర్కర్ విజయరాణి అంగన్వాడీ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 25 సంవత్సరాల ప్రజాసేవను పురస్కరించుకొని సెప్టెంబర్ 25 నుండి అక్టోబర్ 7 వ తేదీ వరకు అంగన్వాడీ ఉత్సవాలు జరుపుతున్నాము. అందులో భాగంగా ఈ రోజు15 వ అంగన్వాడీ కేంద్రానికి సంబందించిన గర్భవతులు, బాలింతలు, పిల్లల తల్లులు, ప్రీ స్కూల్ పిల్లల తల్లులు అందరూ హాజరైనారు ఈ అంగన్వాడీ ఉత్సవానికి ఐ సి డి యస్ ఆళ్లగడ్డ అర్బన్ సూపర్ వైజర్ దస్తగిరమ్మ హాజరై 3 సంవత్సరాలు నిండిన పిల్లల తల్లులను ఉద్దేశించి మాట్లాడుతూ. పిల్లలకు ఆట పాటల ద్వారా విద్యాబినయ గేయాలు, బొమ్మలకు రంగులు వేయడం లాంటి కార్యక్రమాలు అంగన్వాడీ కేంద్రాలలో పిల్లల కోసం చేయించడం జరుగుతుందని. అంగన్వాడీ పిల్లలకు ప్రభుత్వం నుండి వచ్చే తెలుగు, ఇంగ్లీష్, లెక్కలు యాక్టివిటీ బుక్స్ ద్వారా అంగన్వాడీ కార్యకర్త పిల్లలకు బోదించడం జరుగుతుందని. అలాగే ఉదయం 10 గంటలకు పిల్లలకు గుడ్డు, 12 గంటలకు వేడి భోజనం, 3 గంటలకు పాలు అందిస్తామని కావున పిల్లల తల్లులు తమ పిల్లలను కచ్చితంగా అంగన్వాడీ కేంద్రాలకు పంపాలని కోరారు. 15 వ అంగన్వాడీ కేంద్రంలో పౌష్టికాహార ప్రత్యక్ష ప్రదర్శన, పోషక ఆహారం, గురించి, మాతృసంరక్షణ, టీకాలు, శిశుఅభివృద్ధి, మహిళా సాధికారత, స్వచ్ఛత, అంగన్వాడీ కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి గర్భిణులు, బాలింతలు, పిల్లల తల్లులకు పౌష్టికహారం, ఆకుకూరలు, కూరగాయలు, త్రుణదాన్యాలు, పండ్లు యొక్క ప్రాధాన్యత గురించి వివరిస్తున్నారని తదితర అంశాలపై అంగన్వాడీ కేంద్రాల్లోఅందించే సేవల గురించి తల్లులకు సూపర్ వైజర్ దస్తగిరమ్మ వివరించారు.అనంతరం సూపర్ వైజర్ దస్తగిరమ్మ అంగన్వాడీ వర్కర్ జి. అరుణ కుమారి గర్భవతులను, పిల్లల తల్లులను సన్మానించారు. అనంతరం పిల్లల తల్లులు అంగన్వాడీ వర్కర్ ను హెల్పర్ ను సన్మానించారు. ఈ కార్యక్రమం లో అంగన్వాడీ హెల్పర్ విజయలక్ష్మి, ఆశా వర్కర్ పద్మ, గర్భవతులు, పిల్లల తల్లులు పాల్గొన్నారు.



# విద్యాభివృద్ధికి కృషి చేయాలి

**: బిసి రాజారెడ్డి**

**బనగానపల్లె:సెప్టెంబర్=30 ప్రజాజ్యోతి** ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించి కొత్తగా ఎన్నికైన విద్యా కమిటీ చైర్మన్ లు ఆయా పాఠశాలల అభివృద్ధితోపాటు విద్యాభివృద్ధికి కృషి చేయాలని బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్, అరుణ భారతి సాహితీ సంస్థ అధ్యక్షులు బిసి రాజారెడ్డి సూచించారు. బనగానపల్లె మండలం ఇల్లూరు కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యా కమిటీ చైర్మన్గా నషిమూన్, ప్రాథమిక పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ గా వలి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు మాజీ సర్పంచ్ రామిరెడ్డి ఆధ్వర్యంలో కొత్తగా ఎన్నికైన విద్యా కమిటీ చైర్మన్ లు మర్యాదపూర్వకంగా బిసి రాజారెడ్డిని కలిశారు ఈ సందర్భంగా బిసి రాజారెడ్డి మాట్లాడుతూ.. విద్యా కమిటీ చైర్మన్లు ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులను సమన్వయం చేసుకొని ఆయా పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కోట్లాది రూపాయల నిధులు ఖర్చు చేస్తూ విద్యార్థులకు అవసరమైన వసతులు కల్పిస్తుందన్నారు. ప్రభుత్వం పాఠశాలల అభివృద్ధి కోసం కేటాయిస్తున్న నిధులు దుర్వినియోగం కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత విద్య కమిటీ చైర్మన్ లపై ఉంటుందన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలలో ఎక్కువ మంది విద్యార్థులు చేరేలా చూడాలన్నారు. విద్య ఎంత అభివృద్ధి చెందుతే సమాజం అంత బాగుపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో గోధుల సుదర్శన్ రెడ్డి, సురేష్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ బాల నాయుడు, చిలకల రాజు, కాసిం, కిట్టు, సుబ్బరామయ్య పాల్గొన్నారు.



# అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్ సీఎం చంద్రబాబు నాయుడు నూనెపల్లె అభివృద్ధికి కట్టుబడి ఉన్నా

## సమస్య మీది కాదు నాది పరిష్కారం అయ్యేంత వరకు వదలను.

## ఈ రోజే మీ సమస్య పై అన్ని శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశం.

**నంద్యాల:సెప్టెంబర్=30 ప్రజాజ్యోతి** గత ఐదేళ్ళ వైసీపీ ప్రభుత్వం నూనెపల్లె అభివృద్ధిని విస్మరించింది. ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి హామీతో నూనెపల్లె అభివృద్ధి కమిటీ దీక్ష విరమణ. అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అని, నూనెపల్లె వద్ద రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణం కోసం తాను ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి అవసరమైన నిధుల విడుదలకు పరిపాలన అనుమతి తీసుకున్నానని, నూనెపల్లె అభివృద్ధి విషయంలో మా మంచి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, సమస్య మీది కాదు నాది వాటిని పరిష్కరించెంత వరకు వదిలేదని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎంపీ బైరెడ్డి శబరి స్పష్టం చేశారు. నూనెపల్లె అభివృద్ధి కమిటీ పేరుతో సీనియర్ న్యాయవాది బి. శంకరయ్య ఆధ్వర్యంలో నూనెపల్లి వద్ద రైల్వే అండర్ పాస్ వంతెన ఏర్పాటు చేయాలని రెండు రోజులుగా సామూహిక దీక్ష చేస్తున్నారు. బుధవారం నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి నూనెపల్లిలోని దీక్ష శిబిరంకు వచ్చి నూనెపల్లె అభివృద్ధికి, రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణం కు ఉమ్మడి ప్రభుత్వం తీసుకుంటున్న అన్ని విషయాలు వివరించారు. తాను, మంత్రి ఎన్ ఎం డి ఫరూక్ నూనెపల్లి రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి కోసం ఇప్పటి వరకు చేసిన, చేపట్టబోయే అంశాలను నూనెపల్లె అభివృద్ధి కమిటీకి ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి వివరించారు.ఈ రోజే మరి కొద్దిసేపట్లో నంద్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ రాజకుమారి అధ్యక్షతన రైల్వే, మున్సిపల్, రెవిన్యూ, ఆర్ అండ్ బి తదితర అన్ని శాఖల అధికారులతో కీలక సమావేశం ఏర్పాటు చేసి, వాటి సమాచారం రేపటి లోగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వద్దకు మీ సమస్య పరిష్కారం కోసం ఫైల్ వెళుతుందని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి హామీ ఇచ్చారు.చిన్న ఉద్యమం అయినా ఎంపీ డాక్టర్ శబరి వచ్చారన్నారు. ఇది చిన్నది కాదు, మీ కష్టం నాకు తెలుసు ఇదేళ్లు వైసీపీ పట్టించుకోలేదు. మీ బిడ్డగా తాను ఎంపీ అయిన రెండు నెలలకే ఢిల్లీలో కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వనీ వైష్టవ్ దృష్టికి రెండేళ్ల క్రితం తీసుకొల్లా,సమస్యకు శాశ్వత పరిష్కారం కావాలనీ కేంద్ర రైల్వే మంత్రి నీ, సీఎం చంద్రబాబును కోరా అన్నారు. ఎంపీ గా తాను, మంత్రి ఫరూక్, నంద్యాల జిల్లా కలెక్టర్ బాగా స్పందించాం. ఈ రోజు అన్ని శాఖల అధికారుల సమావేశం ఏర్పాటు కు సీఎం చంద్రబాబు స్పందించారు రేపటి లోగా సీఎం ఆఫీస్ కు వెళుతుంది. మంత్రి ఫరూక్ నేను కలిసి మీ సమస్య పరిష్కరిస్తాం అని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. కుల, మతాలకు, పార్టీలకు అతీతంగా నూనెపల్లె అభివృద్ధి కమిటీ పేరుతో చేస్తున్న మీ ఐక్యతకు అభినందనలనీ మీ సహకారం మా ఉమ్మడి ప్రభుత్వం కు ఎంతో అవసరం.పని కానప్పుడు దీక్షచేద్దాం. మీది కాదు ఇది నా బాధ్యత మీరూ దీక్ష విరమణ చేయండని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి కోరగానే ఒక్కసారిగా వందలాది మంది నూనెపల్లె ప్రజలు, ఉద్యమకారు లు హర్షధ్వనాలతో ఆహ్వానించి, దీక్ష విరమించారు. దీక్ష శిబిరం నుంచి పక్కనే ఉన్న నూనెపల్లె రైల్వే అండర్ పాస్ వంతెన అవసరం అయ్యో రైల్వే ట్రాక్ ను ఉద్యమకారులతో కలిసి ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి పరిశీలించారు.







# ఆలమూరు ఎండీఓ ఏ. రాజు ను సన్మానించిన దళిత నాయకులు.

**ఆలమూరు, సెప్టెంబర్ 30 (ప్రజాజ్యోతి):**డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం, కోర్టు ప్రాంగణాలను ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సహకారంతో ఆహ్లాదకరంగా అభివృద్ధి చేయడంతో పాటు, మండలంలోని 18 గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీ, పారిశుధ్యం తదితర అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి ప్రజల మన్ననలు పొందుతున్న ఆలమూరు మండల అభివృద్ధి అధికారి (ఎండీఓ) ఏ. రాజును దళిత నాయకులు దడాల చందర్రావు, జల్లి వెంకట్రావు, గంటా మధు ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఎండీఓ ఏ. రాజుకు దుశ్శాలువా కప్పి అభినందనలు తెలిపారు.మండలంలోని గ్రామాల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని, ప్రజలకు ప్రభుత్వ కార్యక్రమాలపై అవగాహన కల్పించడంలో ఎండీఓ ముందుండాలని వారు ఆకాంక్షించారు.అధికారులతో సమన్వయం చేసుకుంటూ అభివృద్ధి కార్యక్రమాలను చాకచక్యంగా అమలు చేయగల సామర్థ్యం ఎండీఓ ఏ. రాజుకు ఉందని దళిత నాయకులు పేర్కొన్నారు. ఆయన చేస్తున్న సేవలను గుర్తించి ఈ చిరు సత్కారం నిర్వహించి అభినందనలు తెలియజేస్తున్నామని దడాల చందర్రావు, గంటా మధు తెలిపారు.



# పాఠశాల యాజమాన్య కమిటీ 3వ తేదీకి వాయిదా



**బద్వేల్ స్టాఫ్ రిపోర్టర్ సెప్టెంబర్ 30 (ప్రజా జ్యోతి)**అక్టోబర్ ఒకటవ తేదీ నిర్వహించాల్సిన పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు అక్టోబర్ 3వ తేదీకి వాయిదా పడినట్లు బద్వేలు మండల విద్యాశాఖ అధికారి ఎస్.మల్లిక ఒక ప్రకటనలో తెలియజేశారు. 1వ తేదీ హార్టికల్చర్ కు సంబంధించిన వివిధ కార్యక్రమాలు జిల్లా వ్యాప్తంగా చేపట్టాల్సి ఉన్నందున, జిల్లా విద్యాశాఖ అధికారుల ఆదేశాల మేరకు అక్టోబర్ 3వ తేదీ ఎస్ఎంసి ఎన్నికలను నిర్వహిస్తామన్నారు. ఇప్పటికే ఎస్ఎంసి ఎన్నికల షెడ్యూల్ ప్రకారం ఓటర్ల జాబితా తయారీ, అభ్యంతరాల స్వీకరణ, ఓటర్ల తుది జాబితా ప్రకటన వంటి కార్యక్రమాలను అన్ని పాఠశాలల స్థాయిలో చేపట్టామన్నారు. 1 తేదీ నిర్వహించాల్సిన ఎన్నిక వాయిదా పడినందున మండల పరిధిలోని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులందరూ ఈ విషయాన్ని విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియజేసి 3 తేదీ ఎస్ఎంసి సమావేశం నిర్వహించి ఎన్నిక జరపాలని తెలియజేశారు.

# దేశ నిర్మాణంలో యువత పాత్ర అత్యంత కీలకం,

**వికసిత్ భారత్ లక్ష్య సాధనలో యువత చురుకైన భాగస్వాములుగా ముందుకు రావాలి.**

**నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి.**



**నంద్యాల:సెప్టెంబర్=30 ప్రజాజ్యోతి** చదువుతో పాటు నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు సృజనాత్మకతను పెంపోందించుకొని ఉన్నత శిఖరాకు ఎదగాలని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు.బుధవారం నంద్యాల మండలం అయ్యలూరు మెట్ట వద్ద ఉన్న ఎస్ వి ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో జిల్లా యువజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో యువజన ప్రతిభ ప్రదర్శన జరిగింది. ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియతో కలిసి ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి పాల్గొన్నారు. యువజన ఉత్సవాల్లో భాగంగా జానపద నృత్యం, జానపద గీతం, నుక్కడ్ నాటకం, చిత్రలేఖనం, కవితా రచన తదితర పోటీలను నిర్వహించారు. యువత తమ కళా, సాంస్కృతిక ప్రతిభను ప్రదర్శించేలా ఈ పోటీలు జరిగాయి.ఈ సందర్బంగా ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లాడుతూ దేశ ప్రగతిలో యువత కీలక భాగస్వాములని.యువతలోని ప్రతిభ, నైపుణ్యాలను వెలికితీసి, వారిని దేశాభివృద్ధిలో భాగస్వాములను చేయడమే యువజన ఉత్సవాల ప్రధాన ఉద్దేశమని నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. వికసిత్ భారత్ 2047, స్వర్ణాంధ్ర 2047 లక్ష్యాల సాధనలో యువత కీలక పాత్ర పోషించాలని, విద్యతో పాటు నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని సూచించారు. రాయలసీమ అభివృద్ధి దిశగా ముందుకు సాగుతున్న నేపథ్యంలో యువతకు అందుబాటులోకి వస్తున్న ఉద్యోగ, ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుని, భవిష్యత్తులో వివిధ రంగాల్లో ఉన్నత స్థాయికి ఎదిగి సమాజానికి సేవ చేయాలని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ఆకాంక్షించారు.

# కొత్తకోటలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం తమ్మళ్లపల్లి నియోజకవర్గ కమిటి ఎన్నిక

**రైతుల రుణాలు మాఫీ చేసి, నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలి**

**-ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమల్ల రంగారెడ్డి.**




**రాయచోటి సెప్టెంబర్ 30 ప్రజా జ్యోతి** ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అన్నమయ్య జిల్లా తమ్మళ్లపల్లి నియోజకవర్గ కమిటి సమావేశం బుధవారం కొత్తకోటలో నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం తమ్మళ్లపల్లి నియోజకవర్గ నూతన కమిటీని ఎన్నుకున్నారు. నియోజకవర్గ అధ్యక్షుడిగా సదుం భయ్యారెడ్డి, గౌరవ అధ్యక్షుడిగా నారాయణస్వామి, ప్రధాన కార్యదర్శిగా డి. వెంకటరమణారెడ్డి, ఉపాధ్యక్షుడిగా శివారెడ్డి, సహాయ కార్యదర్శులుగా వి.బయ్యారెడ్డి, నారాయణస్వామి, ప్రచార కార్యదర్శిగా ఎస్. రవీంద్రారెడ్డిని ఎన్నుకున్నారు. వీరితో పాటు మరో 25 మంది సభ్యులతో నియోజకవర్గ కమిటీని ఏర్పాటు చేశారు.అనంతరం జరిగిన సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి ముంగిమళ్ల రంగారెడ్డి రైతులతో ముఖాముఖి నిర్వహించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్లో సాగు చేసిన పంటలు చేతికి రాకపోవడం, నీటి కొరతతో పంటలు ఎండిపోవడం, పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లభించకపోవడంతో తీవ్రంగా నష్టపోయామని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికే అప్పులుచేసి వ్యవసాయం చేస్తున్న తమకు పంట నష్టాలు మరింత భారంగా మారాయని తెలిపారు. అనంతరం రంగారెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని సంక్షోభం నుంచి గట్టెక్కించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. పంటలు నష్టపోయిన రైతులకు తగిన నష్టపరిహారం అందించాలని, రైతుల రుణాలను మాఫీచేసి వారిని అప్పుల బాధ నుంచి విముక్తి చేయాలని కోరారు. పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించడంతో పాటు సాగునీటి సమస్యను పరిష్కరించి, రైతులకు అవసరమైన పెట్టుబడి సాయం అందించాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. రైతుల సమస్యల పరిష్కారంకోసం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నిరంతరం పోరాటం చేస్తుందని, రైతులంతా సంఘటితమై తమ హక్కుల సాధనకు ముందుకు రావాలని రంగారెడ్డి పిలుపునిచ్చారు.

# నంద్యాలలో ఘనంగా 'ట్రైకాన్ ఎలివేటర్స్' నూతన కార్యాలయం ప్రారంభం

**ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించిన రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్**





**నంద్యాల :సెప్టెంబర్ =30 :ప్రజాజ్యోతి** నంద్యాల పట్టణంలోని సాయిబాబా నగర్‌లో గల బాబుల్ రెడ్డి కాంప్లెక్స్‌లో నూతనంగా షేక్ అబ్దుల్ ఖాదర్ , షేక్ మహమ్మద్ అలీ , షేక్ ఖజా లు ఏర్పాటు చేసిన ప్రముఖ లిఫ్ట్ విడిభాగాల మరియు సేవల సంస్థ 'ట్రైకాన్ ఎలివేటర్స్' కార్యాలయాన్ని బుధవారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ ముఖ్య అతిథిగా హాజరై, రిబ్బన్ కట్ చేసి నూతన కార్యాలయాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ నంద్యాల పట్టణం వేగంగా అభివృద్ధి చెందుతున్న తరుణంలో అత్యాధునిక సాంకేతికత, నాణ్యమైన భద్రతా ప్రమాణాలతో కూడిన ఎలివేటర్ సేవలు ప్రజలకు ఎంతో అవసరమని అన్నారు . నంద్యాలలో ఇప్పటికే విజయవంతంగా 100 కు పైగా ప్రాజెక్టులను పూర్తి చేసి ప్రజల విశ్వాసాన్ని పొందిన 'ట్రైకాన్ ఎలివేటర్స్' యాజమాన్యాన్ని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులో ఈ సంస్థ మరింతగా విస్తరించి వినియోగదారులకు మరింత మెరుగైన సేవలందించాలని ఆకాంక్షించారు.సంస్థ నిర్వాహకులు షేక్ అబ్దుల్ ఖాదర్ షేక్ మహమ్మద్ అలీ షేక్ ఖజాలు మాట్లాడుతూ భారతదేశంలోనే పూర్తి స్థాయి ఎలివేటర్ కాంపోనెంట్స్ హబ్‌గా అత్యాధునిక విడిభాగాలు, కంట్రోల్ ప్యానెల్స్, ట్రాక్షన్ మిషన్లు, భద్రతా పరికరాలు తదితర ఉత్పత్తులతో పాటు నిరంతర సాంకేతిక సహకారాన్ని అందిస్తున్నామని తెలిపారు.ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఇమాముల సంఘం అధ్యక్షులు హాఫిజ్ అంజద్ బాషా సిద్ధిఖీ , నంద్యాల మార్కెట్ యార్డ్ చైర్మన్ గుంటుపల్లి హరిబాబు, కె.సి. కెనాల్ చైర్మన్ హాజీ ఇలియాస్, హాఫిజ్ అబ్దుల్ సలాం, హాఫిజ్ ఖాజా మియా గోసుల నాగేశ్వర రావు, వార్డ్ ఇంచార్జి వేద సాయినాథ్‌లతో పాటు పలువురు స్థానిక ప్రముఖులు, వ్యాపారవేత్తలు,టీడీపీ నాయకులు శ్రేయోభిలాషులు మరియు సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

# పౌష్టికాహారంతోనే ఆరోగ్యం







**నేతాజీ పాఠశాలలో ఘనంగా ఫుడ్ ఫెస్టివల్**

**పౌష్టికాహారంపై విద్యార్థులకు అవగాహన..**

**ఆకట్టుకున్న ఆహార ప్రదర్శన**

**హోళగుంద, సెప్టెంబర్ 30, ప్రజా జ్యోతి న్యూస్ –** స్థానిక నేతాజీ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో బుధవారం ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు వివిధ రకాల ఆహార పదార్థాలను ప్రదర్శిస్తూ వాటి పోషక విలువలు, ఆరోగ్య ప్రయోజనాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా పండ్లు, డ్రై ఫ్రూట్స్, ఆకుకూరలు, కాయగూరలు తదితర పౌష్టికాహార పదార్థాలతో పాటు జంక్ ఫుడ్‌ను కూడా ప్రదర్శనలో ఉంచారు. పౌష్టికాహారం తీసుకోవడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలను, జంక్ ఫుడ్ అధికంగా తీసుకోవడం వల్ల ఎదురయ్యే నష్టాలను విద్యార్థులు వివరించారు. వివిధ రకాల పండ్లు, కూరగాయలు, డ్రై ఫ్రూట్స్‌తో ఏర్పాటు చేసిన ప్రదర్శన ప్రత్యేకంగా ఆకట్టుకుంది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎంఈఓ–1 సుధారాణి ఫుడ్ ఫెస్టివల్‌ను ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు ఏర్పాటు చేసిన ఆహార ప్రదర్శనను పరిశీలించి, వారు ప్రదర్శించిన ప్రతిభను అభినందించారు.ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్ఐ దిలీప్ కుమార్, ఎంఈఓ–2 కబీర్ సాబ్, స్టేట్ బ్యాంక్ మేనేజర్, పోస్టుమాస్టర్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు గ్రామంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు, ఉపాధ్యాయులు ఫుడ్ ఫెస్టివల్‌ను సందర్శించి విద్యార్థుల ప్రదర్శనను తిలకించారు. విద్యార్థుల్లో ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లపై అవగాహన పెంచేందుకు నిర్వహించిన ఈ కార్యక్రమం అందరినీ ఆకట్టుకుంది.

# సమస్యలు తీర్చకుంటే రాష్ట్రవ్యాప్త సమ్మె

**--రూ.26 వేల కనీస వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాలని ఎంపీడీవోకు వినతిపత్రం ఇచ్చిన ఫీల్డ్ అసిస్టెంట్లు**



**హోళగుంద, సెప్టెంబర్ 30,ప్రజా జ్యోతి న్యూస్ –** గత 19 సంవత్సరాలుగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కీలక పాత్ర పోషిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు కనీస వేతనం రూ. 26,000 చెల్లించాలని మరియు ఉద్యోగ భద్రత కల్పించాలని ఆంధ్రప్రదేశ్ ఫీల్డ్ అసిస్టెంట్ల జాయింట్ యాక్షన్ కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారికి సంఘం నాయకులు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం ఇస్తున్న రూ. 5,745/- అరకొర వేతనంతో కుటుంబాలను పోషించడం చాలా కష్టంగా మారిందని, ఉపాధి హామీ పథకాన్ని దేశంలోనే రాష్ట్రం మొదటి స్థానంలో నిలబెట్టడంలో ఫీల్డ్ అసిస్టెంట్ల కృషి ఎంతో ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రధాన డిమాండ్లు

**కనీస వేతనం:**

ఫీల్డ్ అసిస్టెంట్లకు నెలకు కనీస వేతనం రూ. 26,000 చెల్లించాలి.

**బదిలీలు:**

డివిజన్ స్థాయి లేదా మండల స్థాయి బదిలీలకు అవకాశం కల్పించాలి.

**పదోన్నతులు:**

అర్హత, అనుభవం కలిగిన వారికి పదోన్నతులు (ప్రమోషన్లు) ఇవ్వాలి.

**ఉద్యోగ భద్రత:**

అక్రమ తొలగింపులను నివారించి పూర్తి ఉద్యోగ భద్రత కల్పించాలి.

**ఎఫ్ టి ఈ వర్తింపు:**

3 సంవత్సరాల సర్వీసు పూర్తి చేసుకున్న వారందరికీ ఎఫ్ టి ఈ వర్తింపజేయాలి, మ్యాన్ డేస్ విధానాన్ని (7500) రద్దు చేయాలి.

**ఎక్స్‌గ్రేషియా ఉద్యోగం:**

విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు మరణించిన లేదా అంగ వైకల్యం పొందిన వారి కుటుంబాలకు రూ. 25 లక్షల ఎక్స్‌గ్రే షియా చెల్లించి, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలి.

**ఏజెన్సీ అలవెన్స్:**

గిరిజన ప్రాంతాల్లో పనిచేస్తున్న వారికి ఏజెన్సీ అలవెన్స్ అందించాలి.

**కొత్త మొబైల్స్:**

ఎన్ ఎం ఎం ఎస్, భువన్ తదితర యాప్‌లు, 5+ నెట్‌వర్క్ వాడకం దృష్ట్యా నూతన మొబైల్ ఫోన్లు మంజూరు చేయాలి.

**ఆరోగ్య భద్రత:**

క్యాష్ లెస్ హెల్త్ కార్డులు మంజూరు చేయాలి.

**అక్టోబర్ 5 లోగా పరిష్కరించాలి:**

రాజకీయ వేధింపులు, అక్రమ తొలగింపులు నిలిపివేయాలని, ఏళ్ల తరబడి విన్నవించినా తమ సమస్యలు పరిష్కారం కాలేదని నాయకులు పేర్కొన్నారు. రాబోయే 2026 అక్టోబర్ 5వ తేదీ లోపు తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా సమ్మె బాట పడతామని గ్రామీణ ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ల జాయింట్ యాక్షన్ కమిటీ ఈ సందర్భంగా స్పష్టం చేసింది.

# రైతుల అభ్యున్నతి కోసం స్వర్గీయ మాజీ ఎమ్మెల్సీ నరసింహదేవర సత్యనారాయణ సేవలు చిరస్మరణీయం

**ఆలమూరు సెప్టెంబర్ 30(ప్రజాజ్యోతి):**స్వర్గీయ మాజీ ఎమ్మెల్సీ నరసింహదేవర సత్యనారాయణ రైతుల అభ్యున్నతి కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పలువురు వ్యక్తులు అన్నారు. మద్రాస్ ఉమ్మడి రాష్ట్రంలో ఎమ్మెల్సీగా పనిచేసిన నరసింహదేవర 72వ వర్ధంతి ఆలమూరు సహకార సంఘం ఆవరణలో బుధవారం అధ్యక్షుడు వంటిపల్లి సతీష్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. రైతులకు అన్ని రకాలుగా ఉపకరించే విధంగా దక్షిణ భారతదేశంలోనే మొట్టమొదటిసారిగా రైతుల కోసం సహకార రూరల్ బ్యాంకును ఆలమూరులో స్థాపించిన ఘనత నరసింహదేవరకు దక్కుతుందని ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. నరసింహదేవర విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మండల టిడిపి అధ్యక్షుడు ఈదల సత్తిబాబు, సహకార సంఘం సీఈవో బొబ్బా సుబ్రహ్మణ్యం, సిబ్బంది సింగ్ బాబు, రాజా, కూటమి నాయకులు రామానుజనుల సూర్య ప్రకాష్, గుడాల శ్రీను, ఈదల నల్ల బాబు, కేత రాంబాబు, చల్లా బాబి, బైరిశెట్టి రాంబాబు, రామానుజునుల శేషగిరిరావు, ఈదల రాంబాబు, గుత్తుల కిరణ్, రావాడ సత్తిబాబు, సాలి సత్యనారాయణ, చల్లా ఏడుకొండలు, తదితరులు నివాళులర్పించారు.



## వెంగళంపల్లెలో అంగన్వాడి ఉత్సవం కార్యక్రమం



**ప్రజా జ్యోతి న్యూస్ ప్యాపిలి సెప్టెంబర్ 30** ప్యాపిలి మండలం వెంగళంపల్లె గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో సూపర్వైజర్ లక్ష్మీనారాయణమ్మ ఆధ్వర్యంలో అంగన్వాడి ఉత్సవంతో పాటు జాతీయ పోషణ మాసాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా అంగన్వాడి టీచర్ను ఘనంగా సన్మానించారు. అనంతరం సూపర్వైజర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ అంగన్వాడీ టీచర్లు లబ్ధిదారులకు అందిస్తున్న సేవలను, పౌష్టికాహారం, ఆహారంలో వైవిధ్యం గురించి లబ్ధిదారులకు వివరించారు. లబ్ధిదారులకు ప్లేట్లు, కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలొ ఏఎన్ఎం లక్ష్మీనరసమ్మ, జిఎంఎస్కె త్రివేణి, అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్స్, ఆశా వర్కర్లు, బాలింతలు, గర్భవతులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు. రిపోర్టర్ బండి రమేష్

## అంగన్వాడీ కేంద్రం ఎప్పుడూ మూసివేతలోనేనా?

**మాదిరెడ్డిగారిపల్లిలో చిన్నారుల భవిష్యత్తుతో చెలగాటమా?**

**తుమ్మల లవకుమార్**

**ఏఐఎస్ పి రాష్ట్ర అధ్యక్షులు**




**వీరబల్లి సెప్టెంబర్ 30 ప్రజా జ్యోతి** వీరబల్లి మండలం, మాదిరెడ్డిగారిపల్లి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రం తరచూ మూసివేసి ఉండటంపై అధికారులు తక్షణం స్పందించి చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా స్టూడెంట్స్ పవర్ ఏఐఎస్ పి రాష్ట్ర అధ్యక్షులు తుమ్మల లవ కుమార్ పేర్కొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాదిరెడ్డిగారిపల్లిలోని అంగన్వాడీ కేంద్రం ఎప్పుడు చూసినా మూసివేసి ఉండటంతో అక్కడ చదువుకోవాల్సిన చిన్నారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్నారులకు ప్రాథమిక విద్య, పౌష్టికాహారం, ఆరోగ్య పరిరక్షణ తదితర సేవలు అందించాల్సిన అంగన్వాడీ కేంద్రం సక్రమంగా పనిచేయకపోవడం ఆందోళన కలిగించే అంశం ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు అందిస్తున్న సేవలు ప్రతి అర్హుడైన చిన్నారికి సక్రమంగా చేరేలా చర్యలు తీసుకోవాలి. అయితే కేంద్రం తరచూ మూసివేసి ఉంటే ప్రభుత్వ లక్ష్యం ఎలా నెరవేరుతుందని ప్రశ్నించాల్సి వస్తోంది.అంగన్వాడీ కేంద్రం ఎందుకు మూసివేస్తున్నారు? సిబ్బంది క్రమం తప్పకుండా విధులకు హాజరవుతున్నారా? చిన్నారులకు పౌష్టికాహారం, విద్యా కార్యక్రమాలు మరియు ఇతర సేవలు సక్రమంగా అందుతున్నాయా? అనే అంశాలపై సంబంధిత అధికారులు సమగ్రంగా పరిశీలించాలి.వీరబల్లి మండల అధికారులు, ఐసీడీఎస్ అధికారులు వెంటనే మాదిరెడ్డిగారిపల్లి అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి, వాస్తవ పరిస్థితిని పరిశీలించాలని కోరుతున్నాం. కేంద్రం నిరంతరం పనిచేసేలా చర్యలు తీసుకోవడంతో పాటు చిన్నారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సిబ్బంది మరియు మౌలిక వసతులు కల్పించాలి.అంగన్వాడీ కేంద్రాల నిర్వహణలో నిర్లక్ష్యానికి తావులేకుండా అధికారులు పర్యవేక్షణను పెంచాలని డిమాండ్ చేస్తున్నాం.

## రాయచోటి ఎపి ల వంక పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్కూల్ కమిటీ చైర్మన్‌గా పూసపాటి వెంకటరమణ (రాము)

**ఎలిమెంటరీ పాఠశాల చైర్మన్ గా సయ్యద్ చాన్ భాష**





**రామాపురం సెప్టెంబర్ ,30 ప్రజా జ్యోతి** రాయచోటి మండలం ఎపి ల వంక పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్కూల్ కమిటీ చైర్మన్‌గా పూసపాటి వెంకటరమణ ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన చైర్మన్, వైస్ చైర్మన్లు పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. విద్యార్థులకు మెరుగైన విద్య, మౌలిక వసతుల కల్పనకు కమిటీ సభ్యులు సమష్టిగా పనిచేయాలని ఆకాంక్షించారు. మండిపల్లె రాంప్రసాద్ రెడ్డికి సోదరుడు లక్ష్మి ప్రసాద్ రెడ్డికి ప్రత్యేకంగా నూతనంగా ఎన్నికైన చైర్మన్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు దేశం పార్టీ కార్యకర్తలు, ఉమేష్ యాదవ్ , సుబ్బారెడ్డి,అంజి యాదవ్, రమణయ్య, హరినాథ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

## మాలమహానాడు జిల్లాస్థాయి విస్తృత కార్యకర్తల సమావేశాన్ని జయప్రదంచేయండ్డి దస్తగిరి



**నంద్యాల:సెప్టెంబర్=30 ప్రజాజ్యోతి** అక్టోబర్ 4వ తారీఖున ఆదివారము సాయంత్రము మూడు గంటలకు జరగబోయే మాల మహానాడు జిల్లాస్థాయి విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశాన్ని జయప్రదం చేయాలని మాల సంఘాల జేఏసీ రాష్ట్ర కార్యదర్శి దస్తగిరి మాల మహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వైసిపి పుల్లయ్య పిలుపునిచ్చారు అందులో భాగంగా బుధవారం నాడు నంద్యాల పట్టణంలో మాల మహానాడు కార్యాలయంలో వారిరువురు మాట్లాడుతూ రాష్ట్రంలో మాలలపై దాడులు హత్యాచారాలు మాలకు ఎస్సీ వర్గీకరణ అంశంలో జరగబోయే నష్టాలు రోస్టర్ విధానాన్ని దళిత క్రైస్తవులు ఎస్సీ హోదా తదితరు అంశాలపై చర్చించడం జరుగుతుందన్నారు కావున నంద్యాల జిల్లా నుండి మాల మహానాడు కార్యకర్తలు మాల ఉద్యోగ సంఘాలు మహిళా సంఘాలు అంబేద్కర్ సంఘాలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో మలమాను రాయలసీమ అధ్యక్షులు ది మద్దిలేటి మద్దూరు మాజీ సర్పంచ్ మాల రాజ్యాధికారి సభ నంద్యాల జిల్లా అధ్యక్షులు మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు

## పౌర హక్కులపై ప్రజలకు అవగాహన కల్పించిన అధికారులు



**హోళగుంద, సెప్టెంబర్ 30:**పౌర హక్కుల దినోత్సవం సందర్భంగా హోళగుంద మండలంలోని సమ్మతగేరి గ్రామ ఎస్సీ కాలనీలో అధికారులు ప్రజలతో అవగాహన సమావేశం నిర్వహించారు. మండల తహసీల్దార్ లక్ష్మీ రాజు,హోళగుంద ఎస్సై దిలీప్ కుమార్ గురజాల ప్రజలతో సమావేశమై పౌరుల హక్కులు, బాధ్యతలు, చట్టపరమైన రక్షణలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీస్ నిరోధక చట్టం, ఇతర చట్టాలు, సామాజిక భద్రత, సమాన హక్కులు తదితర అంశాలపై ప్రజలకు వివరించారు. తమ హక్కులను తెలుసుకోవడంతో పాటు చట్టాలను గౌరవిస్తూ బాధ్యతాయుతంగా జీవించాలని సూచించారు.గ్రామంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా వాటిని అధికారుల దృష్టికి తీసుకువస్తే చట్టపరంగా తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలు చట్టాలపై అవగాహన పెంచుకుని, తమ హక్కుల పరిరక్షణకు అందుబాటులో ఉన్న ప్రభుత్వ యంత్రాంగాన్ని వినియోగించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో స్థానిక అధికారులు, పోలీసు సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## జాతీయ పోషణ మాసోస్తవం. నెలరోజుల పోసకాహార




**కోవెలకుంట్ల సంజామల :సెప్టెంబర్ =30 ప్రజాజ్యోతి** సంజామల మండల పరిధిలోని పేరుసోమల అంగన్వాడి కేంద్రం నందు సంజామల మండల సూపర్వైజర్ జి శాంత గారి ఆధ్వర్యంలో పోషణ మాసొస్తవాలు నిర్వహించడం జరిగినది.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కృషి విజ్ఞాన కేంద్రం హోశీ సైంటిస్ట్ శ్రీమతి లక్ష్మీ ప్రియ మేడం హాజరయ్యారు.లక్ష్మీ ప్రియ మేడం మాట్లాడుతూ ఈనెల 9వ తేదీ నుంచి అక్టోబర్ 8వ తేదీ వరకు నెలరోజుల పాటు జాతీయ పోషణ మాసొస్తవాలు జరుపుకుంటాము పోషణ మాసొస్తవాలు ముఖ్య ఉద్దేశం గర్భిణీలు, బాలింతలు సమతుల్య ఆహారం తీసుకోవాలి. అలాగే ఆకుకూరలు కూరగాయలు చిరుధాన్యాలు వాడాలని తెలిపారు. అనంతరం సూపర్వైజర్ శాంత మాట్లాడుతూ అంగన్వాడి సెంటర్ నందు సంపూర్ణ ఆరోగ్య పిల్లల కొరకు ఇచ్చు పాలు, గుడ్లు, బాలామృతం, చెక్కిలు, ఖర్జూరాలు. రాగి పిండి, అటుకులు రాగి జావ పిల్లలకు సెంటర్ నందు పిల్లలకు ఇవ్వబడును అని కార్యక్రమానికి హాజరైన తల్లులకు తెలియ చేశారు. ఈ కార్యక్రమానికి అంగనవాడి వర్కర్లు ఆయాలు పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు

# గజ్జహళ్లి ఎస్ ఎం సి ఎన్నికల వివాదానికి తెర

### రీ--ఎలక్షన్‌కు ఎం ఈ ఓ సుముఖత..

### పిల్లల భవిష్యత్తు దృష్ట్యా రాజీకి కూటమి నేతలు అంగీకారం






**హోళగుంద, సెప్టెంబర్ 30, ప్రజా జ్యోతి న్యూస్ –** మండల పరిధిలోని గజ్జహళ్లి గ్రామంలో ఎంపీపీ పాఠశాల స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికల్లో తలెత్తిన సీట్ల కేటాయింపు వివాదం ఎట్టకేలకు పరిష్కార దిశగా సాగింది.సీట్ల కేటాయింపు లో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారంటూ కూటమి నాయకులు, తల్లిదండ్రులు చేసిన ఫిర్యాదుపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎంఈఓ బుధవారం పాఠశాలకు చేరుకుని విచారణ చేపట్టారు.విచారణ సందర్భంగా విద్యార్థుల సంఖ్య, సామాజిక వర్గాల నిష్పత్తిని పరిగణనలోకి తీసుకోకుండా ఎస్సీ, బీసీలకు చెరో ఏడు సీట్లు కేటాయించడం జరిగిందని అధికారులు గుర్తించారు. నిబంధనల ప్రకారం బీసీలకు 11, ఎస్సీలకు 3 సీట్లు కేటాయించాల్సి ఉందని కూటమి నాయకులు వివరించారు. సీట్ల కేటాయింపులో జరిగిన పొరపాటును హెచ్‌ఎం అధికారుల ఎదుట అంగీకరించినట్లు వారు తెలిపారు రీ--ఎలక్షన్‌కు సుముఖతదసీట్ల కేటాయింపులో జరిగిన తప్పిదం నేపథ్యంలో ప్రస్తుత ఎన్నికను రద్దు చేసి, తిరిగి ఎన్నిక నిర్వహించేందుకు ఎంఈఓ సుముఖత వ్యక్తం చేసినట్లు కూటమి నాయకులు తెలిపారు. అయితే తిరిగి ఎన్నిక నిర్వహిస్తే ప్రక్రియ పూర్తయ్యే వరకు సమయం పట్టి, పాఠశాలకు అందాల్సిన ప్రభుత్వ నిధులు, విద్యార్థుల వసతులపై ప్రభావం పడే అవకాశం ఉందని వారు అభిప్రాయపడ్డారు.పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పాఠశాలలో వివాదం కొనసాగకూడదనే ఉద్దేశంతో రీ--ఎలక్షన్‌కు వెళ్లకుండా రాజీకి అంగీకరించినట్లు కూటమి నాయకులు పేర్కొన్నారు. అక్రమంగా కేటాయించిన సీట్లలో ఇద్దరు సభ్యులను తమ తరఫున మార్చుకునేలా అంగీకారం కుదిరిందని తెలిపారు.

**"మా పోరాటం పదవుల కోసం కాదు"**

ఈ సందర్భంగా కూటమి నాయకులు మాట్లాడుతూ.. తమకు ఎన్నికైన చైర్మన్‌పై ఎలాంటి వ్యక్తిగత వ్యతిరేకత లేదన్నారు. ఎన్నికల సమయంలో పాఠశాలలో చోటుచేసుకున్న దౌర్జన్యపూరిత ఘటనలు, నిబంధనల అమలు కోసమే తమ పోరాటమని స్పష్టం చేశారు. "మా పోరాటం పదవుల కోసం కాదు.. నిబంధనల అమలు కోసం. పాఠశాలలో నిన్న జరిగిన పరిణామాలపై అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకే పి జి ఆర్ ఎస్ లో ఫిర్యాదు చేశాం. మా ఫిర్యాదుపై అధికారులు స్పందించి పాఠశాలకు వచ్చి విచారణ జరిపారు. పిల్లల భవిష్యత్తే మాకు ముఖ్యం. పాఠశాలలో ప్రశాంత వాతావరణం కొనసాగాలన్నదే మా అభిమతం" అని కూటమి నాయకులు తెలిపారు.

# తడి చెత్త సేకరణతోపాటు ప్రతి పంచాయతీలో టన్ను వర్మీ తయారీ







**హరిత రాయబారులకు చెత్త నుండి సంపద కేంద్రాల్లో శిక్షణ..**

**బిన్--బ్యాగ్ విధానంపై అవగాహన**

**హోళగుంద, సెప్టెంబర్ 30, ప్రజా జ్యోతి న్యూస్ –** మండలంలోని గ్రామ పంచాయతీలను పరిశుభ్రంగా తీర్చిదిద్దడంతో పాటు తడి చెత్తను సక్రమంగా వినియోగించేలా చర్యలు చేపడుతున్నట్లు ఎం పి డి ఓ సయ్యద్ ఉమర్ తెలిపారు. హోళగుంద గ్రామ పంచాయతీలోని చెత్త నుండి సంపద కేంద్రాల్లో మండలంలోని పంచాయితీ అధికారులు, హరిత రాయబారులు సందర్శించిన సందర్భంగా వర్మీ కంపోస్ట్ తయారీ విధానంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా వర్మీ కంపోస్ట్ తయారీ విధానం, బిన్ బ్యాగ్ వ్యవస్థపై హరిత రాయబారులకు అవగాహన కల్పించారు. ప్రతి ఇంటి నుంచి తడి చెత్తను వేరు చేసి సేకరించడం, దానిని వర్మీ కంపోస్ట్‌గా మార్చడం ద్వారా గ్రామాల్లో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచడంతో పాటు సేంద్రీయ ఎరువును తయారు చేసుకోవచ్చని అధికారులు వివరించారు. ఎం పి డి ఓ సయ్యద్ ఉమర్ మాట్లాడుతూ ప్రతి హరిత రాయబారి రోజువారీగా కనీసం 100 కిలోల తడి చెత్తను సేకరించేలా కృషి చేయాలని సూచించారు. అలాగే ప్రతి గ్రామ పంచాయతీలో కనీసం ఒక టన్ను వర్మీ కంపోస్ట్ తయారు చేసే లక్ష్యంతో పనిచేయాలని పి డి ఓ లు, హరిత రాయబారులకు సూచించారు. ప్రతి ఇంటిలో బిన్--బ్యాగ్ విధానాన్ని అమలు చేసేలా ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు.కార్యక్రమంలో భాగంగా వివిధ గ్రామ పంచాయతీలకు చెందిన హరిత రాయబారులను సన్మానించారు. అనంతరం వారికి నాలుగు రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్ బిందు మాధవి మాట్లాడుతూ గ్రామాల్లో పరిశుభ్రతను పాటిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ఏవైనా ఆరోగ్య సమస్యలు ఎదురైతే ఆలస్యం చేయకుండా సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించి తగిన చికిత్స పొందాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎం పి డి ఓ సయ్యద్ ఉమర్, మెడికల్ ఆఫీసర్ బిందు మాధవి, మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల పి డి ఓ లు, హరిత రాయబారులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బార్‌అసోసియేషన్ ఆధ్వర్యంలో శివరామకృష్ణ కుసన్మానం





**డోన్ (ప్రజా జ్యోతి) సెప్టెంబర్ 30** నంద్యాల జిల్లాడోన్ పట్టణం నందు ఆంధ్రప్రదేశ్ జర్నలిస్టుల పరిరక్షణ సమితిన్యాయ సలహాదారుగా నియమితులైన న్యాయవాది శివరామకృష్ణను డోన్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం, పట్టణంలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కే. శ్రీనివాసులు ఆధ్వర్యంలో శివరామకృష్ణకు పూల మాలలు వేసి, శాలువా కప్పి సత్కరించారు.ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ.. జర్నలిస్టుల హక్కులు, రక్షణకు సంబంధించిన అంశాల్లో న్యాయపరమైన సహకారం అందించేందుకు ఏపీజేపీఎస్ న్యాయ సలహాదారుగా శివరామకృష్ణ ఎంపిక కావడం అభినందనీయమన్నారు. జర్నలిస్టులు ఎదుర్కొనే న్యాయపరమైన సమస్యల పరిష్కారానికిన్యాయ పరిజ్ఞానంతో అండగా నిలవాలని ఆకాంక్షించారు.లాయర్ శివరామకృష్ణ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఆంధ్రప్రదేశ్ జర్నలిస్టుల పరిరక్షణ సమితిన్యాయ సలహాదారుగా బాధ్యతలు అప్పగించినందుకు నాయకులకు, కమిటీ సభ్యులకు, జర్నలిస్టులకు, కృతజ్ఞతలు తెలిపారు. జర్నలిస్టుల హక్కులు, సమస్యలకు సంబంధించి అవసరమైన న్యాయపరమైన సలహాలు, సహకారం అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కే. శ్రీనివాసులు, ట్రెజరర్ ఎమ్.కుమారి,సీనియర్ న్యాయవాదులు గోపాల్ రెడ్డి, విశ్వనాథ రెడ్డి, రామలింగయ్య, ఎం. సదానంద బాబు, మధుసూదన్ రావు, లక్ష్మన్న, ఎన్. నరసింహులు, తలారి కృష్ణమూర్తి, జబీఉల్లా, బి. రవిమోహన్, మల్లయ్య, జి. రాముడు, సుగాలి, కోట్ల రవీంద్ర రెడ్డి, బాలకృష్ణ, బద్దల వెంకటేష్, యోగానంద రెడ్డి, భరత్, బాల రంగడు, బాలు, ఏ.సి. వెంకటేశ్వర్లు, గోపాల్, పి. జయనాథ రెడ్డి, వి. శ్రీనివాసులు, మధుసూదన్ రెడ్డి బి.రవికుమార్. ఆనందరావు తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.,

## ఏపీఎన్జీఓ బద్వేల్ తాలూకా అధ్యక్షుడిగా ఆర్. అమరనాథ్ రెడ్డి ఏకగ్రీవ ఎన్నిక!

**బద్వేల్ స్టాఫ్ రిపోర్టర్ సెప్టెంబర్ 30 (ప్రజా జ్యోతి)** బద్వేల్ తాలూకా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీఎన్జీఓ) నూతన అధ్యక్షుడిగా ఆర్. అమరనాథ్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం వైఎస్ఆర్ కడప జిల్లా ఏపీఎన్జీఓల సంఘం అధ్యక్షులు, జేఏసీ చైర్మన్ బలపనూరు శ్రీనివాసులు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఈ ఎన్నిక ప్రక్రియ ముగిసింది. అమరనాథ్ రెడ్డి ఎన్నిక పట్ల ఉద్యోగ సంఘాల నాయకులు, సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు ఆర్. అమరనాథ్ రెడ్డి మాట్లాడుతూ... తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన జిల్లా నాయకత్వానికి, సంఘ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. తాలూకా పరిధిలోని ప్రభుత్వ ఉద్యోగుల, ఎన్జీఓల సమస్యల పరిష్కారానికి నిరంతరం శ్రమిస్తానని, అందరినీ కలుపుకొని సంఘ బలోపేతానికి కృషి చేస్తానని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి టి. శ్రీనివాసులు, జిల్లా సంయుక్త కార్యదర్శులు డి. పద్మనాభం, పి. శైలేశ్వర రెడ్డి, తాలూకా అధ్యక్షులు టి. నరసింహా రెడ్డి, శివరామి రెడ్డి, గౌరవ అధ్యక్షుడు సాధు వెంకటేశ్వర్లుతో పాటు సంఘ కార్యవర్గ సభ్యులు, పెద్ద సంఖ్యలో ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొన్నారు. నూతనంగా ఎన్నికైన అమరనాథ్ రెడ్డికి పలువురు పూలమాలలు వేసి శుభాకాంక్షలు తెలిపారు.





## న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని 15వ రోజుకు చేరిన వీఆర్ఏల నిరవధిక సమ్మె.



**ఆలమూరు, సెప్టెంబర్ 30 (ప్రజాజ్యోతి):**హక్కుల కోసం వీఆర్ఏల పోరుబాట.. వీఆర్ఏల ఆందోళన ఉధృతం... 15వ రోజుకు సమ్మె. డిమాండ్ల సాధనకు వీఆర్ఏల దీక్ష..సర్కారుపై డిమాండ్ల ఒత్తిడి.. పే స్కేల్, పదోన్నతులు.. కారుణ్య నియామకాలు డిమాండ్లు నెరవేర్చే వరకు పోరాటమే. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని కోరుతూ ఆలమూరు మండల గ్రామ రెవెన్యూ సహాయకులు (వీఆర్ఏలు) చేపట్టిన నిరవధిక సహాయ నిరాకరణ ఉద్యమం బుధవారం నాటికి 15వ రోజుకు చేరుకుంది.మండల కేంద్రమైన ఆలమూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఉన్న ధర్నా చౌక్‌లో వీఆర్ఏలు దీక్ష కొనసాగిస్తున్నారు. ఈ సందర్భంగా ఆలమూరు మండల వీఆర్ఏల సంఘం అధ్యక్షుడు తాతపూడి ఇషాక్ మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న పే స్కేల్‌ను తమకు వర్తింపజేయాలని, అర్హులైన వీఆర్ఏలకు పదోన్నతులు కల్పించాలని, విధి నిర్వహణలో మరణించిన వీఆర్ఏల కుటుంబాల్లో అర్హులైన ఒకరికి కారుణ్య నియామకం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో వీఆర్ఏల సంఘం అధ్యక్షుడు తాతపూడి ఇషాక్, కార్యదర్శి కంతేటి శివరామారావు, ఉపాధ్యక్షుడు భువనగిరి ఏసు, సలహాదారు గూనపల్లి నాగేశ్వరరావు, కోశాధికారి కుందేటి శ్రీను, సభ్యులు యార్లగడ్డ జీవరత్నం, ఏడిద వెంకటాద్రి, బూరీగ మంగలక్ష్మి, చోడవరపు రామలక్ష్మి, కోట లక్ష్మి, షేక్ బషీర్ బీబీ తదితర మండల వీఆర్ఏలు దీక్షలో పాల్గొన్నారు.

## వైసిపి పార్టీ గుర్తింపు కార్డు అందుకున్న సందర్భంగా మాజీ సీఎం జగన్ కు, మాజీ ఎమ్మెల్యే వెంకటరామి రెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన: వంశీ యాదవ్



**గుంతకల్లు సెప్టెంబర్ 30 (ప్రజా జ్యోతి):** మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ గుంతకల్లు నియోజక వర్గం మాజీ ఎమ్మెల్యే, గుంతకల్ నియోజక వర్గం ఇన్చార్జ్ వై. వెంకట రామిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు నైరుతి రెడ్డి అక్క చేతుల మీదుగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గా కసాపురం వంశీ యాదవ్ పార్టీ గుర్తింపు కార్డును అందుకున్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నాకు పార్టీ గుర్తింపు కార్డు అందజే యడం ఎంతో సంతోషంగా ఉందని, నాకు గుర్తింపు కార్డు అందజేసిన మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డికి, మాజీ ఎమ్మెల్యే, వై వెంకట రామిరెడ్డి కి, జిల్లా ఉపాధ్యక్షురాలు నైరుతి రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసుకుంటూ ఈ బాధ్యతను మరింత అంకితభావంతో నిర్వహి స్తూ, విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని కసాపురం వంశీ యాదవ్ తెలిపారు.

## పోడూరు కొత్తపేట అంగన్వాడి లో ఉత్సవ కార్యక్రమం..



**పోడూరు ప్రజాజ్యోతి రిపోర్టర్ కొట్టి రామం సెప్టెంబర్ 30.**పోడూరు కొత్తపేట అంగన్వాడి సెంటర్ వద్ద బుధవారం అంగన్వాడి ఉత్సవం, పోషణ మహా కార్యక్రమం జరిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిడిపిఓ ఇందిర లబ్ధిదారులకు తీసుకోవలసిన పౌష్టికాహారం చిరుధాన్యాలు బాలామృతం పిల్లలకు పెట్టే విధానం బాలామృతం లో ఉన్న పోషక విలువలను తెలిపారు. పిల్లల పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలు పిల్లలు ఎదుగుదల అంశాలను వివరించారు. పిల్లలు వయసుకు తగ్గ బరువు ఎత్తు ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమం లో సూపర్వైజర్ హసీనా,లబ్ధిదారులు కూటమి నాయకులు అంగన్వాడి కార్యకర్తలు సహాయకురాలు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## వాలీబాల్ టోర్నమెంట్ కు బిసి రాజారెడ్డికి ఆహ్వానం

**బనగానపల్లె:సెప్టెంబర్=30 ప్రజాజ్యోతి** దసరా పండుగ సందర్భంగా నిర్వహిస్తున్న వాలీబాల్ ఓపెన్ టోర్నమెంట్ కు రావాలని నిర్వాహకులు బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్, అరుణ భారతి సాహితీ సంస్థ అధ్యక్షులు బిసి రాజారెడ్డి గారిని ఆహ్వానించారు. ఈనెల 2, 3, 4వ తేదీలలో బనగానపల్లె పట్టణ ఆర్టీసీ బస్టాండ్ పక్కన ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానం నందు వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీలకు ముఖ్య అతిథిగా హాజరుకావాలని వారు బిసి రాజారెడ్డి ఆహ్వానించారు.




# అరకు రైలు పునరుద్ధరణకు ఎం.పీకి వినతి





**అనంతగిరి మండలం. సెప్టెంబర్ 30. ప్రజా జ్యోతి న్యూస్. రిపోర్టర్ శంకర్ అల్లూరి సీతారామరాజు జిల్లా. అనంతగిరి మండలం.** తుఫాన్ ప్రభావం కారణంగా కే.కే (కొత్తవలస--కిరండూల్) రైల్వే లైన్‌లో చోటుచేసుకున్న కొండచరియల విరిగిపడే ఘటన విశాఖ మన్యం లోని పర్యాటక రంగాన్ని, గిరిజన కుటుంబాల జీవనోపాధిని తీవ్రంగా దెబ్బతీసింది. ఒడిశాలోని కోరాపుట్ జిల్లా మాలిగూడ సమీపంలో రైలు పట్టాలపై కొండచరియలు పడటంతో విశాఖపట్నం--కిరండూల్ ప్యాసింజర్ రైలు రాకపోకలు నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో బొర్రా గుహలు, అరకు ప్రాంతాలకు వచ్చే పర్యాటకుల సంఖ్య భారీగా పడిపోయింది.రైలు సేవలు నిలిచిపోవడంతో పర్యాటకుల రాకపోకలు తగ్గి, తమ జీవనోపాధి పూర్తిగా కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని బొర్రా గుహలు టాక్సీ యూనియన్ ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. టాక్సీ డ్రైవర్లు, వాహన యజమానులతో పాటు ఈ రంగాన్ని నమ్ముకుని ఉన్న సుమారు 500.గిరిజన కుటుంబాలు ఆర్థిక సంక్షోభంలో పడ్డాయని వారు వాపోయారు.ఈ సమస్య తీవ్రతను వివరిస్తూ అరకు పార్లమెంట్ సభ్యురాలు గుమ్మిడి తనూజారాణిని బొర్రా ట్రైబల్ టాక్సీ యూనియన్ ప్రతినిధులు నేరుగా కలిసి వినతిపత్రం సమర్పించారు. కనీసం విశాఖపట్నం నుంచి అరకు వరకైనా ప్యాసింజర్ రైలు సేవలను తక్షణమే పునరుద్ధరించేలా రైల్వే అధికారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకోవాలని వారు ఎం.పీని అభ్యర్థించారు. బాధితుల విజ్ఞప్తిపై ఎం.పీ గుమ్మిడి తనూజారాణి వెంటనే సానుకూలంగా స్పందించారు. రైల్వే ఉన్నతాధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి, గిరిజనుల ఉపాధి సమస్యను వివరించినట్లు ఆమె తెలిపారు. ప్రయాణీకుల రాకపోకలను పునరుద్ధరించి, సమస్యకుత్వరి తగతిన పరిష్కారం చూపేలా చర్యలు తీసుకుంటామని ఆమె హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో బొర్రా ట్రైబల్ టాక్సీ యూనియన్ మాజీ ప్రెసిడెంట్ దుంబారి శ్యామ్ కుమార్, భగవాన్, వేలు, ప్రభాకర్, బుజ్జి, విజయ్, బాలు, చిన్న, యెసెప్, మోజేష్, గంగూలీ, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

# తాడి రామదుర్గాప్రసాద్ కి పట్టాభిషేకం!..

**అమ్మ శ్రీనివాస నాయుడు ఆదేశాలతో!..**

**కాపు సంఘానికి బలమైన నాయుడి ఎంపిక!..**

**పోలవరం జిల్లా కాపు జే.ఏ.సీ జిల్లా కమిటీకి టీ.ఆర్. ప్రసాద్!..**










**వరరామచంద్రాపురం, సెప్టెంబర్ 30 (ప్రజాజ్యోతి ప్రతినిధి)** కాపు సామాజిక వర్గ సమస్యలపరిష్కారానికి కృషి చేస్తానని, ఆశించిన దానికన్నా సంఘం అభివృద్ధికి కీలకంగా పని చేస్తానని, తాడి రామదుర్గా ప్రసాద్, స్పష్టం చేశారు. బుధవారం ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, పోలవరం జిల్లా కాపు, తూర్పుకాపు. మున్నూరు కాపు.తెలగ,బలిజ,ఒంటరి తదితర కాపు సామాజిక వర్గాల ఐక్యత,హక్కులు,సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తున్న కాపు జే.ఏ.సీ,లో పోలవరం జిల్లాకు నూతన బాధ్యతలు అప్పగించారని, వివరించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాపు జే.ఏ.సీ,చైర్మన్ అమ్మ శ్రీనివాస్ నాయుడు ఆదేశాల మేరకు టీ.ఆర్. ప్రసాద్‌ను పోలవరం జిల్లా కాపు జే.ఏ.సీ,జిల్లా కమిటీ ప్రెసిడెంట్‌గా నియమించినట్లు సూచించారు. తన పై నమ్మకంతో జిల్లాస్థాయి బాధ్యతలు అప్పగించిన కాపు జే.ఏ.సీ రాష్ట్ర చైర్మన్ అమ్మ శ్రీనివాస్ నాయుడికి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలోని కాపు సామాజిక వర్గానికి చెందిన ప్రజలను ఐక్యంచేస్తూ ,వారి సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన చెప్పారు. కాపు సామాజిక వర్గానికి చెందిన పేదలు, మధ్య తరగతి, కుటుంబాలు ఎదుర్కొంటున్న విద్య, ఉపాధి ,ఆర్థిక, సామాజిక సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. యువతకు విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించడంతో పాటు, అర్హులైన వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తానని పేర్కొన్నారు. పోలవరం జిల్లా పరిధిలోని కాపు,తూర్పు కాపు. మున్నూరు కాపు.తెలగ, బలిజ, ఒంటరి తదితర వర్గాలను సమన్వయం చేసుకుని జే.ఏ.సీ,ని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తానన్నారు. సామాజిక ఐక్యతతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజాస్వామ్య పద్ధతిలో ఉద్యమాలు నిర్వహిస్తామని తెలిపారు.తనకు అప్పగించిన బాధ్యతను నిబద్ధతతో నిర్వహిస్తూ రాష్ట్ర కాపు జే.ఏ.సీ, నాయకత్వ సూచనల మేరకు ముందుకు సాగుతానని పేర్కొన్నారు. ఆయన నియామకం పట్ల కాపు జే.ఏ.సీ, నాయకులు, కార్యకర్తలు పలువురు అభినందనలు తెలిపారు. ఏది ఏమైనా కాపు సామాజిక వర్గానికి మంచి వ్యక్తి, మాటకారి, ఏజెన్సీ ప్రాంతంలో బలమైన నాయులు ప్రజలతో సత్సంబంధాలు కలిగిన తాడి రామ దుర్గాప్రసాద్,ఎన్నిక జిల్లాస్థాయిలో కాపు సామాజిక వర్గానికి చెందిన నాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు.

# పోలవరం నిర్వాసితుల తరలింపుతో వెలవెలబోతున్న!.. వరరామచంద్రాపురం మండల కేంద్రం!..







**వరరామచంద్రాపురం, సెప్టెంబర్ 30 (ప్రజాజ్యోతి ప్రతినిధి)** వరరామచంద్రాపురం, మండల కేంద్రానికి అనుబంధంగా ఉన్న పోలవరం ప్రాజెక్టు నిర్వాసిత గ్రామాలు ఖాళీకావడంతో, వ్యాపారాలు వ్యాపారులు లేక ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో వేరే ప్రాంతాలకు వెళ్ళలేక అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. మండల కేంద్రంపై తీవ్ర ప్రభావం తీవ్రప్రభావం చూపుతోంది. ఒకప్పుడు చుట్టుపక్కల గ్రామాల ప్రజల రాకపోకలతో సందడిగా కనిపించిన మండల కేంద్రం ప్రస్తుతం ప్రజల సంఖ్యభారీ తగ్గిపోవడంతో వెలవెలబోతోంది మండల కేంద్రానికిఅనుబంధంగా ఉన్న పలు గ్రామాలప్రజలు పునరావాస ప్రాంతాలకు తరలి వెళ్లడంతో స్థానికంగా కిరాణా దుకాణాలు, హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, కూరగాయల వ్యాపారాలు, వస్త్ర దుకాణాలు, ప్యాన్సీషాపులు, ఇతర చిన్నచిన్న వ్యాపారాలుపై తీవ్రమైన ప్రభావంఉంది.గతంలో రోజువారీ అవసరాలకోసం మండల కేంద్రానికి వచ్చేప్రజలతో వ్యాపారప్రాంతాలు రద్దీగా ఉండేవి. ప్రస్తుతంగ్రామాలు ఖాళీ అవుతుండటంతో వినియోగదారుల సంఖ్య గణనీయంగా తగ్గుతోంది.

**గ్రామాలు వెళ్లిపోతే.. వ్యాపారాలు ఎవరిపై ఆధారపడాలి?..**

మండల కేంద్రంలోని వ్యాపారాలకు చుట్టుపక్కల గ్రామాల ప్రజలే ప్రధాన వినియోగదారులుగా ఉండేవారు.వ్యవసాయ పనులు, నిత్యావసరాల కొనుగోళ్లు, వైద్యం,విద్య,బ్యాంకింగ్, ప్రభుత్వ కార్యాలయాల పనుల కోసం గ్రామీణులు మండల కేంద్రానికి వచ్చేవారు.దీంతో వ్యాపారులకు ఏడాది పొడవునా కొంతమేరకుఆదాయం లభించేది.అయితే నిర్వాసిత కుటుంబాలు పునరావాస ప్రాంతాలకు తరలిపోవడంతో ఆ కొనుగోలు శక్తి కూడా అక్కడి నుంచి దూరమవుతోంది. ఫలితంగా రోజువారీ అమ్మకాలు తగ్గడం,అద్దెలు--కరెంటు వంటి నిర్వహణ ఖర్చులు భరించడం కష్టమవడం, కొందరు వ్యాపారులు దుకాణాలు మూసివేయాల్సిన పరిస్థితి రావడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయని,స్థానిక వ్యాపార వర్గాలు చెబుతున్నాయి.

**ఉపాధి అవకాశాలపైనా ప్రభావం!..**

వ్యాపార కార్యకలాపాలు తగ్గడంతో వాటిపై ఆధారపడిన చిన్నతరహా కార్మికులు, హోటల్ సిబ్బంది,ఆటో డ్రైవర్లు,సరుకు రవాణా కార్మికులు తదితరుల ఉపాధిపైనా ప్రభావం పడుతోంది. ప్రజల తరలింపుతో ఒకవైపు గ్రామాలు ఖాళీ అవుతుండగా, మరోవైపు మండల కేంద్రంలో ఆర్థిక కార్యకలాపాలు మందగిస్తున్నాయనే ఆందోళన వ్యక్తమవుతోంది.

**మండల కేంద్రం భవిష్యత్తుపై ఆందోళన!..**

నిర్వాసితుల పునరావాసం పూర్తయిన తర్వాత వి.ఆర్.పురం మండల కేంద్రంలో జనాభా,వ్యాపారం,ఉపాధి, ప్రభుత్వ సేవల వ్యవస్థ ఎలా కొనసాగుతుందనే ప్రశ్నలు స్థానికుల్లో నెలకొన్నాయి. మండల కేంద్రం ఆర్థికంగా బలహీనపడకుండా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని వ్యాపారులు,స్థానిక ప్రజలు కోరుతున్నారు.పునరావాస ప్రాంతాల్లోనే ప్రజలకు అవసరమైన వాణిజ్య,విద్యా, వైద్య సదుపాయాలు అభివృద్ధి చేయడంతో పాటు,మండల కేంద్రంలో మిగిలే ప్రజలకు మరియు వ్యాపారులకు ప్రత్యామ్నాయ జీవనోపాధి, వ్యాపార ప్రోత్సాహక చర్యలు, మౌలిక వసతులఅభివృద్ధి కల్పించాలని వారు కోరుతున్నారు.పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల పునరావాసం ఒకవైపు కొత్త జీవితానికి మార్గం వేస్తున్నప్పటికీ, వారి తరలింపు ప్రభావం పాతప్రాంతాల సామాజిక,ఆర్థిక వ్యవస్థపై స్పష్టంగా కనిపిస్తోంది. మండల కేంద్రం ఖాళీ అవుతున్న గ్రామాల నీడలో తన పాతసందడిని కోల్పోతుండటం ఇప్పుడు స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.



# కూటమి విజయమే లక్ష్యంగా పనిచేయాలి

## టిడిపి నాయకుడు కమ్మూరు నాగరాజు

**ప్రజా జ్యోతి జిల్లా బ్యూరో సుబ్బు** అనంతపురం ప్రతినిధి: అనంతపురం నగరంలోని ఆర్.కె గ్రాండ్ ఫంక్షన్ హాల్‌లో నిన్న (మంగళవారం) ఎన్డీయే కూటమి పార్టీల సర్వసభ్య సమావేశం అత్యంత వైభవంగా జరిగింది. అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆధ్వర్యంలో, జిల్లా అధ్యక్షుడు పూల నాగరాజు సమక్షంలో నిర్వహించిన ఈ సమావేశానికి కూటమి నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల పరిశీలకులు, మాజీ మంత్రివర్యులు ఏరాసు ప్రతాపరెడ్డి , అలాగే జోనల్ కోఆర్డినేటర్ శ్రీ రెడెప్ప.శ్రీనివాస రెడ్డిని తెలుగు దేశం పార్టీ నాయకులు కమ్మూరు నాగరాజు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా వారికి శాలువాలు కప్పి, ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.



అనంతరం జరిగిన సర్వసభ్య సమావేశంలో కమ్మూరు నాగరాజు పాల్గొని ప్రసంగించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎన్డీయే కూటమి అఖండ విజయం సాధించేలా నాయకులందరూ సమిష్టిగా, సమన్వయంతో ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కూటమికి చెందిన పలువురు ముఖ్య నాయకులు, నియోజకవర్గ



ప్రజాప్రతినిధులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# బిన్--బ్యాగ్ విధానాన్ని ప్రజలు పాటించాలి







: సయ్యద్ ఉమర్

**తడి--పొడి చెత్తను వేరు చేయడంపై ఇంటింటా అవగాహన**

**హోళగుంద, సెప్టెంబర్ 30, ప్రజా జ్యోతి న్యూస్ –** తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి, గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు బిన్--బ్యాగ్ విధానంపై హోళగుంద మండలం చిన్నహైట గ్రామపంచాయతీలో బుధవారం ఇంటింటా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎం పి డి ఓ సయ్యద్ ఉమర్ స్వయంగా ఇళ్ల వద్దకు వెళ్లి ప్రజలకు చెత్త వేరు చేసే విధానాన్ని వివరించారు. తడి చెత్తను బిన్‌లో వేసి హరిత రాయబారులకు అందించాలని, అలాగే పొడి చెత్తను ప్రత్యేకంగా సేకరించి స్వచ్ఛ రథానికి అందించాలని సూచించారు. చెత్తను కలిపి వేయకుండా తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందించడం ద్వారా పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచడం తో పాటు గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచవచ్చని ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి కుటుంబం బిన్--బ్యాగ్ విధానాన్ని తప్పనిసరిగా పాటించి గ్రామ పారిశుద్ధ్యానికి సహకరించాలని అధికారులు కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎం పి డి ఓ జి. ప్రకాశం, ఏ ఓ కె. శ్రీనివాసులు, పి డి ఓ రాజ్‌కుమార్, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ధర్మవరంలో ఉద్యాన పంటల పరిశీలన

**--రైతులకు యాజమాన్య పద్ధతులపై ఉద్యాన, వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు**



**కాకినాడ జిల్లా సెప్టెంబర్ 30 (ప్రజాజ్యోతి స్టాఫ్ రిపోర్టర్)** ప్రత్తిపాడు మండలం ధర్మవరం గ్రామంలో కూరగాయలు, బొప్పాయి, పూల తోటలను ఉద్యాన శాఖ ఏడీఏ శ్రీనివాస్, ఉద్యాన అధికారి కె దివ్యశ్రీ, వ్యవసాయ అధికారిణి జోకా అమృత బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పంటల్లో తెగుళ్లు, పురుగుల నివారణతో పాటు రైతులు పాటించాల్సిన యాజమాన్య పద్ధతులను వివరించారు. ఆకాకర, చిక్కుడు పంటల్లో విరిగిన కొమ్మలు, కుళ్లిన ఆకులు, కాయలను తొలగించాలని సూచించారు. ఆకుమచ్చ, కుళ్లు తెగుళ్ల నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు లేదా మాంకోజెబ్ 2.5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. కాండం, వేరుకుళ్ల నివారణకు బ్లైటాక్స్ 3 గ్రాములు లీటరు నీటికి కలిపి మొక్క మొదల్లో పోయాలని తెలిపారు. పురుగుల నివారణకు సూచించిన మందులను సిఫార్సు చేసిన మోతాదులోనే వినియోగించాలని సూచించారు. నేలలో నీరు తగ్గిన అనంతరం 19:19:19 నీటిలో కరిగే ఎరువును 5 గ్రాములు లీటరు నీటికి లేదా పంటకు అనుకూలమైన నీటిలో కరిగే ఎన్‌పీకే, సూక్ష్మపోషకాలను సిఫార్సు చేసిన మోతాదులో పిచికారీ చేయడం ద్వారా పూత, పిందె నిలిచి దిగుబడి మెరుగుపడుతుందని వివరించారు. బొప్పాయి తోటల్లో కుళ్లిన ఆకులు, పండ్లు, కాండం భాగాలను తొలగించాలని సూచించారు. వేరుకుళ్ల నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు లీటరు నీటికి కలిపి మొక్కల మొదళ్ల వద్ద మట్టి తడిచేలా పోయాలని తెలిపారు. కాపు వచ్చిన తోటల్లో పండ్ల కుళ్లు నివారణకు హెక్సాకోనాజోల్‌ను సిఫార్సు చేసిన మోతాదులో స్టిక్కర్‌తో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. గులాబీ తోటల్లో కొమ్మల కత్తిరింపులు చేసి కార్బెండజిమ్ లేదా బ్లైటాక్స్ పిచికారీ చేయడం ద్వారా ఎండు తెగులును నియంత్రించవచ్చని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ అర్జున్, గ్రామ ఉద్యాన, వ్యవసాయ సహాయకులు సత్తిబాబు, రామలక్ష్మి, బాబీతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

# సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులదే కీలక పాత్ర

### ఘనంగా ఉపాధ్యాయురాలు అచ్చమ్మ పదవీ విరమణ వీడ్కోలు సభ

### హాజరైన ఎమ్మెల్యే డా.తెల్లం వెంకటరావు, సీనియర్ సివిల్ జడ్జి దేవరపల్లి నాగేశ్వరరావు



**ఎటపాక, సెప్టెంబర్ 30 (ప్రజాజ్యోతి) :** ఉత్తమ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని భద్రాచలం శాసన సభ్యులు డాక్టర్ తెల్లం వెంకటరావు, సీనియర్ సివిల్ జడ్జి దేవరపల్లి నాగేశ్వరరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొడాలి శ్రీనివాసన్ పేర్కొన్నారు. మండల పరిధిలోని కొత్తూరు నారాయణపురం ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు గుంపెనపల్లి అచ్చమ్మ పదవీ విరమణ వీడ్కోలు సన్మాన సభ బుధవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఉపాధ్యాయురాలు గుంపెనపల్లి అచ్చమ్మ, ఆమె భర్త, మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్, సీనియర్ న్యాయవాది కోట దేవదానం దంపతులను ఎమ్మెల్యే, న్యాయమూర్తులు, సీనియర్ న్యాయవాదులు, ప్రజాప్రతినిధులు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. అనంతరం జరిగిన సభలో వక్తలు మాట్లాడుతూ.. మారుమూల ఏజెన్సీ ప్రాంతంలో దాదాపు 40 సంవత్సరాల పాటు నిస్వార్థంగా సేవలందించి, విద్యార్థులు, గ్రామస్థుల మన్ననలు పొందడం గర్వకారణమని కొనియాడారు విద్యార్థుల్లో క్రమశిక్షణ, నైతిక విలువలు పెంపొందించి వారి ఉన్నత భవిష్యత్తుకు బాటలు వేసేది గురువులేనని స్పష్టం చేశారు. అంకితభావంతో విధులు నిర్వర్తించిన అచ్చమ్మను తోటి ఉపాధ్యాయులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. పదవీ విరమణ అనంతరం శేష జీవితాన్ని కూడా ప్రజా సేవకే అంకితం చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు న్యాయమూర్తులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, బార్ అసోసియేషన్ ప్రతినిధులు, సీనియర్ న్యాయవాదులు, ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు, ఆదివాసీ టీచర్స్ యూనియన్ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పాఠశాల సిబ్బంది, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పేదలకు అండగా కూటమి ప్రభుత్వం





## : లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల అందజేత

**గొల్లప్రోలు (ప్రజా జ్యోతి)** పేద, మధ్యతరగతి కుటుంబాలకు అండగా నిలిచే విధంగా ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని అర్హులైన లబ్ధిదారులకు అందజేశారు. గొల్లప్రోలు టీడీపీ కార్యాలయం వద్ద ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. టీడీపీ నేత, మాజీ ఎమ్మెల్యే ఎస్‌వీఎస్‌ఎన్ వర్మ ఆదేశాల మేరకు పట్టణ టీడీపీ అధ్యక్షుడు గుండ్ర సుబ్బారావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ నేతృత్వంలో సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తూ వివిధ కార్యక్రమాలను అమలు చేస్తున్నారని ఈ సందర్భంగా టీడీపీ పట్టణ అధ్యక్షుడు గుండ్ర సుబ్బారావు పేర్కొన్నారు. అనారోగ్యం, వైద్య ఖర్చులు వంటి కారణాలతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా అందుతున్న ఆర్థిక సహాయం కొంతమేరకు ఉపశమనం కలిగిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా గొల్లప్రోలు చెందిన నంగినీడి నాగరత్నం రూ.36,995, ముమ్మిడి దేవి రూ.36,795, కాకి మంగాదేవి రూ.31,379. ముగ్గురు లబ్ధిదారులకు కలిపి మొత్తం రూ.1,05,169 విలువైన చెక్కులను అందజేశారు. చెక్కులను అందుకున్న లబ్ధిదారులు తమకు అందిన ఆర్థిక సహాయానికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు అవసరమైన సమయంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ముఖ్యమంత్రి సహాయనిధి వంటి కార్యక్రమాల ద్వారా ఆర్థిక సహాయం అందేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని నాయకులు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు,పాల్గొన్నారు.

## మట్టపర్రులో ఆలయానికి సిమెంట్ బస్తాలు అందజేసిన ధర్మారావు ఫౌండేషన్ .



**పోడూరు. ప్రజాజ్యోతి రిపోర్టర్ కొట్టి రామం. సెప్టెంబర్ 30.** పోడూరు మండలం మట్టపర్రు చిన్నపాలెంలోని ఆంజనేయస్వామి ఆలయ అభివృద్ధికి ధర్మారావు ఫౌండేషన్ అండగా నిలిచింది. ఇటీవల ధర్మారావు ఫౌండేషన్ చైర్మన్, రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును ఆలయ నిర్వాహకులు కలిసి ఆలయానికి సహాయం చేయాలని కోరగా వారి విజ్ఞప్తికి స్పందించిన మంత్రి రామానాయుడు, ఆలయ నిర్మాణ పనులకు అవసరమైన 40 సిమెంట్ బస్తాలను ధర్మారావు ఫౌండేషన్ సభ్యులతో బుధవారం ఆలయ నిర్వాహకులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధికి స్పందించి 40 సిమెంట్ బస్తాలను అందించిన మంత్రి నిమ్మల రామానాయుడుకు, ధర్మారావు ఫౌండేషన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఆలయాల అభివృద్ధికి ఫౌండేషన్ అందిస్తున్న సహకారం అభినందనీయమని పేర్కొన్నారు.

## నిషేధిత ప్లాస్టిక్ వినియోగిస్తే చర్యలు తప్పవు: మున్సిపల్ కమిషనర్ లక్ష్మీదేవి




**గుంతకల్లు సెప్టెంబర్ 30 (ప్రజా జ్యోతి):** నిషేధిత సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే చట్టపరంగా చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ లక్ష్మీదేవి హెచ్చరించారు. బుధవారం పట్టణంలోనిపలు కిరాణా షాపులు మున్సిపల్ కమిషనర్ లక్ష్మీదేవి అధికారులతో కలిసి ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో అంబికా జనరల్ స్టోర్స్ యజమాని షాపు బయట ప్లాస్టిక్ కవర్లు పారివేసినందుకు మరియు షాప్ లో సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ వాడుతునందుకు గాను అంబిక జనరల్ స్టోర్ వారికి పదివేల రూపాయలు జరిమానా విధించి, మరల సింగల్ యుజ్డ్ ప్లాస్టిక్ వాడితే లైసెన్స్ క్యాన్సిల్ చేసి చేస్తున్న నమోదు చేస్తామని మున్సిపల్ కమిషనర్ హెచ్చరించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి దుకాణదారుడు దుకాణాల నుంచి వెలువడిన తడి. పొడి, హానికర చెత్తను వేరుచేసి షాపు వద్దకు వచ్చే మున్సిపల్ వాహనాలకు అందించాలని కమిషనర్ షాప్ యజమానులకు తెలియజేశారు.

## రైల్వే పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్య భద్రతకు పెద్దపీట: డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి, సి హెచ్ ఐ శివన్న




**గుంతకల్లు సెప్టెంబర్ 30 (ప్రజా జ్యోతి):** గుంతకల్లు రైల్వే స్టేషన్ లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్య భద్రతకు పెద్దపీట వేయడం జరుగుతుందని రైల్వే హాస్పిటల్ సిఎంఎస్ డాక్టర్ వేణుగోపాల రెడ్డి, చీఫ్ హెల్త్ ఇన్స్పెక్టర్ (సిహెచ్ఐ) శివన్న తెలిపారు. స్వచ్ఛతా హి సేవా 2026 కార్యక్రమంలో భాగంగా బుధవారం సిఎంఎస్ డాక్టర్ వేణుగోపాల రెడ్డి ఆధ్వర్యంలో గుంతకల్లు రైల్వే స్టేషన్లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో గుంతకల్లు రైల్వే స్టేషన్లో, ఓ బి హెచ్ ఎస్, ట్రాక్ సైడ్ మరియు కాలనీల క్లీనింగ్ కాంట్రాక్ట్ పారిశుద్ధ్య కార్మికులగా పనిచేస్తున్న కార్మికులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం వారికి గ్లౌజులు, మాస్కులు, షూస్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి, సిహెచ్ శివన్న మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్య భద్రతకు పలు చర్యలు తీసుకోవడం జరుగుతుంద ని పలు దఫాలుగా వారికి వైద్య పరీక్షలను నిర్వహిస్తా మని తెలియజేశారు. అనంతరం స్వచ్ఛత కోసం విశేషంగా కృషి చేసిన సఫాయి మిత్రులను, స్వచ్ఛ గ్రహీత టీమ్స్ ను డివిజన్ అధికారులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఇన్స్పెక్టర్ గీతాంజలి, అఖిలేంద్ర కుమార్ మరియు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## గొల్లప్రోలు పారిశుధ్య కార్మికులకు ఉచిత వైద్య శిబిరం



**గొల్లప్రోలు (ప్రజా జ్యోతి)** స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా "సఫాయి మిత్ర సురక్ష సమ్మాన్ ఏవం శివిర్" థీమ్‌తో గొల్లప్రోలు మున్సిపాలిటీ పరిధిలో బుధవారం పారిశుధ్య కార్మికులు వారి కుటుంబ సభ్యులకు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో జరిగిన ఈ శిబిరంలో కార్మికులకు పలు రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ దివిజ సంపతి మాట్లాడుతూ.. మున్సిపాలిటీ అభివృద్ధిలో, ప్రజల ఆరోగ్య రక్షణలో పారిశుధ్య కార్మికులు అందిస్తున్న సేవలు మరువలేనివని కొనియాడారు. అహర్నిశలు శ్రమిస్తూ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచే కార్మికులు, తమ ఆరోగ్యం పట్ల కూడా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె సూచించారు. ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని కోరారు. ఈ శిబిరంలో యూపీ హెచ్ సి డాక్టర్ సాయి భార్గవి ఆధ్వర్యంలో వైద్య బృందం కార్మికులకు రక్తపోటు , మధుమేహం వంటి పలు సాధారణ పరీక్షలు చేసి తగిన ఆరోగ్య సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్ రఘుప్రసాద్, శానిటరీ సెక్రటరీలు, హెల్త్ సెక్రటరీలు, మున్సిపల్ సిబ్బంది మరియు పారిశుధ్య కార్మికులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## వరుపుల సాయికిరణ్‌ను పలకరించిన ఎంపీ ఉదయ్ శ్రీనివాస్, ఎమ్మెల్యే సత్యప్రభ

స్వర్గీయ వరుపుల తమ్మయ్యబాబు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన నేతలు

పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చిన ఎంపీ ఉదయ్ శ్రీనివాస్




**కాకినాడ జిల్లా సెప్టెంబర్ 30 (ప్రజా జ్యోతి సాఫ్ రిపోర్టర్)** ఏలేశ్వరం మండలం లింగంపర్తి గ్రామంలో నియోజకవర్గ జనసేన పార్టీ మాజీ ఇన్‌చార్జ్ స్వర్గీయ వరుపుల తమ్మయ్యబాబు కుమారుడు వరుపుల సాయికిరణ్‌ను కాకినాడ పార్లమెంటు సభ్యులు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, స్థానిక ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు, కుడా చైర్మన్ తలాటం సత్య పలకరించారు. ముందుగా స్వర్గీయ వరుపుల తమ్మయ్యబాబు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.అనంతరం వరుపుల సాయికిరణ్‌తో కాసేపు మాట్లాడి కుటుంబ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు, తుని జనసేన నాయకులు యనమల కృష్ణుడు, ఏలేశ్వరం మండల జన సేన పార్టీ అధ్యక్షులు జ్యోతుల పెదబాబు, మీసాల రాజు, గొర్లి నాగేశ్వరరావు, పెంటకోట శ్రీధర్ తదితర జనసేన, టీడీపీ నాయకులు, వరుపుల తమ్మయ్యబాబు అభిమానులు పాల్గొన్నారు.

## గణనాధుని సేవలో పాల్గొన్న క్లస్టర్ ఇంచార్జ్ అంకెం సురేష్...!!



**జి.కొండూరు :(సెప్టెంబర్ 30,ప్రజా జ్యోతి బ్యూరో భట్టిప్రోలు నాగేశ్వరరావు):**జి.కొండూరు మండల కేంద్రము లోని చెరువు బజార్ నందు నరసింహా స్వామి సేవా సమితి వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం లో క్లస్టర్ ఇంచార్జ్ అంకెం సురేష్ పాల్గొని గణనాధుని కి ప్రత్యేక పూజలు చేశారు, వినాయకుని నవరాత్రులు నిర్వహించే కమిటీ సభ్యులు ఎటువంటి ఇబ్బందులు లేకుండ ఊరేగింపు జరుపుకోవాలి అని తెలిపారు, ఈ కార్యక్రమంలో నరసింహా స్వామి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

## ఆలమూరులో శ్రీ లక్ష్మీ గణపతి ఆలయం వద్ద భక్తులకు భారీగా అన్నప్రసాద వితరణ.



**ఆలమూరు సెప్టెంబర్ 30(ప్రజాజ్యోతి):**మండల కేంద్రం ఆలమూరు మెయిన్ రోడ్డులో శ్రీ లక్ష్మీ గణపతి ఆలయం వద్ద గణపతి నవరాత్రుల అనంతరం బుధవారం భారీ అన్న సమారాధన కార్యక్రమాన్ని ఆలయ కమిటీ వారు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం భక్తులకు అన్నప్రసాదాన్ని వితరణ చేశారు.ఈ అన్న సమారాధనకు ఆలమూరు, పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ఆలయ ప్రాంగణంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు, దాతలు, భక్తులు, స్థానికులు పాల్గొన్నారు. అన్న సమారాధనకు సహకరించిన దాతలను, నిర్వాహకులను పలువురు అభినందించారు.

## పోషణపై అవగాహనతో ఆరోగ్యకర సమాజం

**బాపట్ల నియోజకవర్గంలో ఘనంగా పోషణ మాసం కార్యక్రమాలు**



**బాపట్ల సెప్టెంబరు 30 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** తొమ్మిదో జాతీయ పోషణ మాసం సందర్భంగా బాపట్ల నియోజకవర్గంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహారం, చిన్నారుల ఆరోగ్యం, తల్లుల సంరక్షణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఈతేరు గ్రామంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కె.శశిదేవి ఆధ్వర్యంలో అంగన్‌వాడీ సిబ్బంది, పిల్లల తల్లిదండ్రులతో కలిసి కార్యక్రమం నిర్వహించారు.చిన్నారుల శారీరక, మానసిక ఎదుగుదలకు సమతుల్య ఆహారం ఎంతో అవసరమని ఈ సందర్భంగా సిబ్బంది తల్లిదండ్రులకు వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పిల్లల ఎదుగుదలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, పోషకాహార లోపం లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అవగాహన కల్పించారు.పోషణ మాసం కార్యక్రమాల్లో భాగంగా గ్రామస్థులు, తల్లిదండ్రులను భాగస్వాములను చేస్తూ వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వివేక్ ఫౌండేషన్ డాక్టర్ ఆనంద్, స్కూల్ ఉపాధ్యాయులు బాలాజీ రావు, అంగన్‌వాడీ కార్యకర్తలు, పిల్లల తల్లిదండ్రులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# తూఫాన్ పంట నష్టాలపై చేబ్రోలు, లక్ష్మీపురంలో కలెక్టర్ పర్యటన





**గొల్లప్రోలు (ప్రజా జ్యోతి)** అర్నబ్ తుఫాన్ ప్రభావంతో మండల పరిధిలోని చేబ్రోలు, లక్ష్మీపురం గ్రామాల్లో దెబ్బతిన్న వరి పంట పొలాలను జిల్లా కలెక్టర్ ఈరోజు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తుఫాన్ ధాటికి నీట మునిగిన, దెబ్బతిన్న వరి చేలను ఆయన స్వయంగా పరిశీలించి, నష్ట తీవ్రతను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ గారు స్థానిక రైతులతో నేరుగా మాట్లాడారు. తుఫాన్ కారణంగా పంటలకు జరిగిన నష్టం, పెట్టుబడి వ్యయం, ప్రస్తుత పరిస్థితుల్లో రైతాంగం ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకుని వారిని పరామర్శించారు. అనంతరం మల్లవరం రోడ్డులోని పెద్దింటమ్మ తల్లి ఆలయం సమీపంలో ఉన్న వంతెనను కూడా కలెక్టర్ పరిశీలించి, రాకపోకల పరిస్థితిపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో తుఫాన్ వల్ల నష్టపోయిన ప్రతి రైతును ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. అధికారులు తక్షణమే క్షేత్రస్థాయిలో పర్యటించి, పారదర్శకంగా పంట నష్టం వివరాలను నమోదు చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఏ ఒక్క అర్హుడైన రైతుకూ అన్యాయం జరగకుండా నివేదికలు సిద్ధం చేయాలన్నారు.ఈ క్షేత్రస్థాయి పరిశీలన కార్యక్రమంలో ఓదూరి కిషోర్ పాడా పీడీ పిఠాపురం వ్యవసాయ సహాయ అధికారి, గొల్లప్రోలు మండలం తహసీల్దార్ (ఎమ్మార్వో), మండల అభివృద్ధి అధికారి మండల వ్యవసాయ అధికారి, మరియు స్థానిక రైతులు, రెవెన్యూ, వ్యవసాయ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

# గొల్లప్రోలు శివాలయంలో ఘనంగా మూడో రోజు అన్నదానం







**శివాలయంలో దర్శించుకున మాజీ ఎమ్మెల్యే పెండం దొరబాబు, తుమ్మల బాబు, ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్**

**గొల్లప్రోలు (ప్రజా జ్యోతి)** పితృపక్షాల పుణ్యదినాలను పురస్కరించుకొని పిఠాపురం నియోజకవర్గంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పిఠాపురం ఎమ్మెల్యే కొణిదెల పవన్ కళ్యాణ్ తన సొంత నిధులతో చేపట్టిన అన్నదాన కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. నియోజకవర్గంలోని 13 ఆలయాల్లో 14 రోజులపాటు నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమాల్లో భాగంగా గొల్లప్రోలు శివాలయంలో బుధవారం మూడో రోజు అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పిఠాపురం మాజీ ఎమ్మెల్యే పెండం దొరబాబు, తుమ్మల బాబు, కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ గొల్లప్రోలు శివాలయానికి విచ్చేశారు. ఆలయానికి చేరుకున్న వారికి జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు, జనసైనికులు స్వాగతం పలికారు.అనంతరం ఆలయంలో నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే పెండం దొరబాబు, తుమ్మల బాబు, ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు సంప్రదాయబద్ధంగా ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు స్వయంగా భోజనాలు వడ్డింపు లో పాల్గొన్నారు.ప్రత్యేక పూజల అనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పెండం దొరబాబు, తుమ్మల బాబు, ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ పాల్గొని భక్తులకు స్వయంగా భోజనాలు వడ్డించారు. అన్నప్రసాదం స్వీకరించేందుకు వచ్చిన భక్తులకు ఆప్యాయంగా వడ్డిస్తూ కార్యక్రమంలో భాగస్వాములయ్యారు.పితృపక్షాల సందర్భంగా పూర్వీకులను స్మరించుకుంటూ నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఆలయ ప్రాంగణంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ వారు ఏర్పాట్లు చేశారు.గొల్లప్రోలు శివాలయంలో మూడో రోజు అన్నదాన కార్యక్రమం నిర్వహణలో జనసేన పార్టీ పట్టణ అధ్యక్షుడు మామిడాల సూరిబాబు, సీనియర్ జనసేన నాయకులు కడారి తమ్మయ్య నాయుడు, ఆలయ కమిటీ చైర్మన్ గొల్లపల్లి పెద్ద బాబి, బసా చిట్టిబాబు, బసా రాజా, మొగిలి రాజనాయుడు, తదితరులు పాల్గొని సేవలందించారు.అన్నదాన కార్యక్రమంలో భక్తులకు భోజనాలు వడ్డించడంతో పాటు ఏర్పాట్లను పర్యవేక్షించారు. కార్యక్రమం ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో కొనసాగేందుకు నాయకులు, కార్యకర్తలు సహకరించారు.ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు, ఆలయ సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# గొల్లప్రోలు 'మాధురి విద్యాలయ' విద్యార్థి ఘనత

# టైక్వాండో రాష్ట్ర స్థాయి పోటీల్లో ఆరాధ్య శ్రీకి స్వర్ణ పతకం!

**గొల్లప్రోలు (ప్రజా జ్యోతి)** గొల్లప్రోలు ప్రముఖ విద్యాసంస్థ మాధురి విద్యాలయ ద్వితీయ శ్రేణి విద్యార్థిని ఎ. ఆరాధ్య రాష్ట్ర స్థాయిలో అద్భుత ప్రతిభ కనబరిచి స్వర్ణ పతకంతో గోల్డ్ మెడల్ మెరిసింది.ఈ నెల 13-09-2026న కాకినాడ డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన '1వ ఈస్ట్ గోదావరి డిస్ట్రిక్ట్ యూత్ టైక్వాండో ఛాంపియన్‌షిప్ - 2026' పోటీలలో ఆరాధ్య శ్రీ పాల్గొంది. సబ్-జూనియర్ విభాగంలో, అండర్-24 కేజీల కేటగిరిలో ప్రత్యర్థులకు గట్టి పోటీనిస్తూ అసాధారణ ప్రతిభతో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుని బంగారు పతకాన్ని సొంతం చేసుకుంది. చిన్న వయసులోనే రాష్ట్ర స్థాయి పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించి, గొల్లప్రోలు పట్టణానికి విద్యాసంస్థకు ఎనలేని కీర్తి ప్రతిష్టలు తీసుకువచ్చింది.

**ఘనంగా సన్మానించిన విద్యాసంస్థల అధినేత కడాలి తమ్మయ్య నాయుడు**






క్రీడల్లో విజేతగా నిలిచిన విద్యార్థిని ఆరాధ్య శ్రీని బుధవారం మాధురి విద్యాసంస్థల ప్రాంగణంలో అభినందించారు. మాధురి విద్యాసంస్థల అధినేత కడారి తమ్మయ్య నాయుడు ప్రిన్సిపాల్ పద్మావతి విద్యార్థినిని శాలువాతో సత్కరించి, ప్రత్యేక బహుమతి మరియు ప్రశంసా పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా విద్యాసంస్థల అధినేత కడారి తమ్మయ్య నాయుడు మాట్లాడుతూ.. చదువుతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులు రాణించడం ఎంతో గర్వకారణమన్నారు. ఆరాధ్య శ్రీ చిన్న వయసులోనే టైక్వాండోలో స్వర్ణ పతకం సాధించడం ఆమె పట్టుదలకు, క్రమశిక్షణకు నిదర్శనమని కొనియాడారు. భవిష్యత్తులో ఆమె మరిన్ని జాతీయ, అంతర్జాతీయ పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. ప్రిన్సిపాల్ పద్మావతి మాట్లాడుతూ.. విద్యార్థుల్లోని దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడానికి తమ విద్యాసంస్థ ఎల్లప్పుడూ ముందుంటుందని చెప్పారు.ఈ సన్మాన కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం , విద్యార్థులు , ఆరాధ్య శ్రీ తల్లిదండ్రులు పాల్గొని, చిన్నారికి హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.

## బన్నీ ఉత్సవాలు, స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంతంగా జరుపుకోవాలి

------ఎస్సై దిలీప్ కుమార్ గురజాల

**సులువాయి గ్రామంలో పోలీసుల అవగాహన సమావేశం**



**హోళగుంద, సెప్టెంబర్ 30, ప్రజా జ్యోతి న్యూస్ –** రాబోయే దసరా బన్నీ ఉత్సవాలు, స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని సులువాయి గ్రామంలో హోళగుంద ఎస్సై దిలీప్ కుమార్ గురజాల ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ బన్నీ ఉత్సవాలను ప్రతి ఒక్కరూ శాంతియుత వాతావరణంలో, ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని, ఎలాంటి గొడవలకు వెళ్లి ప్రాణాలకు ముప్పు తెచ్చుకోవద్దని సూచించారు. కుటుంబ సభ్యులను దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ సంయమనం పాటించాలని కోరారు.అలాగే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీలకు అతీతంగా ప్రశాంత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియ జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని, ఎలాంటి గొడవలు, ఘర్షణలకు పాల్పడవద్దని సూచించారు.ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, మోసానికి గురైన వెంటనే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు సమాచారం అందించాలని తెలిపారు. మహిళలపై ఎలాంటి నేరాలకు పాల్పడకుండా చట్టాలను గౌరవించాలని, ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని ఎస్సై సూచించారు. గ్రామంలో శాంతిభద్రతలు, ప్రజల భద్రతకు ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని ఈ సందర్భంగా ఎస్సై గ్రామస్తులను కోరారు.

# కూటమి ప్రభుత్వానికి విజ్ఞప్తి!..

**విలీన మండలాల్లో కరువు ఘడియలు!..**

**విలీన మండలాలపై పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ దృష్టి పెట్టాలి!..**

**జనసేన పార్టీ అధ్యక్షులు ములకాల సాయికృష్ణ!..**



**వరరామచంద్రాపురం,సెప్టెంబర్30(ప్రజాజ్యోతి ప్రతినిధి)**మార్కెట్ ధరలను ఎప్పటికప్పుడు అంచనావేస్తూ నిత్యావసరాలు ప్రజలకు అందుబాటులో ఉంచేందుకు రాష్ట్ర పౌర సరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్, అద్భుతమైన నిర్ణయం తీసుకున్నట్లు, జనసేన పార్టీ మండల అధ్యక్షులు ములకాల సాయి కృష్ణ, స్పష్టం చేశారు. బుధవారం ఆయన ప్రజాజ్యోతి ప్రతినిధితో మాట్లాడుతూ ఎన్. సి.సీ.ఎఫ్,సహాకారంతో రాయితీపై 35 రూపాయలకే 1 కేజీ ఉల్లిపాయలు, విక్రయాలు చేసే కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని అది గ్రామాల్లో చౌకదుకాణాల ద్వారా విక్రయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. ఉల్లి, కందిపప్పు, బియ్యం అందించాలని సూచించారు. పంచదార బహిరంగ మార్కెట్ ల్లో కేజీ 60 రూపాయల నుండి 80 రూపాయల వరకు విక్రహిస్తున్నట్లు పేర్కొన్నారు. పోలవరం నిర్వాసిత గ్రామాల్లో పనులు లేక వ్యవసాయ కూలీలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, ప్రత్యేక కౌంటర్ల ద్వారా పోలవరం నిర్వాసితులకు నిత్యావసర సరుకుల సరసమైన ధరలకు అనుగుణంగా అందించాలని సూచించారు. అరకొరవర్షాలు విలీనమండలాల్లో కరువు పరిస్థితులను తెచ్చిపెట్టిందని విలీన మండలాల్లోని అన్నీ గ్రామ పంచాయితీల్లో చౌకదుకాణాల ద్వారా నిత్యావసర సరుకులు అందించి ఆదుకోవాలని,కోరారు. వ్యవసాయం, అంతంత మాత్రం గానే ఉందని రైతుల పరిస్థితులు ఆశాజనకంగా లేవని చెప్పారు. ఏదిఏమైనా విలీనమండలాల్లో సబ్సీడీ పై నిత్యాసారాలు చౌక దుకాణాల ద్వారా అందించాలని విజ్ఞప్తి చేశారు.

# పీజీఆర్ఎస్ ఫిర్యాదుతో స్పందించిన అధికారులు - వేగేశ్వరపురం పంపింగ్ కాలువ పరిశీలన



**తాళ్లపూడి, సెప్టెంబర్ 30,ప్రజాజ్యోతి న్యూస్** తాళ్లపూడి మండలం వేగేశ్వరపురం గ్రామంలోని పంపింగ్ స్కీం మెయిన్ కాలువను ధ్వంసం చేశారంటూ పీజీఆర్ఎస్ లో ఫిర్యాదు రావడంతో అధికారులు స్పందించారు. వేగేశ్వరపురం గ్రామానికి చెందిన న్యాయవాది మారిశెట్టి వెంకట సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం అధికారులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఫిర్యాదులో ఆయన పేర్కొన్న వివరాల ప్రకారం గ్రామానికి చెందిన కైగాల వెంకట సుబ్బారావు మరియు అతని అనుచరులు రుడా నిబంధనలకు విరుద్ధంగా లేఅవుట్ వేసి, డ్రైనేజీ నీటిని జిల్లా పరిషత్ పుంతలోని డ్రైన్ కు కలిపేందుకు ఎవరూ లేని సమయంలో కాలువ గట్టును 4 అడుగుల లోతు, 6 అడుగుల వెడల్పు గా తవ్వి ధ్వంసం చేశారని ఆరోపించారు. ప్రభుత్వ ఆస్తిని ధ్వంసం చేసిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరారు.దీనిపై ఏపీఎస్ఐడీసీ సురేంద్ర, రెవెన్యూ శాఖ అధికారులు కలిసి స్థల పరిశీలన చేశారు. కాలువ గట్టు తవ్వకం జరిగినట్లు నిర్ధారించామని ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించి తదుపరి చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు

# ఆచంట నియోజకవర్గంలో ఉత్సాహంగా సాగిన భారీ 8కె రన్.

**ప్రారంభించిన ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ.**

**ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా కలెక్టర్ నాగరాణి.**




**పోడూరు. ప్రజాజ్యోతి రిపోర్టర్ కొట్టి రామం. సెప్టెంబర్ 30.** డ్రగ్స్‌కు దూరంగా..ఉండటమే యువతకు భవిష్యత్తు బాట అను పవర్‌ఫుల్ నినాదంతో పశ్చిమగోదావరి జిల్లా ఆచంట నియోజకవర్గంలో బుధవారం భారీ 8కె రన్ నిర్వహించారు. మత్తు పదార్థాల నిర్మూలన లక్ష్యంగా యూత్ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పెనుమంట్ర మండలం మార్టేరు నుంచి ఆచంట వరకు సాగిన ఈ రన్‌ను మాజీ మంత్రి, ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ జెండా ఊపి ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. "నేను సైతం" అంటూ కలెక్టర్ నాగరాణి స్వయంగా విద్యార్థులతో కలిసి రన్‌లో ముందుకు సాగారు. వేలాది మంది విద్యార్థులు, యువకులు డ్రగ్స్‌కు వ్యతిరేకంగా బిగ్గరగా నినాదాలు చేస్తూ మార్టేరు నుంచి ఆచంట వరకు ఉత్సాహంగా పరుగులు తీశారు. దీంతో ఈ మార్గమంతా కోలాహలం, సందడి వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ డ్రగ్స్ మత్తులో యువత పడకుండా చూడాల్సిన బాధ్యత సమాజంలో అందరిపైనా ఉందన్నారు. మాదక ద్రవ్యాల వలన యువత జీవితాలు ఎలా నాశనమవుతాయో వివరించటానికి విద్యార్థులకు నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. వేలాది మంది విద్యార్థులు ఈ 8ఖ రన్‌లో పాల్గొనడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ మాట్లాడుతూ మాదకద్రవ్యాల నియంత్రణకు కూటమి ప్రభుత్వం చేపడుతున్న కఠిన చర్యలను వివరించారు.ఈ కార్యక్రమంలో నరసాపురం ఆర్డీవో దాసిరాజు, డీఎస్పీ సుధాకర్, అడిషనల్ డీఎస్పీ విశ్వనాథ్ పలువురు పోలీసు అధికారులు, ఎక్సైజ్ శాఖ అధికారులు, సీఐలు, ఎస్సైలు ఈగల్ ప్రత్యేక విభాగం అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొని భాగస్వాములయ్యారు.ములు తెలియజేసారు.

# విద్యార్థులు హక్కులు, బాధ్యతలు తెలుసుకోవాలి

**గొల్లప్రోలులో న్యాయ అవగాహనా సదస్సు..**

**విద్యార్థులకు ప్రేరణాత్మక సందేశం**





**గొల్లప్రోలు (ప్రజా జ్యోతి)**విద్యార్థులు చిన్నతనం నుంచే చట్టాలు, తమ హక్కులు, బాధ్యతలపై అవగాహన పెంచుకోవాలని పిఠాపురం అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వి.వి. అపర్ణ సూచించారు. గొల్లప్రోలులోని బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలను ఆమె సందర్శించి విద్యార్థులకు ప్రేరణాత్మక సందేశాన్ని అందించారు.ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ.. విద్య ద్వారా ఆత్మవిశ్వాసం, నైతిక విలువలు, క్రమశిక్షణ, ఆరోగ్యం, పరిశుభ్రతపై అవగాహన పెంపొందుతుందని తెలిపారు. స్వావలంబన దిశగా అడుగులు వేయడానికి, కొత్త విషయాలను నేర్చుకోవడానికి, ఎదగడానికి, లక్ష్యాలను ఏర్పరచుకోవడానికి విద్య ఎంతో దోహదపడుతుందన్నారు. దేశ నిర్మాణంలో విద్యార్థులు క్రియాశీలక పాత్ర పోషించాలని సూచించారు.చిన్నారులందరికీ జీవించే హక్కు, నేర్చుకునే హక్కు, అభివృద్ధి చెందే హక్కు, రక్షణ పొందే హక్కు ఉన్నాయని తెలిపారు. గౌరవం, సమానత్వంతో సమాజంలో భాగస్వాములు కావడానికి ప్రతి బాలబాలికకు హక్కు ఉందని వివరించారు.బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినులను ఉద్దేశించి గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై జడ్జి అవగాహన కల్పించారు. ప్రేమ, ఆప్యాయత, రక్షణ కోసం చేసే స్పర్శ పిల్లలకు భద్రత, సంతోషాన్ని కలిగిస్తుందని తెలిపారు. భయం లేదా బాధ కలిగించే స్పర్శను బ్యాడ్ టచ్‌గా గుర్తించాలని సూచించారు. అలాంటి పరిస్థితి ఎదురైతే వెంటనే 'వద్దు' అని చెప్పి అక్కడి నుంచి దూరంగా వెళ్లి, నమ్మకమైన పెద్దలకు సమాచారం అందించాలని సూచించారు.బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతూ గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. గంజాయి ఆరోగ్యం, ఆలోచనా శక్తి, చదువుపై ప్రతికూల ప్రభావం చూపుతుందని తెలిపారు. కౌమార దశలో చెడు స్నేహాలకు దూరంగా ఉండాలని, స్నేహితుల ఒత్తిడితో మత్తు పదార్థాలను ప్రయత్నించకుండా ధైర్యంగా 'వద్దు' అని చెప్పాలని సూచించారు.విద్యార్థులు తమ భవిష్యత్తును కాపాడుకోవాలని, మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ చదువు, క్రీడలు, మంచి లక్ష్యాలపై దృష్టి సారించాలని జడ్జి ఉద్బోధించారు.ఈ కార్యక్రమంలో పిఠాపురం బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ ఎస్.ఎం. అలీ, అడ్వకేట్లు ఎం. సత్యవతి, ఏహెచ్. సాయి, లీగల్ వాలంటీర్ ఎం.వి. సూరిబాబు, ప్రధానోపాధ్యాయులు ఆశాభి, పాపారావు, సీఆర్ఎంటీలు ఆకుల రామకృష్ణ, నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం...!!

**టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు వేములకొండ వెంకటేశ్వరరావు, మండల పార్టీ కార్యదర్శి లంక నాగేశ్వరరావు (నాని)....!!**





**జి.కొండూరు :(సెప్టెంబర్ 30,ప్రజా జ్యోతి బ్యూరో భట్టిప్రోలు నాగేశ్వరరావు):**ఎన్టీఆర్ జిల్లా మైలవరం నియోజకవర్గం కుంటముక్కల గ్రామంలో బుధవారం ఎమ్మెల్యే వసంత సూచనలు మేరకు ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జి.కొండూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వేములకొండ వెంకటేశ్వరరావు మండల పార్టీ కార్యదర్శి లంక నాగేశ్వరరావు (నాని),టీడీపీ సీనియర్ నేత వుయ్యూరు నరసింహారావు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నే...జి.కొండూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వేములకొండ వెంకటేశ్వరరావు మాట్లాడతూ...దశాబ్దాలుగా సొంత ఇంటి స్థలం కోసం ఎదురుచూస్తున్న పేద కుటుంబాల కలను సాకారం చేసే దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు. అలాగే ఇందులో భాగంగా జి.కొండూరు మండలం కుంటముక్కల గ్రామంలో అర్హులైన పేద కుటుంబాలకు రిజిస్ట్రేషన్ చేసిన ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. సుమారు 50 ఏళ్లుగా సొంత ఇంటి స్థలం కోసం ఎదురుచూస్తున్న కుటుంబాలకు పట్టాలు అందడంతో లబ్ధిదారుల్లో ఆనందం వెల్లివిరిసిందన్నారు.

**అలాగే మండల పార్టీ కార్యదర్శి లంక నాగేశ్వరరావు (నాని) మాట్లాడతూ...**

సొంత ఇంటి స్థలం అనేది పేద కుటుంబాలకు కేవలం ఆస్తి మాత్రమే కాకుండా భద్రమైన భవిష్యత్తుకు భరోసా అని పేర్కొన్నారు. ఎన్నో ఏళ్లుగా పట్టాల కోసం ఎదురుచూస్తున్న అర్హులైన కుటుంబాలకు ఇప్పుడు చట్టబద్ధమైన హక్కు కల్పించడం సంతోషకరమన్నారు.పేదల సంక్షేమం, వారికి సొంత గూడు కల్పించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. అర్హత ఉన్న ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేస్తామని చెప్పారు.మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు సూచనల మేరకు కుంటముక్కల గ్రామంలో అర్హులైన పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ చేపట్టినట్లు టీడీపీ నాయకులు తెలిపారు. ప్రభుత్వ యంత్రాంగంతో సమన్వయం చేసుకుంటూ అర్హులైన లబ్ధిదారులకు పట్టాలు అందేలా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు.ఇళ్ల పట్టాలు చేతికి అందడంతో తమకు ఎన్నో ఏళ్లుగా ఉన్న సొంతింటి కల నెరవేరే అవకాశం ఏర్పడిందని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. తమ కుటుంబాలకు సొంత స్థలం కల్పించినందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి , మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదుకి కృతజ్ఞతలు తెలిపారు.

**పేదల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం**

పేదలకు కేవలం ఇళ్ల స్థలాలు ఇవ్వడమే కాకుండా, వారు ఆ స్థలాల్లో గృహ నిర్మాణం చేపట్టేలా అవసరమైన ప్రభుత్వ సహకారం అందించాల్సిన అవసరం ఉందని నాయకులు పేర్కొన్నారు. సొంత ఇంటి ద్వారా పేద కుటుంబాలకు సామాజిక భద్రత, ఆర్థిక స్థిరత్వం కలుగుతుందని తెలిపారు.గతంలో ఎన్నో సంవత్సరాలుగా పరిష్కారం కాని సమస్యలకు పరిష్కారం చూపుతూ అర్హులైన పేదలకు ఇళ్ల పట్టాలు అందించడం ద్వారా ప్రభుత్వం వారి జీవితాల్లో భరోసా నింపుతోందని అన్నారు. పేదల సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను గ్రామస్థాయిలో మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు సమన్వయంతో పనిచేస్తారని తెలిపారు.

**లబ్ధిదారుల్లో ఆనందం**

ఇళ్ల పట్టాలు అందుకున్న లబ్ధిదారులు మాట్లాడుతూ.. ఇన్నేళ్లుగా సొంత ఇంటి స్థలం కోసం ఎదురుచూస్తున్నామని, ఇప్పుడు తమ చేతికి పట్టాలు రావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. తమ పిల్లలకు సొంత ఇంటి చిరునామా కల్పించాలన్న కోరిక నెరవేరే అవకాశం ఏర్పడిందని తెలిపారు. ప్రభుత్వానికి, ప్రజాప్రతినిధులకు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రిబ్కా రాణి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆదర్శ్ కళాశాలలో 'సాధన 2026' జాతీయ స్థాయి హ్యాకథాన్ పోస్టర్ ఆవిష్కరణ




**గొల్లప్రోలు (ప్రజా జ్యోతి)** గొల్లప్రోలు మండలం చేబ్రోలు గ్రామంలోని ఆదర్శ్ ఇంజనీరింగ్ కళాశాలలో 'సాధన 2కె26' జాతీయ స్థాయి టెక్ హ్యాకథాన్ పోస్టర్‌ను బుధవారం కళాశాల చైర్మన్ బుర్రా అనుబాబు, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ బుర్రా అనురాధ ఘనంగా ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కళాశాల నిర్వాహకులు మాట్లాడుతూ.. అక్టోబర్ 8 నుండి 10వ తేదీ వరకు మూడు రోజుల పాటు ఈ జాతీయ స్థాయి హ్యాకథాన్‌ను నిర్వహించనున్నట్లు తెలిపారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా ఈ కార్యక్రమాన్ని రూపొందించామని పేర్కొన్నారు. ముఖ్యంగా సైబర్ సెక్యూరిటీ, కోడింగ్, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, నూతన ఆవిష్కరణలపై విద్యార్థుల్లో ఆసక్తిని పెంపొందించడమే లక్ష్యంగా 'సాధన 2కె26'ను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ హ్యాకథాన్ ద్వారా విద్యార్థులు తమ సాంకేతిక నైపుణ్యాలను ప్రదర్శించడంతో పాటు, సమాజంలోని వివిధ సమస్యలకు సృజనాత్మక పరిష్కారాలను కనుగొనే అవకాశం లభిస్తుందన్నారు.

**సాంకేతిక రంగంలో మార్పులను అందుకోవాలి: చైర్మన్ బుర్రా అనుబాబు**

ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ బుర్రా అనుబాబు మాట్లాడుతూ.. సాంకేతిక రంగంలో వస్తున్న వేగవంతమైన మార్పులను విద్యార్థులు ఎప్పటికప్పుడు గమనిస్తూ అప్‌డేట్ అవ్వాలని సూచించారు. ఆధునిక టెక్నాలజీని విద్యాభివృద్ధి, నైపుణ్యాల పెంపుదల మరియు ఉజ్వల భవిష్యత్తు అవకాశాల కోసం సద్వినియోగం చేసుకోవాలన్నారు. యువత చెడు వ్యసనాలకు, చెడు స్నేహాలకు దూరంగా ఉంటూ సమయాన్ని వృథా చేయకుండా, పోటీ తత్వంతో అనుకున్న లక్ష్యాలను సాధించాలని పిలుపునిచ్చారు.

**సెక్రటరీ బుర్రా అనురాధ**

కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ బుర్రా అనురాధ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగి ఉన్న అద్భుతమైన సాంకేతిక ప్రతిభను, సరికొత్త ఆలోచనలను వెలికితీయడమే 'సాధన 2కె26' ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ జాతీయ స్థాయి హ్యాకథాన్ విద్యార్థులకు తమ నైపుణ్యాలను జాతీయ వేదికపై నిరూపించుకోవడానికి ఒక సువర్ణావకాశం అని పేర్కొన్నారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ బుర్రా అఖిలేష్, ప్రిన్సిపల్ డాక్టర్ వైవీఎన్ రాజశేఖర్, డీన్ ఎస్.కొండలరావు, ప్రోగ్రాం కోఆర్డినేటర్లు టి.ప్రేమ్ బాస్కో, ఎం.సుబ్బారావులతో పాటు వివిధ విభాగాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఏడు వార్డుల్లో సీసీ రోడ్లకు శ్రీకారం





**బాపట్ల సెప్టెంబరు 30 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** బాపట్ల పట్టణంలోని ఏడు వార్డుల్లో రహదారుల నిర్మాణానికి అడుగు పడింది. 10.20 కోట్ల రూపాయల నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్ల పనులకు ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ బుధవారం శంకుస్థాపన చేశారు. 1, 2, 3, 7, 8, 9, 10వ వార్డుల పరిధిలోని పలు ప్రాంతాల్లో భూమిపూజ నిర్వహించి పనులను ప్రారంభించారు.పట్టణంలో రహదారుల సమస్య ఉన్న ప్రాంతాలను దశలవారీగా అభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా రోడ్ల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సహకారంతో నియోజకవర్గానికి నిధులు సమకూరుతున్నాయని పేర్కొన్నారు.ప్రారంభించిన పనుల్లో నాణ్యత విషయంలో రాజీ పడొద్దని అధికారులకు సూచించారు. నిర్మాణ పనులను పర్యవేక్షిస్తూ నిర్దేశిత ప్రమాణాలతో పూర్తి చేయాలని ఆదేశించారు. పట్టణంలో అవసరమైన ఇతర మౌలిక వసతుల పనులను కూడా ప్రాధాన్యతా క్రమంలో చేపడతామని ఎమ్మెల్యే తెలిపారు.కార్యక్రమాల్లో మున్సిపల్ అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# సీఎం పర్యటనకు రేపల్లె ముస్తాబు

## ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి, కలెక్టర్, ఎస్పీ



**బాపట్ల, సెప్టెంబరు 30 (ప్రజా జ్యోతి)** చదువుకున్న యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు పెట్టుబడులు, పరిశ్రమలను ప్రోత్సహించడం పై ప్రభుత్వం దృష్టి సారించిందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. గురువారం రేపల్లెలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటించనున్న నేపథ్యంలో బుధవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ వాసుదేవా, జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. హెలిప్యాడ్, భద్రతా ఏర్పాట్లతో పాటు ముఖ్యమంత్రి ప్రజాప్రతినిధులతో సమావేశమయ్యే ప్రాంతాన్ని మంత్రి పరిశీలించారు. ప్రజావేదిక వద్ద సీటింగ్, ఇతర ఏర్పాట్లను తనిఖీ చేశారు. పార్టీ కార్యకర్తల సమావేశం జరిగే వేదికను కూడా పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వ పథకాల ద్వారా విద్యార్థులు చదువుకోవడంతో పాటు వారి విద్యార్హతలకు అనుగుణంగా ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని పార్థసారథి అన్నారు. ఉద్యోగాల కల్పన కోసం పెట్టుబడులు, పరిశ్రమలను రాష్ట్రానికి తీసుకురావడంపై ప్రభుత్వం దృష్టి పెట్టిందని తెలిపారు. 20 లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యంగా చర్యలు కొనసాగుతున్నాయని, ప్రభుత్వ శాఖల్లో ఖాళీల భర్తీకి నోటిఫికేషన్లు జారీ చేస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో పెట్టుబడులకు అనుకూల వాతావరణం కల్పించడంతో పలు సంస్థలు ఆసక్తి చూపుతున్నాయని మంత్రి పేర్కొన్నారు. సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, భూ సమస్యలను దశలవారీగా పరిష్కరించే చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. రేపల్లెలో ముఖ్యమంత్రి పర్యటనకు ప్రజలు ఉదయం 9 గంటలకు హాజరుకావాలని మంత్రి కోరారు. పర్యటనలో చేనేత కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ హేమలత, బుడా చైర్మన్ సలగల రాజశేఖర్‌బాబు, జిల్లా అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# పోలీసు సేవలకు ఆత్మీయ వీడ్కోలు



**విజయనగరం సెప్టెంబరు 30 (ప్రజా జ్యోతి ప్రతినిధి)** పోలీసుశాఖలో సుదీర్ఘకాలం సేవలందించి ఉద్యోగ విరమణ పొందుతున్న నలుగురు పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ ఎ.ఆర్. దామోదర్ ఘనంగా సత్కరించి ఆత్మీయ వీడ్కోలు పలికారు. జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఉద్యోగ విరమణ చేసిన అధికారులతో పాటు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఉద్యోగ విరమణ పొందిన వారిలో జిల్లా పోలీసు శిక్షణ కేంద్రం డీఎస్పీ పూరేటి నారాయణరావు, ఆర్మ్డ్ రిజర్వ్ ఆర్ఎస్ఐ వేముల గణేష్ తిరుమలరావు, విజయనగరం రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ ఏఎస్ఐ నామాల లక్ష్మణరావు, కొత్తవలస పోలీస్‌స్టేషన్ ఏఎస్ఐ రోణంకి జనార్ధనరావు ఉన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ దామోదర్ మాట్లాడుతూ. పోలీసుశాఖలో బాధ్యతలు నిర్వర్తిస్తూ ప్రజలకు అందించిన సేవలు అభినందనీయమన్నారు. విధి నిర్వహణలో ఎదురైన సవాళ్లను అధిగమిస్తూ నిబద్ధతతో పనిచేసిన ఉద్యోగుల సేవలు శాఖకు ఎప్పటికీ గుర్తుండిపోతాయని పేర్కొన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో ప్రశాంతంగా, ఆరోగ్యంగా సంతోషకరమైన జీవితం గడపాలని ఆకాంక్షించారు. రిటైర్మెంట్ అనంతరం అందే ప్రయోజనాలను ఆర్థికంగా సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. అనధికార సంస్థల్లో పెట్టుబడులు పెట్టడం, అధిక వడ్డీలకు ఆశపడి ఇతరులకు అప్పులు ఇవ్వడం వంటి వాటికి దూరంగా ఉండాలని, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఆర్థిక ప్రణాళికతో ముందుకు సాగాలని సూచించారు. అనంతరం ఉద్యోగ విరమణ చేసిన అధికారులు, వారి సతీమణులను పోలీసుశాఖ తరఫున శాలువాలు, పుష్పమాలలతో సత్కరించి జ్ఞాపికలు, బహుమతులు అందజేశారు. పోలీసు ఉద్యోగుల కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ తరఫున కూడా చెక్కులు, జ్ఞాపికలను అందించారు. కార్యక్రమంలో అడ్మిన్ ఎస్పీ పి.సౌమ్యలత, ఏఆర్ అదనపు ఎస్పీ పి.కిరణ్‌కుమార్, ఏఆర్ డీఎస్పీ ఈ.కోటిరెడ్డి, స్పెషల్ బ్రాంచ్ సీఐ ఏవీ లీలారావు, రెండో పట్టణ సీఐ టి.శ్రీనివాస్, ఆర్ఐలు గోపాలనాయుడు, ఆర్.రమేష్‌కుమార్ తదితర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# గంజాయి గ్యాంగ్‌లపై ఉక్కుపాదం!

## మహిళలు, బాలికల జోలికొస్తే కఠిన చర్యలు

## బాల్య వివాహాలు చేస్తే చట్టం ముందు నిలబడాల్సిందే: ఎస్సై అప్పలరాజు

**ఎటపాక, సెప్టెంబర్ 30 (ప్రజాజ్యోతి):** గంజాయి, మత్తు పదార్థాల అక్రమ రవాణా, వినియోగంపై ఉక్కుపాదం మోపుతామని ఎటపాక ఎస్సై జి. అప్పలరాజు హెచ్చరించారు. మహిళలు, బాలికల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడేవారిపై కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. మండల పరిధిలోని నెల్లిపాక గ్రామంలో బుధవారం పోలీసు సిబ్బందితో కలిసి పర్యటించిన ఆయన 'ఆపరేషన్ త్రిశూల్' కార్యక్రమంలో భాగంగా గ్రామస్తులు, యువతకు నేరాల నియంత్రణ, మహిళల రక్షణ, మత్తు పదార్థాల నిర్మూలన, రహదారి భద్రత, బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై అప్పలరాజు మాట్లాడుతూ గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఎలాంటి చర్యలనూ ఉపేక్షించబోమన్నారు. ముఖ్యంగా గంజాయి, ఇతర మత్తు పదార్థాలు యువత భవిష్యత్తును నాశనం చేస్తున్నాయని, వాటి రవాణా, విక్రయం, వినియోగానికి పాల్పడేవారిపై చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో అనుమానాస్పద వ్యక్తులు లేదా మత్తు పదార్థాలకు సంబంధించిన కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

**మహిళల భద్రతపై ప్రత్యేక దృష్టి**

మహిళలు, యువతులు, బాలికల రక్షణకు పోలీసు శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ఎవరైనా వేధింపులకు గురిచేసినా, ఆపదలో ఉన్నా భయపడకుండా వెంటనే 112కు లేదా స్థానిక పోలీసులను సంప్రదించాలని సూచించారు. మహిళల భద్రత విషయంలో ప్రజలు కూడా బాధ్యతగా వ్యవహరించి పోలీసులకు సహకరించాలని కోరారు.

**నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు**

రహదారి భద్రతపై కూడా గ్రామస్తులకు అవగాహన కల్పించారు. హెల్మెట్, సీటు బెల్టు ధరించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్, మద్యం సేవించి వాహనాలు నడపడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు. చిన్నపాటి నిర్లక్ష్యం విలువైన ప్రాణాలను బలిగొంటుందని హెచ్చరించారు.

**బాల్య వివాహాలకు స్వస్తి పలకాలి**



బాల్య వివాహాలు బాలికల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టే సామాజిక దురాచారమని ఎస్సై అన్నారు. బాలికలను చిన్న వయసులో వివాహం చేయకుండా ఉన్నత విద్యను అందించాలని తల్లిదండ్రులకు సూచించారు. బాల్య వివాహాలకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. నేరాల నియంత్రణలో ప్రజల సహకారం కీలకమని, పోలీసులకు అందే ప్రతి సమాచారాన్ని గోప్యంగా ఉంచుతూ చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై తెలిపారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, గ్రామ పెద్దలు, యువకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# రేపల్లెలో సీఎం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

## బందోబస్తు సిబ్బందికి ఎస్పీ ఉమామహేశ్వర్ దిశానిర్దేశం



**బాపట్ల సెప్టెంబరు 30 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రేపల్లెలో పర్యటించనున్న నేపథ్యంలో పోలీసులు పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. పర్యటన సందర్భంగా విధులు నిర్వహించనున్న పోలీసు అధికారులు, సిబ్బందికి జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ బుధవారం జూనియర్ కళాశాల ప్రాంగణంలో బ్రీఫింగ్ నిర్వహించి పలు సూచనలు చేశారు. ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతాలు, హెలిప్యాడ్, ప్రజా వేదిక, గ్యాలరీలు, ప్రవేశ ద్వారాలు, పార్కింగ్ ప్రాంతాలు, రూఫ్‌టాప్‌లు, ట్రాఫిక్ మళ్లింపు పాయింట్ల వద్ద విధులు నిర్వహించే సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచించారు. విధులకు కేటాయించిన ప్రాంతాల్లో సమయపాలనతో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. ప్రజా వేదికకు వచ్చే ప్రతి ఒక్కరినీ క్షుణ్ణంగా తనిఖీ చేసిన అనంతరం అనుమతించాలని, వీఐపీలు, ప్రజలు, కార్యకర్తలకు ఇబ్బందులు కలగకుండా భద్రతా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి కాన్వాయ్ రాకపోకల సమయంలో మాత్రమే అవసరమైన చోట ట్రాఫిక్‌ను మళ్లించాలని, సాధారణ రాకపోకలకు వీలైనంత వరకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. భద్రతను మరింత పటిష్ఠం చేసేందుకు కీలక ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి కంట్రోల్ రూమ్ ద్వారా నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. వైర్‌లెస్ ద్వారా సమాచారాన్ని ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ విధులు నిర్వహించాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం లేదా గైర్హాజరును ఉపేక్షించబోమని ఎస్పీ హెచ్చరించారు. బ్రీఫింగ్ అనంతరం ఎస్పీ ఉమామహేశ్వర్ హెలిప్యాడ్ నుంచి ముఖ్యమంత్రి కాన్వాయ్ మార్గంలో ట్రయల్ రన్ నిర్వహించారు. మార్గమధ్యంలోని భద్రతా ఏర్పాట్లు, బారికేడింగ్, ట్రాఫిక్ నియంత్రణ, విధుల్లో ఉన్న సిబ్బంది స్థానాలను పరిశీలించి అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఎల్.సుధాకర్, రేపల్లె డీఎస్పీ షేక్ అబ్దుల్ అజీజ్, బాపట్ల డీఎస్పీ సిహెచ్.చంద్రమౌళితో పాటు బందోబస్తు విధులకు హాజరైన పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సొసైటీ చైర్మన్ తలారి. ముస్తానప్ప ఆధ్వర్యంలో సహకార సంఘం సర్వసభ్య సమావేశం



**గుంతకల్లు సెప్టెంబర్ 30 (ప్రజా జ్యోతి):** ఏ డి సి సి సొసైటీ చైర్మన్ తలారి మస్తానప్ప ఆధ్వర్యంలో గుంతకల్లు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాం సభ్యులు 200 మంది రైతులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రైతులకు కొత్త లోన్లు మరియు పాత బకాయిలు రెన్యువల్ చేయడం చర్చించడం జరిగింది. ఈ సమావేశంలో తలారి మస్తానప్ప మాట్లాడుతూ రైతులకు సకాలంలో పంట రుణాలు అందజేయడం, అర్హులైన రైతుల కుటుంబాలకు గ్రూప్ ఇన్సూరెన్స్ లేదా సహకార సంఘాల సంరక్షణ నిధి ద్వారా ఆర్థిక భరోసా కల్పించడం, సబ్సిడీ పై వ్యవసాయ పరికరాలు అందించడం, కరువు నివారణ చర్యలపై సొసైటీ ఆర్థిక సహకారంతో గ్రామీణ ప్రాంతాలలో రైతులకు ఉపయోగపడే నూతన పెట్రోల్ బంకులు, ఎరువులు మరియు విత్తనాల పంపిణీ కేంద్రాలను, గ్యాస్ గోడంగులు, పశువుల దాన కేంద్రాలను తదితర అంశాలపై చర్చించి మహాసభ లో ఏకగ్రీవంగా తీర్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ తలారి. మస్తానప్ప, డైరెక్టర్ శివ శంకర్, సుబ్బయ్య,ఏడిసిసి మేనేజర్ రాఘవేంద్ర ప్రసాద్, సొసైటీ ఇన్చార్జి, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

# రూ.10 లక్షలతో నూతన సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేసిన:గుమ్మనూరు నారాయణస్వామి




**గుంతకల్లు సెప్టెంబర్ 30 (ప్రజా జ్యోతి):** మండలం ఎర్రతిమ్మచెరువు గ్రామంలో రూ.10 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు గుంతకల్లు మండల ఇంచార్జ్ గుమ్మనూరు నారాయణ స్వామి బుధవారం భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా నారాయణ స్వామి మాట్లాడుతూ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ఆదేశాల మేరకు గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. విబి-జీ రాంజీ పథకం ద్వారా ఎర్రతిమ్మ చెరువు గ్రామంలో నూతన సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.10 లక్షలు కేటాయించా మని, ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యం కల్పించడమే లక్ష్యంగా పనులు ప్రారంభించామని తెలిపారు. అదేవిధంగా పల్లె పండుగ 3.0 ద్వారా గ్రామా ల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, గోకుల్ షెడ్లు, తాగునీటి పైపులైన్లు తదితర మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. సంక్షేమంతో పాటు అభివృద్ధికి సమాన ప్రాధాన్యత ఇస్తూ, కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తోందని నారాయణస్వామి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు, ప్రజాప్రతి నిధులు, అధికారులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# చొప్పెల్ల గవర్నమెంట్ ఆసుపత్రి వెనుక వీధి బాల గణపతి భక్తుల కోలాహలం మధ్య గణపతి నిమజ్జనం,గంగమ్మ ఒడికి గణనాథుడు.



**ఆలమూరు సెప్టెంబర్ 30 (ప్రజాజ్యోతి):** ఆలమూరు మండలం చొప్పెల్ల గ్రామం గవర్నమెంట్ ఆసుపత్రి వెనుక వీధిలో బాల గణపతి కమిటీ ఆధ్వర్యములో వినా యక చవితి నవరాత్రులు అనంతరం బుధవారం భక్తుల కోలాహలం మధ్య గణేశుడి నిమజ్జనం ఊరేగింపు కార్యక్రమం అత్యంత ఘనంగా జరిగింది. స్వామివారి అతి భారీ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై ఉంచి ఊరంతా ఊరేగించారు. ప్రశాంత వాతావరణంలో జరిగిన ఊరేగింపు అనంతరం గంగమ్మ ఒడికి గణనాథుడు చేరాడు. ఇక్కడ గణపతి నవరాత్రులు ఉత్సవాలు జరపడం ఇది ఇరవై అయిద సంవత్సరం అని,వినాయక చవితి నవరాత్రులు,అన్నసంతర్పణ, నిమజ్జనం ఊరేగింపు కార్యక్రమాలు బాగా జరగడానికి సహకరించిన దాతలందరికి, పోలీసు శాఖ వారికి,విద్యుత్ శాఖ వారికి బాల గణపతి కమిటీ సభ్యులు ధన్యవాదములు తెలియజేసారు.

# గంగవరంలో కొర్ర పంటపై క్షేత్ర దినోత్సవం



**నందవరం, సెప్టెంబర్ 30(ప్రజా జ్యోతి ):** మండల పరిధిలోని గంగవరం గ్రామంలో అఖిల భారత పంట వైవిధ్యాల పథకం, సమగ్ర చిరుధాన్యాల పరిశోధనా కార్యక్రమాల ఆధ్వర్యంలో కొర్ర పంటపై క్షేత్ర దినోత్సవం నిర్వహించారు. రైతు వేనుగోపాల్ సాగు చేసిన ఎస్ ఐ ఏ-3159 (మహానంది) కొర్ర పంటను పరిశీలించి దిగుబడి అంచనా వేశారు. సుమారు 85 రోజుల పంటకాలం కలిగిన ఈ రకం ఎకరాకు 11--12 క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు తెలిపారు. తక్కువ నీటితో సాగు చేయగల కొర్ర పంటను పంటల వైవిధ్యీకరణలో భాగంగా ప్రోత్సహించాలని సూచించారు. ఈ రకం పశుగ్రాసంగా కూడా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కేవీకే బనవాసి కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ కే. రాఘవేంద్ర చౌదరి, శాస్త్రవేత్తలు డాక్టర్ ఎం. వెంకటరమణమ్మ, డాక్టర్ కే. తేజేశ్వరరావు, వ్యవసాయ అధికారులు ఎస్.కే.ఎం.డి. ఖాద్రి, సరిత, రైతులు పాల్గొన్నారు.

# 710 టన్నుల ఇనుప ఖనిజం సీజ్

## హిటాచీ, రెండు టిప్పర్లు, క్యాంపర్ స్వాధీనం
## మరుసటి రోజే హిటాచీ, టిప్పర్లు మాయం.. పోలీసులకు ఫిర్యాదు
## గుటుపల్లెలో అధికారుల పరిశీలన.. బాధ్యులపై చర్యలు తప్పవన్న ఆర్డీవో





**బేతంచెర్ల:సెప్టెంబర్30(ప్రజా జ్యోతి)** గుటుపల్లె సమీపంలో అక్రమంగా తవ్వి నిల్వ చేసిన 710 టన్నుల ఇనుప ఖనిజాన్ని అధికారులు సీజ్ చేశారు. అక్రమ మైనింగ్‌పై సోమవారం కర్నూలు విజిలెన్స్ స్క్వాడ్, బనగానపల్లె, బేతంచెర్ల మైనింగ్ అధికారులు సంయుక్తంగా నిర్వహించిన తనిఖీల్లో ఈ అక్రమ తవ్వకాలు వెలుగులోకి వచ్చాయి. ఈ సందర్భంగా ఒక హిటాచీ, రెండు టిప్పర్లు, ఒక క్యాంపర్ వాహనాన్ని సీజ్ చేశారు.అయితే అధికారులు సీజ్ చేసిన హిటాచీ, రెండు టిప్పర్లు అదే రోజు అర్ధరాత్రి మైనింగ్ ప్రాంతం నుంచి తరలించినట్లు గుర్తించారు. మంగళవారం ఉదయం రెవెన్యూ అధికారులు సంఘటనా స్థలానికి వెళ్లినప్పుడు సీజ్ చేసిన వాహనాలు అక్కడ కనిపించలేదు. దీంతో వాహనాల తరలింపు వ్యవహారం అధికారుల దృష్టికి వచ్చింది.వాహనాల ఆచూకీ కోసం రెవెన్యూ, మైనింగ్ అధికారులు గాలింపు చేపట్టారు. సీజ్ చేసిన వాహనాలు అధికారుల అదుపులో ఉండగా అక్కడి నుంచి ఎలా తరలిపోయాయన్న అంశంపై అధికారులు వివరాలు సేకరిస్తున్నారు.

### అధికారుల పరిశీలన

ఈ నేపథ్యంలో డోన్ ఆర్డీవో నరసింహులు, తహసీల్దార్ నాగమణి, నంద్యాల జిల్లా మైన్స్ ఏడీ వేణుగోపాల్ బుధవారం గుటుపల్లె సమీపంలోని అక్రమ మైనింగ్ ప్రాంతాన్ని పరిశీలించారు. అక్రమంగా తవ్విన ప్రాంతం, నిల్వ చేసిన ఇనుప ఖనిజం, సీజ్ చేసిన వాహనాల వివరాలను పరిశీలించారు.సీజ్ చేసిన వాహనాలను తప్పనిసరిగా గుర్తిస్తామని, వాటిని తరలించిన బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆర్డీవో నరసింహులు, మైన్స్ ఏడీ వేణుగోపాల్ తెలిపారు. అక్రమంగా తవ్విన ఇనుప ఖనిజాన్ని ప్రభుత్వ నిబంధనల ప్రకారం సీజ్ చేస్తామని స్పష్టం చేశారు.

### పోలీసులకు ఫిర్యాదు

సీజ్ చేసిన వాహనాలు మైనింగ్ ప్రాంతం నుంచి తరలించిన ఘటనపై వీఆర్వో రఫీ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయాన్ని తహసీల్దార్‌కు తెలియజేసి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు.సంఘటనా స్థలంలో సీజ్ చేసిన వాహనాలు లేకపోవడంపై ఆర్డీవో వీఆర్వోపై అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం.

### తేలాల్సిన అంశాలు



సీజ్ చేసిన వాహనాలు ఎవరి ఆధ్వర్యంలో ఉండగా తరలిపోయాయి? వాటిని ఎవరు తరలించారు? ఏ మార్గంలో తీసుకెళ్లారు? అనే అంశాలపై అధికారుల విచారణ, పోలీసుల దర్యాప్తులో స్పష్టత రావాల్సి ఉంది.ఇదిలా ఉండగా, వాహనాల తరలింపు వెనుక అధికార పార్టీకి చెందిన కొందరు నాయకుల ప్రమేయం ఉందంటూ స్థానికంగా చర్చ జరుగుతోంది. అయితే ఈ ఆరోపణకు సంబంధించి ఇప్పటివరకు అధికారికంగా ఎలాంటి నిర్ధారణ వెలువడలేదు.

# ముల్లూరు ఎంపీపీ పాఠశాల విద్యాకమిటీ చైర్మన్‌గా సేలం రాజేంద్రప్రసాద్ ఏకగ్రీవం

**కూటూరు, సెప్టెంబర్ 30: ప్రజా జ్యోతి** పోలవరం జిల్లా రంపచోడవరం నియోజకవర్గం కూనవరం మండలం కూటూరు గ్రామపంచాయతీ పరిధిలోని ముల్లూరు ఎంపీపీ పాఠశాలలో విద్యాకమిటీ ఎన్నికలు బుధవారం నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ బలపరిచిన గ్రామ కమిటీ అధ్యక్షుడు సోడే నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ ఎన్నికల్లో విద్యాకమిటీ చైర్మన్‌గా సేలం రాజేంద్రప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వైస్ చైర్మన్‌గా కట్టం రాములమ్మ ఎన్నికయ్యారు. విద్యాకమిటీ సభ్యులుగా సోడే నాగేశ్వరరావు, గోళ్ల పార్వతి, మడకం రుక్మి, నాగుల ఆమని, సేలం రోజా, మడకం రామకృష్ణ, మడకం భద్రమ్మ, ఉయిక నారాయణ, పైదా భద్రమ్మ, కోమ్మిని లక్ష్మి, మడకం జయ, పైదా శృతి, విజయలక్ష్మి తదితరులు ఎన్నికయ్యారు. కో-ఆప్టెడ్ సభ్యులుగా సేలం వంశీ, అన్నపూర్ణలను ఎన్నుకొని తీర్మానం చేశారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన విద్యాకమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, సభ్యులకు ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు. పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల సంక్షేమానికి కమిటీ సమష్టిగా కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.




# కిరికెర సచివాలయం ఏమైనా రహస్య స్థావరా?

- ఏహెచ్ అంజి
- బోర్డులు ఉండవు.. వివరాలు చెప్పరు
..ఇది పౌర సేవ ..
- ఆర్టీఐ చట్టానికి తూట్లు: ఆ సచివాలయంలో 'సమాచార హక్కు' బోర్డే లేదు!



**హిందూపురం: ప్రజా జ్యోతి న్యూస్ :సెప్టెంబర్ 30: శ్రీ సత్య సాయి జిల్లా బ్యూరో:** ఆర్టిఐ ఫైట్ ఫర్ సోషల్ జస్టిస్ శ్రీ సత్య సాయి జిల్లా వైస్ ప్రెసిడెంట్ ఏహెచ్ అంజి నేడు స్వర్ణ కిరికెర ఒకటి కార్యాలయంలో సమాచార హక్కు చట్టం బోర్డు పెట్టలేదు అని అందిన సమాచారంతో స్వర్ణ కిరికెర ఒకటి కార్యాలయంలో సందర్శించి బోర్డు లేకపోవడంతో విచారం వ్యక్తం చేసే అనంతరం మీడియాతో ఈ క్రింది విధంగా మాట్లాడారు హిందూపురం మండలం పరిధిలోని స్వర్ణ కిరికెర ఒకటి కార్యాలయంలో సమాచార హక్కు చట్టాన్ని అధికారులు పూర్తిగా అటకెక్కించారు. ప్రజాస్వామ్యంలో అత్యంత కీలకమైన పరిపాలనలో పారదర్శకతకు మారుపేరైన సమాచార హక్కు చట్టం 2005 నిబంధనలను ఇక్కడి సచివాలయ సిబ్బంది పూర్తిగా గాలికొదిలేశారు. కార్యాలయంలో ప్రజలకు స్పష్టంగా కనిపించాల్సిన ఆర్టీఐ సమాచార బోర్డును ఏర్పాటు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న తీరుపై ఆర్టిఏ ఫైట్ ఫర్ సోషల్ జస్టిస్' సంస్థ శ్రీ సత్య సాయి జిల్లా వైస్ ప్రెసిడెంట్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిధులతో నడుస్తూ నిరంతరం పౌరులకు సేవ చేయాల్సిన సచివాలయం ఏమైనా అధికారుల సొంత రహస్య స్థావరా ? చట్టప్రకారం ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిన వ్యవస్థలో ఇలాంటి బాధ్యతారాహిత్యం ఏమాత్రం సహించరానిదని మండిపడ్డారు.

### చట్టాన్ని చుట్టేసిన అధికారులు

సమాచార హక్కు చట్టంలోని సెక్షన్ 4(1)(బి) ప్రకారం ప్రతి ప్రభుత్వ సంస్థ లేదా ప్రభుత్వ నిధులతో నడిచే కార్యాలయం తమకు సంబంధించిన ప్రాథమిక సమాచారాన్ని అధికారుల వివరాలను ప్రజలకు స్పష్టంగా కనిపించేలా బోర్డుల రూపంలో ప్రదర్శించడం చట్టబద్ధమైన విధి. ప్రజల సౌకర్యార్థం మరియు పారదర్శకత కోసం గ్రామ సచివాలయాల స్థాయిలో కూడా సహాయ పౌర సమాచార అధికారి పౌర సమాచార అధికారి మరియు మొదటి అప్పిలేట్ అధికారుల పేర్లు ఫోన్ నెంబర్లతో కూడిన బోర్డులను విధిగా ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గతంలోనే జీవో జారీ చేసింది.

కానీ స్వర్ణ కిరికెర-1 ఈ బోర్డు ఎక్కడా కంటికి కనిపించకపోవడం గమనార్హం. నిబంధనల ప్రకారం ఇక్కడ పౌర సమాచార అధికారి పంచాయతీ కార్యదర్శి మరియు మొదటి అపిలేట్ అధికారి మండల పరిషత్ అభివృద్ధి అధికారి వివరాలు బోర్డుపై ఉండాలి కానీ అధికారులు ఈ నియమాలను తుంగలో తొక్కారూ ప్రభుత్వం చట్టాలు చేసి జీవోలు విడుదల చేస్తున్నా క్షేత్రస్థాయిలో వాటిని అమలు చేయాల్సిన అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లు వ్యవహరించడం పౌరుల హక్కులను కాలరాయడమేనని అని తెలియజేశారు

సచివాలయాల్లో పారదర్శకత లోపించడం అధికారులు అవినీతికి అక్రమాలకు పాల్పడినప్పుడే బోర్డులు పెట్టడానికి అధికారులు భయపడుతున్నారని ఆర్టిఐ ఫైట్ ఫర్ సోషల్ జస్టిస్' సంస్థ ఏహెచ్ అంజి ఆరోపించారు బోర్డులు ఏర్పాటు చేస్తే పౌరులు తమ హక్కులను తెలుసుకుంటారని తద్వారా లోపల జరుగుతున్న అవినీతి అక్రమాలు నిధుల మళ్లింపుల గుట్టు రట్టవుతుందనే భయంతోనే అధికారులు ఈ సమాచారాన్ని దాస్తున్నారని విమర్శించారు. బోర్డు పెట్టకపోవడానికి కార్యాలయంలోని అధికారులు లోపల ఏ విధమైన లంచాల జాతర నడుపుతున్నార సమాధానం చెప్పాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు

గ్రామ సచివాలయాలు ఏర్పాటైన ముఖ్య ఉద్దేశమే అవినీతి రహిత పాలన మరియు సేవలను ప్రజల చెంతకు చేర్చడం. ప్రతి పౌరుడికి తన గ్రామానికి వచ్చే నిధులు జరుగుతున్న పనుల వివరాలు తెలుసుకునే హక్కు ఉంది కానీ ఆ హక్కును ఎలా ఉపయోగించుకోవాలో చెప్పే కనీస ఆర్టీఐ బోర్డు కూడా లేకపోవడం వల్ల సచివాలయాల ఆశయానికే గండి పడుతోందని సామాజిక విశ్లేషకులు భావిస్తున్నారు

కమిషన్ దృష్టికి తీసుకెళ్తాం -- అధికారులపై చర్యలు తప్పవు!
సమాచార హక్కు చట్టం దరఖాస్తుల పట్ల నిర్లక్ష్యం వహించిన చట్టాన్ని ఉల్లంఘించి బోర్డు ఏర్పాటు చేయకుండా నిర్లక్ష్యం వహించిన అధికారులపై సమాచార హక్కు చట్టం సెక్షన్ 20 ప్రకారం రోజుకు రు.250 చొప్పున గరిష్టంగా రు.25,000 వరకు వ్యక్తిగత జరిమానా విధించే అధికారం రాష్ట్ర సమాచార కమిషన్‌కు ఉందని గుర్తు చేశారు ఈ జరిమానా మొత్తాన్ని సదరు అధికారి జీతం నుంచే రికవరీ చేయడంతో పాటు వారిపై శాఖాపరమైన కఠిన క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు కమిషన్ సిఫార్సు చేస్తుంది పౌరుల హక్కులకు సంబంధించినది కనుక

తక్షణమే హిందూపురం మండల పరిషత్ అభివృద్ధి అధికారి మరియు శ్రీ సత్య సాయి జిల్లా పంచాయతీ అధికారి స్పందించి కిరికెర-1 గ్రామ సచివాలయంలో ఆర్టీఐ బోర్డును యుద్ధప్రాతిపదికన ఏర్పాటు చేయించాలని డిమాండ్ చేశారు లేనియెడల చట్టాన్ని నిర్లక్ష్యం చేసిన అధికారులపై నేరుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమాచార కమిషన్ కు అధికారికంగా రాతపూర్వక ఫిర్యాదు చేసి సంబంధిత అధికారులపై శాఖ పరమైన చర్యలు తీసుకునే విధంగా ఆర్టిఐ ఫైట్ ఫర్ సోషల్ జస్టిస్ సంస్థ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో చట్టపరమైన పోరాటాన్ని ఉధృతం చేస్తామని శ్రీ సత్యసాయి జిల్లా వైస్ ప్రెసిడెంట్ ఏహెచ్ అంజి తెలియజేశారు

## గ్రీన్ అంబాసిడర్ల సేవలు అభినందనీయం ఎంపీడీఓ పుల్లయ్య




**నందవరం, సెప్టెంబర్ 30(ప్రజాజ్యోతి ):**హాలహర్వి గ్రామం లో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా గ్రామాల పరిశుభ్రతకు సేవలందిస్తున్న గ్రీన్ అంబాసిడర్లను ఘనంగా సన్మానించారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి పుల్లయ్య గ్రీన్ అంబాసిడర్లను శాలువా, పూలమాలలతో సత్కరించి వారి సేవలను కొనియాడారు. ప్రతి ఒక్కరూ తమ ఇల్లు, వీధి, గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పారిశుధ్య నిర్వహణలో గ్రీన్ అంబాసిడర్లకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ అభివృద్ధి అధికారి సుజాత, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## పారిశుధ్య కార్మికులు కు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య పరీక్షలు.



**పోడూరు.** ప్రజాజ్యోతి రిపోర్టర్ కొట్టి రామం.. సెప్టెంబర్ **30.**పోడూరు మండలంలోని అన్ని గ్రామాలలో పారిశుధ్య కార్మికులకు మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో బుధవారం వైద్య పరీక్షలు జరిపారు. అవసరమైన వారికి ల్యాబ్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డా ఎస్ శ్రీ వాసవి మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులకు ఆరోగ్య పరిరక్షణ చాలా అవసరమని అందువలన వారికి వారి కుటుంబ సభ్యులు కు వైద్యపరీక్షలు చేయించడం ద్వారా స్వస్థత గా వారి సేవలు మరింత గా ఉపయోగపడతాయని అన్నారు. ఈ కార్యక్రమం లో డిప్యూటీ ఎంపీడీఓ పడాల నాగిరెడ్డి కార్యదర్శులు చిట్టాల ఫణికుమార్ వెంకటలక్ష్మి ఐ బాలాజీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ కె బి కె ఎస్ రమేష్ రెడ్డి ఆరోగ్య విస్తరణ అధికారి జె సత్యనారాయణ పి హెచ్ ఎన్ ఎస్ మీరమ్మ ఆరోగ్య పర్యవేక్షకులు పద్మ కుమారి పి సుధారాణి హెల్త్ అసిస్టెంట్ లు జి అమ్మిరాజు జె శ్రీనివాస్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు

## మడికి నర్సరీ వద్ద యువకుడి అనుమానాస్పద మృతి,హత్య కోణంలోనూ దర్యాప్తు ముమ్మరం చేసిన పోలీసులు.




**ఆలమూరు, సెప్టెంబర్ 30 (ప్రజాజ్యోతి):** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం మడికి గ్రామంలోని నాగులపేట--మల్లవాని తోట మార్గంలో నర్సరీలో ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. మృతుడిని మడికి గ్రామం చిలకలపాడుకు చెందిన మింగి రమేష్ (24)గా పోలీసులు గుర్తించారు స్థానికుల నుంచి సమాచారం అందుకున్న ఆలమూరు ఎస్సై జి. నరేష్ విషయాన్ని కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్, రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్ విద్యాసాగర్‌కు తెలియజేశారు. వారి ఆదేశాల మేరకు పోలీసు సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.యువకుడి మృతి అనుమానాస్పదంగా ఉండటంతో పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. ప్రమాదమా,హత్య జరిగిందా అనే కోణంలోనూ విచారణ కొనసాగిస్తున్నారు. సంఘటనా స్థలంలో ఆధారాల సేకరణ కోసం డాగ్ స్క్వాడ్, ఆర్ఎస్ఎఫ్ఎల్ బృందంతో పాటు ఫోరెన్సిక్ నిపుణుల సహకారం తీసుకుంటున్నారు.డీఎస్పీ, సీఐ, ఎస్సైలు దర్యాప్తును వేగవంతం చేశారు. మృతికి గల పూర్తి కారణాలు దర్యాప్తు అనంతరం వెల్లడవుతాయని ఎస్సై నరేష్ తెలిపారు.

## బేతంచెర్లలో సాధారణ కౌన్సిల్ సమావేశం




**బేతంచెర్ల, సెప్టెంబర్ 30(ప్రజా జ్యోతి)**బేతంచెర్ల నగర పంచాయతీ కార్యాలయంలో సాధారణ కౌన్సిల్ సమావేశం బుధవారం నిర్వహించారు. కమిషనర్ హరిప్రసాద్ ఆధ్వర్యంలో చైర్‌పర్సన్ సి. హెచ్. శేషాచలం రెడ్డి అధ్యక్షతన సమావేశం జరిగింది.సమావేశంలో పట్టణ అభివృద్ధి, ప్రజా సమస్యలు, మౌలిక వసతులు, పారిశుధ్య నిర్వహణ, పరిపాలనా అంశాలపై కౌన్సిల్ సభ్యులు సుదీర్ఘంగా చర్చించారు.సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు: పట్టణంలో అవసరమైన అభివృద్ధి పనులను గుర్తించి ప్రాధాన్యతా క్రమంలో చేపట్టాలని నిర్ణయించారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని, పారిశుధ్య నిర్వహణను మరింత మెరుగుపరచాలని నిర్ణయించారు. ప్రజల నుంచి అందుతున్న సమస్యలను పరిశీలించి వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి, పరిపాలనా అంశాలపై కూడా అవసరమైన చర్యలు తీసుకోవాలని కౌన్సిల్ నిర్ణయించింది.సమావేశంలో వైస్ చైర్‌పర్సన్లు, కౌన్సిల్ సభ్యులు, కోఆప్షన్ సభ్యులు, నగర పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

# మహిళలకు ఉచిత చేనేత శిక్షణా ప్రారంభం








**- 20 మగ్గాలపై శిక్షణా**
**- మహిళల స్వావలంబనే కూటమి ప్రభుత్వ లక్ష్యం**
**- మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి**
**- రాష్ట్ర పి.యూ.సి చైర్మెన్, ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్**
**- క్లస్టర్ ఏర్పాటుతో ఖాదీ ఉత్పత్తుల నాణ్యతతో పెరుగుదల**
**- ఖాదీ కార్మికుల అభివృద్ధికి మరింత అవకాశం**
**- జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్**

పొందూరు , ప్రజాజ్యోతి న్యూస్ :
మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించి, వారిని ఆర్థికంగా స్వావలంబులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఆమదాలవలస ఎమ్మెల్యే, రాష్ట్ర పి .యూ.సి చైర్మన్ కూన రవికుమార్ అన్నారు. పొందూరు పట్టణంలో ఖాదీ క్లస్టర్ ఏర్పాటులో భాగంగా మహిళలకు ఉచిత చేనేత శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. సాయిబాబా వీవర్స్ సొసైటీ నూతన భవనంలో డీఆర్డీఏ--సెర్ప్ ఆధ్వర్యంలో 20 మగ్గాలపై నిర్వహించనున్న ఈ శిక్షణ కార్యక్రమం మహిళల ఆర్థిక అభివృద్ధికి దోహదపడుతుందని పేర్కొన్నారు. మహిళలు ఆర్థికంగా బలపడినప్పుడే కుటుంబాలు, సమాజం అభివృద్ధి చెందుతాయని అన్నారు. మహిళలకు నైపుణ్య శిక్షణ అందించి, వారిలో ఉన్న ప్రతిభను వెలికితీయడం ద్వారా స్వయం ఉపాధి అవకాశాలను పెంచవచ్చని తెలిపారు. మహిళలు కేవలం కుటుంబ బాధ్యతలకే పరిమితం కాకుండా, పారిశ్రామికవేత్తలుగా ఎదిగి మరికొంతమందికి ఉపాధి కల్పించే స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.కూటమి ప్రభుత్వం మహిళా సాధికారతకు ప్రాధాన్యత ఇస్తోందని, డ్వాక్రా సంఘాల ద్వారా మహిళలకు ఆర్థిక సహకారం, రుణ సదుపాయాలు, ఉపాధి అవకాశాలు అందుబాటులోకి వస్తున్నాయని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మహిళలను స్వయం సహాయక సంఘాల సభ్యులుగా మాత్రమే కాకుండా, ఆర్థిక కార్యకలాపాల్లో భాగస్వాములుగా, విజయవంతమైన వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దే దిశగా కృషి చేస్తున్నారని అన్నారు.

**పొందూరు చేనేతకు ప్రపంచస్థాయి గుర్తింపు**

పొందూరు చేనేతకు ప్రత్యేకమైన గుర్తింపు ఉందని, ఇక్కడి నేత కార్మికుల నైపుణ్యం, సంప్రదాయ పద్ధతులు ఈ ప్రాంతానికి ప్రత్యేక గౌరవాన్ని తీసుకొచ్చాయని కూన రవికుమార్ అన్నారు. తరతరాలుగా వస్తున్న చేనేత కళను కాపాడుకోవడంతోపాటు, ఆధునిక సాంకేతికతను జోడించి మరింత అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు.ఖాదీ, చేనేత ఉత్పత్తులకు ప్రోత్సాహం కల్పించడం ద్వారా నేత కార్మికుల జీవన ప్రమాణాలను మెరుగుపరచవచ్చని పేర్కొన్నారు. నాణ్యమైన వస్త్రాల తయారీ, కొత్త డిజైన్లు, మార్కెట్ అవసరాలకు అనుగుణంగా ఉత్పత్తులు తయారు చేయడం వంటి అంశాల్లో శిక్షణ పొందితే మహిళలకు మరిన్ని ఉపాధి అవకాశాలు లభిస్తాయని అన్నారు.



**ఖాదీ క్లస్టర్‌తో స్థానికంగా ఉపాధి అవకాశాలు**

పొందూరులో ఖాదీ క్లస్టర్ అభివృద్ధి చెందడం ద్వారా చేనేత రంగానికి కొత్త అవకాశాలు ఏర్పడతాయని ఎమ్మెల్యే తెలిపారు. చేనేత ఉత్పత్తుల తయారీ నుంచి వాటి మార్కెటింగ్ వరకు వివిధ దశల్లో స్థానిక మహిళలు భాగస్వాములు కావడానికి అవకాశాలు ఉన్నాయని చెప్పారు.పొందూరులో ఖాదీ క్లస్టర్ మహిళలకు అందిస్తున్న ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకుని, నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. శిక్షణ అనంతరం మహిళలు స్వయంగా మగ్గాలపై వస్త్రాలు తయారు చేయడంతోపాటు, సమూహాలుగా ఏర్పడి ఉత్పత్తి కార్యక్రమాలు చేపట్టే దిశగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. స్థానికంగా తయారయ్యే చేనేత ఉత్పత్తులకు విస్తృత ప్రచారం కల్పించడం, వాటికి మార్కెట్ అవకాశాలను పెంపొందించడం ద్వారానేత కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించవచ్చని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ గ్రామీణ మహిళలు ఆర్థికంగా బలోపేతం అయినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ క్లస్టర్ ఏర్పాటుతో ఖాదీ ఉత్పత్తుల నాణ్యత పెరగడంతో పాటు నేత కార్మికుల ఆదాయం పెరిగే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, డి.ఆర్.డి. ఏ పీడీ కిరణ్ కుమార్ , టిడిపి మండల పార్టీ అధ్యక్షులు చిగిలపల్లి రామ్మోహన్, రాష్ట్ర నాగవంశ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్, టిడిపి మండల మహిళా అధ్యక్షురాలు అనకాపల్లి విజయలక్ష్మీ , జిల్లా కార్యదర్శి సీపాన శ్రీరంగ నాయకులు, జిల్లా తెలుగు యువత సెక్రటరీ లోలుగు వెంకట్ ,మండల ఉపాధ్యక్షులు బాడాన శేషగిరి , జిల్లా తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బలగ శంకర భాస్కర రావు,మాజీ ఏ.ఎం.సి చైర్మెన్ అన్నెపు రాము, పట్టణ పార్టీ అధ్యక్షులు అనకాపల్లి చిన రంగ,ఆనం పాపారావు ,కాలేపు శ్రీనివాస్ రావు ,అనూష,తహసీల్దార్ ఆర్ వెంకటేష్ , ఏ.పి.ఓ పైల శ్రీనివాస్ రావు ,ఈ.ఓ పొన్నాడ జగదీష్ ,ఆర్.ఎం.బి జె.ఈ పి.టి రాజు ,పి.ఆర్ జె.ఈ దయా సాగర్ , ఏపి.యం లు గురుగుబెల్లి శ్యామల రావు , ఆర్ రామ్మూర్తి ,మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు పైడి అరుణా , చేనేత ఏ.డి చనేత ఏడి జనార్ధన్ ,పర్సనల్ ఇంచార్జి శేఖర్,సాయిబాబా వీవర్స్ సొసైటీ మేనేజర్ వట్టం శ్రీనివాస్ రావు , మండల తెలుగుదేశం పార్టీ నాయకులు , కార్యకర్తలు, మాజీ ఎంపీటీసీలు , మాజీ సర్పంచులు , మహిళలు ,నేత కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# పల్లె పండగ 3.0 పనులకు పొందూరులో శ్రీకారం

**- చేనేత శిక్షణా కేంద్రం ప్రాంగణంలో రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ నిర్మాణానికి భూమిపూజ చేసిన ఎమ్మెల్యే కూన రవికుమార్, జిల్లా కలెక్టర్**

**పొందూరు , ప్రజాజ్యోతి న్యూస్:**గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధి, రైతుల జీవనోపాధి మెరుగుదల లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పల్లె పండగ 3.0 కార్యక్రమంలో భాగంగా పొందూరు గ్రామంలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. పొందూరు గ్రామంలోని చేనేత శిక్షణా కేంద్రం ప్రాంగణంలో రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ నిర్మాణ పనులకు ఆమదాలవలస ఎమ్మెల్యే, రాష్ట్ర పి.యూ.సి చైర్మన్ కూన రవికుమార్, జిల్లా కలెక్టర్‌తో కలిసి భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కూన రవికుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో పల్లె పండగ కార్యక్రమాన్ని గతంలో రెండు విడతలుగా నిర్వహించగా, గ్రామీణ ప్రాంతాల్లో చేపట్టిన అభివృద్ధి పనుల ద్వారా ప్రజల్లో సంతృప్తి పెరిగిందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ ఈ నెల 29న ఉదయగిరిలో పల్లె పండగ 3.0 కార్యక్రమాన్ని ప్రారంభించగా, దానికి కొనసాగింపుగా రాష్ట్రవ్యాప్తంగా అభివృద్ధి పనులు చేపడుతున్నారన్నారు.రూ.11,085 కోట్లతో గ్రామీణాభివృద్ధి పనులు పల్లె పండగ 3.0 ద్వారా రాష్ట్రవ్యాప్తంగా రూ.11,085 కోట్ల వ్యయంతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు వెల్లడించారు.ఇందులో భాగంగా సుమారు 6,000 కిలోమీటర్ల సిమెంట్ రోడ్లు, 9,500 కిలోమీటర్ల బీటీ రోడ్ల నిర్మాణానికి ప్రణాళిక రూపొందించారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధితో పాటు మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడంతో పాటు రైతుల ఆర్థిక స్థితిగతులను బలోపేతం చేసేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని పేర్కొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ పల్లె పండుగ 3.0 తో గ్రామాల అభివృద్ధికి శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. చిన్న, సన్నకారు రైతుల జీవనోపాధిని మెరుగుపరిచే లక్ష్యంతో సుమారు 22 వేల మంది రైతులకు పశువుల పెంపకానికి ఉపయోగపడే షెడ్ల నిర్మాణానికి అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు. అలాగే గ్రామాల్లో మురుగునీటి నిర్వహణ కోసం మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణం చేపట్టనున్నారు. సుమారు 50 వేల ఎకరాల్లో చిన్న, సన్నకారు రైతుల భూములపై పండ్ల తోటలు, పూల తోటల పెంపకాన్ని ప్రోత్సహించేందుకు ప్రణాళికలు రూపొందించారు.

**ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి**

పల్లె పండగ 3.0 ద్వారా కల్పిస్తున్న అభివృద్ధి, ఉపాధి అవకాశాలను ప్రజలు, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో డి.ఆర్.డి. ఏ పీడీ కిరణ్ కుమార్, ఎంపీడీఓ ఎస్. వాసుదేవరావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ చిగిలపల్లి పద్మావతి, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చిగిలపల్లి రామ్మోహన్, రాష్ట్ర నాగవంశ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్, టిడిపి మండల మహిళా అధ్యక్షురాలు అనకాపల్లి విజయలక్ష్మీ, జిల్లా కార్యదర్శి సీపాన శ్రీరంగ నాయకులు ,జిల్లా తెలుగు యువత సెక్రటరీ లోలుగు వెంకట్ , జిల్లా తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బలగ శంకర




భాస్కర రావు,పట్టణ పార్టీ అధ్యక్షులు అనకాపల్లి చిన రంగ , బాడాన హారిక ,పి లక్ష్మీ,ఏపీఓ శ్రీనివాస్‌తో పాటు వివిధ శాఖల మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## సమాజ నిర్మాణంలో గురువుల పాత్ర అమోఘం

**ఉపాధ్యాయురాలు గుంపెనపల్లి అచ్చుమ్మకు ఘన సన్మానం**
**విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఆమె సేవలు ఆదర్శనీయం**
**మాజీ వైస్ ఎంపీపీ దొంతు మంగేశ్వరరావు**

**ఎటపాక, సెప్టెంబర్ 30 (ప్రజాజ్యోతి):**విద్యార్థుల భవిష్యత్తుకు సరైన మార్గదర్శనం చేస్తూ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషిస్తున్నారని ఎటపాక మాజీ వైస్ ఎంపీపీ దొంతు మంగేశ్వరరావు కొనియాడారు. మండల పరిధిలోని రాయనపేట పంచాయతీ కె.ఎన్.పురం పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న గుంపెనపల్లి అచ్చుమ్మ పదవీ విరమణ, వీడ్కోలు సభ బుధవారం పాఠశాల ప్రాంగణంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన దొంతు మంగేశ్వరరావుతో పాటు సీనియర్ న్యాయవాది, మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోట దేవదానం పాల్గొని అచ్చుమ్మ దంపతులను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. అనంతరం మంగేశ్వరరావు మాట్లాడుతూ.. దేశ భవిష్యత్తు తరగతి గదుల్లోనే రూపుదిద్దుకుంటుందని, విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులు శక్తివంచన లేకుండా కృషి చేయాలని పిలుపునిచ్చారు. సుదీర్ఘ కాలం పాటు నిస్వార్థ సేవలందించి పదవీ విరమణ పొందుతున్న అచ్చుమ్మ శేష జీవితం ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో సాగాలని




ఆకాంక్షించారు. ఈ వీడ్కోలు సభలో స్థానిక ప్రజాప్రతినిధులు, న్యాయవాదులు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని అచ్చుమ్మకు శుభాకాంక్షలు తెలిపారు.

## ప్లాస్టిక్ రహిత గ్రామాలే లక్ష్యం..

**-- గ్రామ ప్రత్యేక అధికారి వి. రాజుబాబు**




**-- బౌరువాక లో తడి పొడి చెత్త పై అవగాహన**

**కాకినాడ జిల్లా సెప్టెంబర్ 30 (ప్రజాజ్యోతి స్టాఫ్ రిపోర్టర్)** ప్లాస్టిక్ రహిత గ్రామాల నిర్మాణమే ధ్యేయమని గ్రామ ప్రత్యేక అధికారి, ఎంఈఓ వి.రాజుబాబు తెలిపారు. మండలంలోని బవురువాక గిరిజన గ్రామంలో ప్రత్యేక అధికారి అధ్యక్షతన 'స్వచ్ఛత హీ సేవా' కార్యక్రమాన్ని నిర్వహించారు. డిప్యూటీ ఎంపీడీఓ జి. ఉషారాణి గ్రామస్తులకు ప్లాస్టిక్ నివారణపై సూచనలు చేశారు. కాకినాడ డి పి ఆర్ సి బృందం ప్రతినిధులు గణేష్, లక్ష్మణ్ 'బిన్ అండ్ బ్యాగ్' విధానం, వ్యర్థాల నిర్వహణ నిబంధనలపై అవగాహన కల్పించారు. అనంతరం రిటైర్డ్ ఎండోమెంట్ ఉద్యోగి గోరస శ్రీనివాస్ అందజేసిన క్లాత్ బ్యాగ్‌లను అధికారులు, కూటమి నాయకులు కలిసి స్థానిక మహిళలకు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా "మన బవురువాక – మన బాధ్యత" అనే నినాదంతో గ్రామంలో ర్యాలీ చేపట్టి, ప్లాస్టిక్ వాడబోమని గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ అభివృద్ధి అధికారి ఆర్. వీరబాబు, కూటమి నాయకులు, అంగన్వాడీ, వెలుగు సిబ్బంది, గ్రామ సచివాలయ సిబ్బంది, ఎలిమెంటరీ స్కూల్ హెచ్‌ఎం, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## బీజేపీని బలోపేతం చెయ్యాలి -జిల్లా అధ్యక్షుడు పిలపు



**ఎమ్మిగనూరు, సెప్టెంబర్ 30 (ప్రజాజ్యోతి ):** పట్టణంలోని బీజేపీ అసెంబ్లీ కార్యాలయాన్ని బీజేపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు అక్కమతోట రామకృష్ణ, ఆదోని బీఎల్ఎ-1 రమేష్ యాదవ్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతం, రాబోయే స్థానిక ఎన్నికలు, ఎమ్మిగనూరు నియోజకవర్గంలోని ముఖ్యమైన అంశాలపై నాయకులు చర్చించారు. నియోజకవర్గంలో పార్టీ కార్యకలాపాల విస్తరణ, కార్యకర్తల సమన్వయం, ప్రజా సమస్యల పరిష్కారానికి స్పందన తదితర అంశాలపై అభిప్రాయాలను పంచుకున్నారు. అసెంబ్లీ కార్యాలయం భాజపా జిల్లా అధికార ప్రతినిధి గురురాజా దేశాయ్ ద్వారా ప్రజలు, కార్యకర్తల సమస్యల పరిష్కారానికి చేస్తున్న కృషిపై జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ సంతృప్తి వ్యక్తం చేశారు. నాయకులు, కార్యకర్తల సమన్వయంతో పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు.ఈ కార్యక్రమం లో కల్లెల శివ బిజెపి నాయకులు పట్టణ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పౌరహక్కుల పై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలి... తాసిల్దార్ రజనీకాంత్ రెడ్డి

**:-ప్రతి ఒక్కరూ విద్యను అభ్యసించాలి విద్య ద్వారా సమాజంలో**
**ఉన్నత స్థానాలను సాధించవచ్చు... ఆర్ఐ తిక్క స్వామి**



**కౌతాళం, సెప్టెంబర్ 30 ప్రజా జ్యోతి**కౌతాల మండల పరిధిలోని ధోవి గ్రామంలో ప్రాథమిక పాఠశాల నందు ఎస్సీ కాలన వాసులకు జాతీయ పౌర హక్కుల దినోత్సవ సందర్భంగా వారికి అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా తాసిల్దార్ రజనీకాంత్ రెడ్డి,ఆర్ఐ తిక్క స్వామి రావడం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా చట్టపరమైన మార్గంలో అధికారులను సంప్రదించాలని సూచించారు. అనంతరం ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ చట్టం,పౌర హక్కులపై ప్రజలకు అవగాహన కల్పించారు.ప్రతి ఒక్కరూ విద్యను అభ్యసించాలని, విద్య ద్వారా సమాజంలో ఉన్నత స్థానాలను సాధించవచ్చని తెలిపారు.పౌర హక్కులపై అవగాహన అవసరం పౌరహక్కుల పై ప్రతి ఒకరు అవగాహన కలిగి ఉండాలని అయన పేర్కొన్నారు. అదే విదంగా భారత రాజ్యాంగం కల్పించిన హక్కులకు ఎలాంటి భంగం కలిగినా చట్టపరమైన చర్యలుంటాయన్నారు. భంగం కలిగించినవారు ఎవరైనా సరే శిక్షార్హులవుతారన్నారు. కులవివక్ష, అంటరానితనం, వృద్ధులు,మైనార్టీ, దళిత,వెనుకబడిన, జీవించే హక్కు,రక్షణ పొందే హక్కు, ప్రజాస్వామపు హక్కు సమాన ఉపాధి హామీ తదితర హక్కుల గురించి వివరించారు. కులమతాలకు అతీతంగా అందరు కలిసి ఉండాలని సూచించారు. రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వారికి రాజ్యాంగం హక్కులు కల్పించిందన్నారు. వీటిని అన్నివర్గాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ రజనీకాంత్ రెడ్డి,రెవిన్యూ ఇన్స్పెక్టర్ తిక్క స్వామి,విఆర్వో నాగర్జున, వీఆర్ఏలు ప్రహల్లాద,ఉచ్చప్ప మరియు రిపోర్టర్ ఈరన్న,రవి, నర్సింగప్ప, వెంకటేష్, గంగప్ప,వీరేష్,ఈరన్న, విజయ్ ఎస్సీ కాలనీ ట్రీలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## నెల రోజుల పాటు ఏకశిలా హాస్పిటల్ లో ఉచిత ఓపీ.. ప్రజలకు ఉచిత సీపీఆర్ శిక్షణ






**భారతీయ వెలుగు, హనుమకొండ, సెప్టెంబర్ 30:**యువతలోనూ గుండెపోటు ఘటనలు పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోందని ఏకాశిల ఆస్పత్రి వైద్యులు తెలిపారు. ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా గుండె వ్యాధులపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు ఆస్పత్రి ఆధ్వర్యంలో నెల రోజుల పాటు ఉచిత ఓపీ సేవలు, ఉచిత సీపీఆర్ శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఆస్పత్రిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జి. రమేష్, మెడికల్ డైరెక్టర్, ఎమర్జెన్సీ అండ్ క్రిటికల్ కేర్ విభాగం అధిపతి డాక్టర్ అసిఫ్ ఇక్బాల్ ఎస్కే, జనరల్ మేనేజర్ శ్రీదేవి మాట్లాడారు. గుండె సంబంధిత వ్యాధులు వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలు, సకాలంలో వైద్య సలహాలు తీసుకోవడం అవసరమని తెలిపారు. పేద, మధ్యతరగతి ప్రజలకు నిపుణులైన వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో నెల రోజుల పాటు ఉచిత ఓపీ సేవలను అందిస్తున్నట్లు చెప్పారు. గుండెపోటు సమయంలో అంబులెన్స్ వచ్చే వరకు సీపీఆర్ అందించడం ద్వారా బాధితుడి ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందని డాక్టర్ అసిఫ్ ఇక్బాల్ తెలిపారు. ఇందుకోసం యువత, విద్యార్థులు, వాలంటీర్లు, సాధారణ పౌరులకు ఆస్పత్రిలో ఉచిత సీపీఆర్ శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఆసక్తి ఉన్నవారు ఆస్పత్రిలో పేర్లు నమోదు చేసుకుని నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో శిక్షణ పొందవచ్చన్నారు. ప్రజలు ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకుని గుండె ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఏకశిలా హాస్పిటల్ యజమాన్యం సూచించారు.

## డీమార్ట్ సమీప జెఎస్ బేకరీలోనాణ్యత డొల్ల.. బూజు పట్టిన క్రీమ్ రోల్ వెలుగులోకి నాణ్యత లేని ఆహారంపై నిఘా ఏది?.. ఫుడ్ సేఫ్టీ అధికారుల తీరుపై ఆగ్రహం




**భారతీయ వెలుగు సూర్యాపేట జిల్లా ప్రతినిధి** సూర్యాపేట జిల్లా కేంద్రంలోని డీమార్ట్ సమీపంలో ఉన్న జెఎస్ బేకరీలో నాణ్యత లోపం వెలుగులోకి వచ్చింది. బేకరీలో కొనుగోలు చేసిన క్రీమ్ రోల్ బూజు పట్టి పాడై ఉండటంతో వినియోగదారుడు ఆగ్రహం వ్యక్తం చేశాడు. వినియోగదారుడు భూపతి నగేష్ తన గర్భిణీ భార్య కోసం ఎగ్ పఫ్‌తో పాటు క్రీమ్ రోల్‌ను కొనుగోలు చేసి ఇంటికి తీసుకెళ్లాడు. క్రీమ్ రోల్ ను తింటూ ఉండగా బూజు పట్టి పాడైపోయినట్లు గుర్తించాడు. దీంతో వెంటనే బేకరీ యాజమాన్యాన్ని ప్రశ్నించగా, సరైన సమాధానం ఇవ్వకుండా పొంతనలేని సమాధానాలు చెప్పారని తన భార్య గర్భిణీ కావడంతో ఏదైనా జరిగితే పరిస్థితి ఏంటని నగేష్ ఆవేదన వ్యక్తం చేశాడు .నాణ్యత లేని ఆహార పదార్థాలను విక్రయించడం ప్రజల ఆరోగ్యానికి ప్రమాదకరమని పేర్కొన్నారు. బేకరీలో విక్రయించే ఆహార పదార్థాల నాణ్యత, తయారీ మరియు నిల్వ విధానాలను ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీ చేయాలని స్థానికులు కోరుతున్నారు.ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడేలా నాణ్యత లేని ఆహార పదార్థాలను విక్రయించే వారిపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## జిల్లా కాంగ్రెస్ నాయకులు కొండం వెంకన్న తల్లి కొండం వెంకమ్మ ప్రధమ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న

-- డిసిఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల, కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి





**భారతీయ వెలుగు న్యూస్ భద్రాది కొత్తగూడెం జిల్లా ప్రతినిధి వి రాములు.** జిల్లా కాంగ్రెస్ నాయకులు, పాల్వంచ మండలం పరిధిలోని జగన్నాధపురం గ్రామస్తులు కొండం వెంకన్నగౌడ్, కొండం పుల్లయ్య, కొండం అర్జున్ రావు, కొండం అయోధ్య బాబుల మాతృమూర్తి కొండం వెంకమ్మ ప్రధమ వర్ధంతి సందర్భంగా డిసిఎంఎస్ మాజీ చైర్మన్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్, పాల్వంచ సొసైటీ అధ్యక్షులు కొత్వాల శ్రీనివాసరావు, పాత పాల్వంచ 46వ డివిజన్ కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి లు పాల్గొని, నివాళులర్పించారు. కుమారులకు, కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి, సంతాపం తెలిపారు.

## గ్యాస్ డెలివరీలలో అదనపు వసూళ్లకు అడ్డుకట్ట...

:-కౌతాళంలో ఆర్డీవో ఆకస్మిక తనిఖీలు

:-దీపం లబ్ధిదారులను అడిగి తెలుసుకోని అలాగే గ్యాస్ గోడన్ తనిఖీ చేసిన ఆర్డీవో అరుణాదేవి




**కౌతాళం,సెప్టెంబర్ 30 ప్రజా జ్యోతి** మండల కేంద్రమైన కౌతాళంలో బుధువారం రోజున గ్యాస్ గోడౌన్‌ను ఆదోని డివిజన్ ఆర్డీవో అరుణ దేవి, తహసీల్దార్, సీఎస్‌డీటీ,డీఐఓలతో కలిసి తనిఖీ చేశారు. గ్యాస్ నిల్వలు, సరఫరా విధానం, వినియోగదారులకు గ్యాస్ డెలివరీ ప్రక్రియ తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాటాడుతూ దీపం పథకం లబ్ధిదారులతో, గ్యాస్ సరఫరా, డెలివరీ సమయంలో చెల్లించాల్సిన ధరలు, అనుమతించబడిన ఛార్జీలపై అవగాహన కల్పించారు.గ్యాస్ డెలివరీకి సంబంధించి వినియోగదారుల నుంచి నిర్ణయించిన ధరలకు మించి అదనపు మొత్తాలు వసూలు చేయకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు.అదేవిధంగా ఎరిగేరి కౌతాళం గ్రామాల్లో దీపం పథకం లబ్ధిదారులతో మాట్లాడి,గ్యాస్ వినియోగం,డెలివరీ ధరలు,ఛార్జీలపై అవగాహన కల్పించారు.గ్యాస్ సరఫరాకు సంబంధించి లబ్ధిదారులకు ఏవైనా సమస్యలు ఎదురైతే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. అనంతరం కౌతాళం గ్రామంలో ఫేజ్--6లో జరుగుతున్న రీ సర్వే జీటీ పనులను ఆర్డీవో అరుణ దేవి తహసీల్దార్, సంబధిత అధికారులతో కలిసి పరిశీలించారు. పనుల పురోగతి, నాణ్యత అమలు తీరుపై వివరాలు తెలుసుకుని,నిర్దేశిత ప్రమాణాల మేరకు పనులను పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో అరుణాదేవి తాసిల్దార్ రజనీకాంత్ రెడ్డి, ఆయా శాఖకు సంబంధించిన అధికారులు పాల్గొన్నారు.

## జగన్మోహన్ రెడ్డిని కలిసిన ఎమ్మిగనూరు వైస్సార్సీపీ నాయకులు మురారిరెడ్డి



**ఎమ్మిగనూరు, సెప్టెంబర్ 30(ప్రజా జ్యోతి ):** మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని వైఎస్సార్సీపీ కర్నూలు జిల్లా ఉపాధ్యక్షులు కే.ఆర్. మురహరి రెడ్డి బుధవారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పార్టీకి సంబంధించిన పలు అంశాలపై చర్చించినట్లు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అందరూ సమన్వయంతో పని చేసే విధంగా ముందుకు పోవాలని ఆయన సూచించారు.

## అంతర్జాతీయ క్రికెట్‌కు ఐర్లాండ్ ఆల్‌రౌండర్ వీడ్కోలు..!




ఐర్లాండ్ ఆల్‌రౌండర్ సిమి సింగ్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. భారత్ నుంచి వలస వెళ్లి ఐరిష్ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన సిమి.. 39 ఏళ్ల వయసులో రిటైర్మెంట్ ప్రకటించాడు. రెండేళ్ల క్రితం తీవ్ర అనారగ్యంతో బాధపడిన అతడు.. ఈమధ్యే పూర్తిగా కోలుకున్నాడు. కానీ, కుర్రాళ్ల నుంచి పోటీ ఎక్కువవ్వడం, వయసు పైబడడంతో పునరాగమనం అసాధ్యమని తెలిసి మంగళవారం హఠాత్తుగా ఆటకు అల్విదా చెప్పేశాడు. అంతర్జాతీయ క్రికెట్ నుంచి ఐర్లాండ్ ఆటగాడు సిమి సింగ్ రిటైరయ్యాడు. భారత్ నుంచి 19 ఏళ్ల వయసులో ఆ దేశం వెళ్లిన సిమి.. క్రికెటర్‌గా రాణించాడు. 2017లో అరంగేట్రం చేసిన సిమి.. వీడ్కోలు మ్యాచ్ లేకుండానే తొమ్మిదేళ్ల కెరీర్‌ను ముగించాడు. నాలుగేళ్ల క్రితం టీ20 వరల్డ్‌కప్ ఆడిన ఆ ఆల్‌రౌండర్ 2021లో ఐసీసీ పురుషుల వన్డే జట్టులో చోటు సంపాదించాడు. 29 ఏళ్లకు డెబ్యూ క్యాప్ అందుకొని న్యూజిలాండ్‌పై తొలి మ్యాచ్ ఆడిన సిమి.. ఐర్లాండ్ తరఫున 88 మ్యాచ్(35 వన్డేలు, 53 టీ20లు)లు ఆడాడు. బంతితో రాణించి 83 వికెట్లు తీసిన అతడు 2021లో దక్షిణాఫ్రికా అజేయ శతకం సాధించాడు. ఆ మ్యాచ్‌లో సఫారీలపై ఎనిమిదో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన వన్డే సెంచరీ బాదిన తొలి ఆటగాడిగా సిమి చరిత్ర సృష్టించాడు. క్రికెట్ కెరీర్ కొనసాగుతున్న సమయంలోనే సిమి సింగ్ అనారోగ్యానికి గురయ్యాడు. 2024లో అతడు కాలేయ మార్పిడి చేయించుకున్నాడు. ఇటీవలే పూర్తిగా కోలుకున్నాడు. ప్రస్తుతం అతడికి 39 ఏళ్లు. దాంతో.. ఇక పునరాగమనం కష్టమే అనుకున్న సిమి వీడ్కోలు ప్రకటించాడు.

## వండర్‌ఫుల్‌గా వర్క్‌ప్లేస్‌లు.. హ్యాపీ స్పేసెస్ ఇండియాకు పదేళ్లు

ముంబై: హ్యాపీ స్పేసెస్ ఇండియా డిజైన్ స్టూడియో.. దేశవ్యాప్తంగా తన ప్రత్యేకత చాటుకుంటున్నది. ఎన్నో సంస్థలకు వర్క్‌ప్లేస్‌లను అందంగా రూపొందించిన ఆ సంస్థకు ఇప్పుడు పదేళ్లు నిండాయి. వివిధ రకాల కంపెనీలను ఆకర్షణీయంగా మార్చిన ఘనత ఆ కంపెనీకి దక్కుతోంది. పని ప్రదేశాలను కొత్త అందాలతో తీర్చిదిద్దతూ.. ఆయా కంపెనీ ఉద్యోగుల్లో తమ కళాత్మక సందేశాలతో ఉత్తేజాన్ని నింపుతోంది. సుమారు 16 నగరాల్లోని దాదాపు 2.5 మిలియన్ల చదరపు అడుగుల విస్తీర్ణంలోని వర్క్‌ప్లేస్‌లను సుందరీకరణ చేసింది ఆ సంస్థ. ఎన్నో ప్రఖ్యాత కంపెనీలకు వర్క్‌ప్లేస్‌లను డిజైన్ చేసింది హ్యాపీ స్పేసెస్ ఇండియా. టాటా కెమికల్స్, రోల్స్ రాయ్స్, డీ బీర్స్, క్రిసెల్, జైడస్, గోద్రేజ్, ఆంబిట్, ఎస్కేఎఫ్, గ్రీవ్స్ కాటన్, ఎస్బీఐ జనరల్ ఇన్సూరెన్స్, ఆమ్‌డాకస్, బ్రిడ్జ్‌స్టోన్ లాంటి కంపెనీలు హ్యాపీ స్పేసెస్ ఇండియా డిజైన్ చేసిన వర్క్‌ప్లేస్‌లనే వాడుతున్నాయి. హ్యాపీ స్పేసెస్ ఇండియా డిజైన్ స్టూడియోను ఎలిగ్జిర్ ఇంటిగ్రేటెడ్ బ్రాండ్‌కామ్ స్థాపించింది.

## పాఠశాల అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలి ఎమ్మెల్యే డా. బి.వి. జయ నాగేశ్వర రెడ్డి



**ఎమ్మిగనూరు,సెప్టెంబర్ 30(ప్రజా జ్యోతి ):** నియోజకవర్గం లో నిన్న జరిగిన స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసి) ఎన్నికల్లో చైర్మన్లుగా ఎన్నికైన వారు ఎమ్మిగనూరు ఎమ్మెల్యే డా. బి.వి. జయ నాగేశ్వర రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పూలమాల, శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీవీ నూతనంగా ఎన్నికైన చైర్మన్లకు శుభాకాంక్షలు తెలియజేసి, పాఠశాలల అభివృద్ధి, మౌలిక వసతుల మెరుగుదల, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, కమిటీ సభ్యులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. “పిల్లల భవిష్యత్తే మన బాధ్యత.. పాఠశాలల అభివృద్ధి కోసం అందరం కలిసి పనిచేద్దాం” అని ఎమ్మెల్యే తెలిపారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాలకు సౌండ్ సిస్టం వితరణ

- రూ.18 వేల విలువైన మైక్ సిస్టం అందజేసిన యంగ్ స్టార్ యూత్ క్లబ్ సభ్యులు గుడ్ల చంద్రశేఖర్




**పొందూరు , ప్రజాజ్యోతి న్యూస్:**పొందూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, యంగ్ స్టార్ యూత్ క్లబ్ సభ్యులు గుడ్ల చంద్రశేఖర్ రూ.18 వేల విలువైన మైక్ సౌండ్ సిస్టంనుకళాశాల ప్రిన్సిపాల్ కు అందజేశారు. కళాశాలలో విద్యార్థులకు నిర్వహించే వివిధ విద్యా, సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు సమావేశాలు, ఇతర కార్యక్రమాల నిర్వహణకు ఈ సౌండ్ సిస్టం ఎంతగానో ఉపయోగపడుతుందని ఈ సందర్భంగా తెలిపారు.విద్యార్థుల అవసరాలను గుర్తించి సౌండ్ సిస్టంను అందజేయడం అభినందనీయమని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.విద్యార్థుల అభివృద్ధికి ,కళాశాల కార్యక్రమాల నిర్వహణకు తోడ్పడేలా రూ.18 వేల సౌండ్ సిస్టమ్ ను అందించిన గుడ్ల చంద్ర శేఖర్ కు కళాశాల ప్రిన్సిపాల్ తో పాటు అధ్యాపకులు , విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

## రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చిన కౌతాళం వైసీపీ మండల కన్వీనర్ దేశాయి ప్రహ్లద ఆచారి



**కౌతాళం,సెప్టెంబర్ 30 ప్రజా జ్యోతి** మంత్రాలయం నియోజవర్గ వైఎస్ఆర్సిపి ఎమ్మెల్యే వై. బాలనాగి రెడ్డి ఆదేశాల మేరకు మరియు కౌతాళం మండల వైఎస్ఆర్సిపి కన్వీనర్ దేశాయి ప్రహ్లాద ఆచారి ఆధ్వర్యంలో కౌతాళంలో పార్టీ ఆఫీసు నందు కార్యకర్తల సమావేశం చేయడం జరిగింది. దేశాయి ప్రహ్లాద ఆచారి మాట్లాడుతూ వైఎస్ఆర్సిపి పార్టీ కార్యకర్తలు అందరూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని అలాగే కూటమి ప్రభుత్వం చేసే పనులు మరియు వివిధ హామీ పథకాలు ఇవ్వడం లేదని మరి రైతులకు అన్యాయం చేస్తున్న కూటమి ప్రభుత్వం గురించి ప్రజల్లో తీసుకువెళ్లాలని కార్యకర్తలకు మరియు నాయకులకు వివరించడం జరిగింది.ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ దేశాయి ప్రహ్లాద్ అచారి,వైస్ ఎంపీపీ బుజ్జి స్వామి, లింగారెడ్డి,నర్సిరెడ్డి మాజీ సర్పంచులు అవతారం,పాల్ దినకర్,మాజిఉప సర్పంచ్ సక్రి తిక్కయ్య,వడ్డే రాము, పూజారిలింగ, వెంకటరమరాజు, ఉమేష్,మహమ్మద్ వడ్డే చిన్నఉసేని, బెస్తేమరి స్వామి,బెస్త నాగరాజు, బెస్తనారాయణ,బెస్తరాగప్ప, కబడ్డీహరీష్,నరసింహ,వడ్డే అంజి, మహేంద్ర, మహమ్మద్, వడ్డే గురు,జి.డి.ఖదీర్, ఉపేంద్ర,సిద్ధ, రామకృష్ణ,ఉప్పర మల్లి,హనీఫ్, యాలికాసిం,సుధాకర్, ఎన్టీఆర్ నగర్ భాష, సోషల్ మీడియా మండల కన్వీనర్ ఖాదర్ లింగ మరియు వార్డ్ మెంబర్లు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ కాలనీలో అసంపూర్తిగా నిలిచిపోయిన రోడ్డు మరమ్మత్తులు చేపట్టిన సొసైటీ చైర్మన్ అల్లూరి వెంకటపతి రాజు.



**కౌతాళం సెప్టెంబర్ 30 ప్రజా జ్యోతి** గత ప్రభుత్వంలో నిలిచిపోయిన ఎస్సీ కాలనీలో రోడ్డు వలన కాలనీవాసులు వర్షాకాలంలో చాలా ఇబ్బంది పడుతున్నామని అల్లూరి వెంకటపతి రాజు దృష్టికి తీసుకెళ్లారు.ఈ విషయం తెలుసుకున్న వెంకటపతి రాజు నేడు స్వయంగా పర్యవేక్షించి ఎస్సీ కాలనీ వాసులకు అసౌకర్యం కలగకూడదని రోడ్డుపై గర్సు వేయించడం జరిగింది. అందుకుగాను కాలనీవాసులు వెంకటపతి రాజుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ అల్లూరి వెంకటపతి రాజు, మండల ఉపాధ్యక్షులు కురువ వీరేష్,టౌన్ ప్రెసిడెంట్ డాక్టర్ రాజానందు,టిడిపి నాయకులు రాజబాబు,చిన్న ఈరన్న, గురు తదితరులు పాల్గొన్నారు.

Printed by Sree Seshasai Enterprises Published by Vaddi Srinivas Reddy on behalf of Sai Krishna Publications, printed at # 3-88, Chandra Theater, Main Road, Gosala, Krishna District - 521151 Andhra Pradesh and published at D.No. 6-121, 1st Floor, Sphurthy Building, Gosala Village, Urdu School Street, Vijayawada, Krishna District-521151 Andhra Pradesh. Editor Vaddi Srinivas Reddy- 94402 31967 . PRGI No. APTEL/26/A0119,